మంగళవారం
14-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 23
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

గజాలో శాంతి వీచికలు

ఇజ్రాయిల్-హమాస్ మధ్య ఆగిన యుద్ధం

హమాస్ చెరనుంచి 20 మంది బందీల విడుదల

- పలస్తీనా ఖైదీల విడుదల ప్రారంభించిన ఇజ్రాయిల్
- ఇజ్రాయిల్ పార్లమెంటులో ట్రంప్ ప్రసంగం...నిరసన సెగ
- ట్రంప్‌కు ఇజ్రాయిల్, ఈజిప్ట్ అత్యున్నత పురస్కారాలు
- కాల్పుల విరమణ ఒప్పందంపై ఈజిప్ట్‌లో శిఖరాగ్ర సమావేశం

సుదీర్ఘకాలంగా గజా కేంద్రంగా ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం ముగిసినట్లే కనిపిస్తోంది. కాల్పుల విరమణ దిశగా ఇజ్రాయిల్, హమాస్‌ను దారిలో పెట్టేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 21 సూత్రాల శాంతిప్రణాళిక అమలులోకి రావడంతో నిత్యం బాంబుల మోతతో దద్దరిల్లే గజా ప్రాంతం ప్రశాంతంగా మారింది. తాజాగా సోమవారం హమాస్ తన వద్దనున్న 20 మంది ఇజ్రాయిల్ బందీలను విడుదల చేయగా...తన ఆధీనంలోని 1900 మంది పలస్తీనా ఖైదీలకు ఇజ్రాయిల్ విముక్తి కల్పించే ప్రక్రియ ప్రారంభించింది. ఇందులో భాగంగా 154 మందిని విడుదల చేయగా వారు ఈజిప్టుకు చేరుకున్నారు. మరోపక్క గజా యుద్ధం ముగిసి, శాంతి పవనాలు వెల్లివిరియడంలో ట్రంప్ చేసిన కృషి గురించి ఎంతచెప్పినా తక్కువేనంటూ ఇజ్రాయిల్, ఈజిప్టు దేశాధినేతలు పొగడ్తలతో ముంచెత్తారు. ట్రంప్‌కు ఆయా దేశాల అత్యున్నత పురస్కారాలు ప్రకటించారు. ఇక పశ్చిమాసియా పర్యటన కోసం ఇజ్రాయిల్‌కు వచ్చిన ట్రంప్‌కు టెల్ అవీవ్‌లో ఘనస్వాగతం లభించింది. జెరూసలేంలోని ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో పశ్చిమాసియా శాంతి ప్రణాళికపై ట్రంప్

- మిగతా 2 లో

వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ

- రూ.60 కోట్లు సీఎంఆర్‌ఎఫ్ నిధులు విడుదల
- విద్యార్థులు, ఉద్యోగుల ముఖ గుర్తింపునకు ఏర్పాట్లు
- వైద్య కళాశాలలతో హాస్టళ్ల అనుసంధానం
- ఆహార నాణ్యతకు యాప్‌ను ఉపయోగించండి
- మ్యాచింగ్ గ్రాంట్ తక్షణం విడుదల: సమీక్షలో సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్:
బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతి గృహాలకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను డైట్ ఛార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాలు, వసతి గృహాల్లో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు నిధులను వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపునకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. జవాబుదారీతనం ఉండాలని అన్నారు. ఆహారం నాణ్యత తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సీఎం సూచించారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూనిఫాం, పుస్తకాలు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిర్వహణకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సీఎం

- మిగతా 2 లో



ఆర్థిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

స్టాక్‌హోమ్:
ఆర్థిక శాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ప్రకటించింది. 2025 సంవత్సరానికిగాను ముగ్గురు నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వృద్ధిని వెల్లడించినందుకు జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియన్, పీటర్ హోవిట్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. మోకిర్, హోవిట్ అమెరికాకు, అఘియన్ బ్రిటన్‌కు చెందిన ఆర్థిక నిపుణులు. సాంకేతిక పురోగతి ద్వారా స్థిరమైన వృద్ధికి ముందస్తు అవసరాలను గుర్తించినందుకు

- మిగతా 2 లో

పసిడి పరుగులు

హైదరాబాద్:
పసిడి పరుగులు పెడుతోంది. రాకెట్ వేగంతో పైపైకి దూసుకుపోతోంది. దీనికితోడు వెండి కూడా ఆకాశాన్ని తాకుతోంది. కనీవినీ ఎరుగని రీతిలో రోజురోజుకూ మధ్య, దిగువ మధ్య తరగతి వర్గాలకు అందనంత ఎత్తులో రేసు గుర్రంలా పరుగులు పెడుతోంది. తాజాగా తులం పుత్తడి రూ.1.30 లక్షలకు చేరువైంది. వెండి కూడా కిలో ఏకంగా రూ.రెండు లక్షలకు చేరువైంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,28,110గా ఉంది. అదే 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,18,630గా నమోదైంది. కిలో వెండి 1,83,000కి చేరింది. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి

- మిగతా 2 లో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్

21 వరకు నామినేషన్ల స్వీకరణ...

నవంబరు 11న ఎన్నికలు

విశాలాంధ్ర-హైదరాబాద్:
జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సోమవారం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అక్టోబరు 13 నుంచి 21 వరకు ప్రభుత్వ సెలవు దినాలు మినహా నామినేషన్లను స్వీకరించనున్నారు. అభ్యర్థులు తమ నామినేషన్లను షేక్‌పేట్ ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేసేందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఎన్నికల అధికారులు తెలిపారు. 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు సాయంత్రం అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుండగా... 14న యూసఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఫలితాలను అదే రోజు ప్రకటిస్తారు. పోర్టల్ ద్వారా డిజిటల్ నామినేషన్ సమర్పించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అభ్యర్థులు https://encore.eci.gov.in ద్వారా నామినేషన్ ఫారం ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. అయితే క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రింటెడ్ హార్డ్ కాపీ తప్పనిసరిగా సమర్పించాలని ఎన్నికల అధికారులు తెలిపారు. ఆన్ లైన్ డిపాజిట్

- మిగతా 2 లో

పూరన్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వ అండ

- నిందితులను కఠినంగా శిక్షించండి: హర్యానా ప్రభుత్వానికి భట్టి వినతి
- ఫోన్ ద్వారా సీఎం రేవంత్ పరామర్శ

విశాలాంధ్ర - హైదరాబాద్:
చండీగఢ్‌లో ఆత్మహత్య చేసుకున్న ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. పూరన్ భార్య, ఐఏఎస్ అధికారిణి అమనీత్‌ను ఓదార్చి... పూరన్ కుమార్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఫోన్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడించారు. కుటుంబానికి అండగా ఉంటామని సీఎం హామీ ఇచ్చారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమనీత్‌ను పరామర్శించడానికి వచ్చిన హర్యానా చీఫ్ సెక్రటరీ అనురాగ్ రస్తోగితో భట్టి విక్రమార్క మాట్లాడారు. సూసైడ్ నోట్ ఆధారంగా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని ఆ రాష్ట్ర సీఎస్‌ను కోరారు. అనంతరం భట్టి మీడియాతో మాట్లాడుతూ పూరన్ కుమార్ అత్యంత ప్రతిభావంతుడన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ లో ఇంజినీరింగ్ పట్టభద్రుడు, ఐఐఎం అహ్మదాబాదులో చదివిన గొప్ప మేధావి అన్నారు. ఉన్నతాధికారుల కుల

- మిగతా 2 లో

మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

సీఎం, డిప్యూటీ సీఎం సహా ప్రముఖుల సంతాపం



విశాలాంధ్ర - హైదరాబాద్:
చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి (85) సోమవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఉదయం 5.30 గంటలకు హైదర్ గూడలోని అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. మధ్యాహ్నం మూడు గంటలకు మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యేగా సుపరిచితులైన కొండా లక్ష్మారెడ్డి... న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా సేవలందించారు. జర్నలిజంపై ఆయనకున్న మక్కువతో 1980లో స్థానిక వార్తా సంస్థ ఎన్ఎస్ఎస్ ను స్థాపించారు. జర్నలిస్ట్ హక్కుల కోసం కృషి చేసిన ఆయన జూబ్లీ హిల్స్

- మిగతా 2 లో

బంద్ ఫర్ జస్టిస్‌కు సంపూర్ణ మద్దతు

- రిజర్వేషన్ల అమలు బాధ్యత కేంద్రానిదే
- న్యాయం కోసం పోరాడటమే కమ్యూనిస్టు సిద్ధాంతం: కూనంనేని

విశాలాంధ్ర- హైదరాబాద్:
బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీ సంఘాలతో ఏర్పడిన 'బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ (బీసీ జేఏసీ) 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, ప్రత్యక్షంగా పాల్గొంటామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకుని ముందుకు సాగాలని సూచించారు. బీసీ బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. 18న తలపెట్టిన రాష్ట్ర బంద్ మద్దతు ఇవ్వాలని కోరుతూ బీసీ జేఏసీ ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, కో ఛైర్మన్లు రాజారాం యాదవ్, మీడియా కో - ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ అధ్వర్యంలోని ప్రతినిధి బృందం మఖ్దూం భవన్ లో కూనంనేనికి సోమవారం లేఖ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాలకు కోసం పోరాటం చేయడమే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం అని అన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం గీత పని వారాల సంఘాన్ని మొట్టమొదట ఏర్పాటు చేసిన తర్వాత, ఆ పరంపరలోనే వృత్తి సంఘం, డీహెచ్‌పీఎస్

- మిగతా 2 లో

లాలూ కుటుంబానికి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ:
బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న వేళ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి కేసులో లాలూతో పాటు ఆయన సతీమణి రాబ్డీదేవీ, కుమారుడు తేజస్వీ యాదవ్‌పై సోమవారం ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపింది. ఈ కేసులో వారు విచారణను ఎదుర్కోనున్నారు. లాలూ ప్రసాద్ రైల్వేమంత్రిగా ఉన్న సమయంలో ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టులు కేటాయించడంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద రౌజ్ అవెన్యూ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు నమోదుచేసింది. రైల్వే మంత్రిగా తన పదవిని దుర్వినియోగం చేశారని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. తాము ఏ తప్పు చేయలేదని లాలూ, తేజస్వి కోర్టుకు వెల్లడించగా... ఇది తప్పుడు కేసు అని రాబ్డీదేవీ పేర్కొన్నారు. 2004-2009లో లాలూ రైల్వే మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ కాంట్రాక్టులను సుజాత హోటల్‌కు అప్పగించారు. ఆ ఒప్పందానికి బదులుగా లాలూ ఒక బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో మూడు ఎకరాల భూమి పొందారని సీబీఐ పేర్కొంది. ఈ

- మిగతా 2 లో

'ఓటు చోరీ' వ్యాఖ్యలపై పిల్ విచారణకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ:
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చితో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. దీనిపై కోర్టు స్పందిస్తూ... రాజకీయ అంశాలకు కోర్టులను వేదిక చేసుకోవద్దని, ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని స్పష్టంచేసింది.

ఇదీ లోకం!

సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి రూ.251 కోట్లు: పొంగులేటి

2 లో

'జూబ్లీహిల్స్' కైవసానికి కాంగ్రెస్ అడ్డదారులు

- ఓట్ల చోరీతో గెలిచేందుకు యత్నం
- ప్రజాక్షేత్రంలో ఎండగడతాం: కేటీఆర్
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి బీఆర్ఎస్ ఫిర్యాదు

విశాలాంధ్ర - హైదరాబాద్:
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- మిగతా 2 లో

ఆగని భ్రూణ హత్యలు

ఖమ్మంలో యథేచ్ఛగా కొనసాగుతున్న వైనం

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం/క్రైమ్:
గర్భస్థ శిశు హత్యలు ఆగడం లేదు. కొందరు వైద్యులు కిరాయి హంతకుల మాదిరిగా వ్యవహరించటం ఆందోళన కలిగిస్తోంది. బేరం కుదిరితే చాలు... అబార్షన్ చేసేస్తున్నారు. వీరికి చట్టమంటే భయం లేదు. అడిగినంత డబ్బు ఇస్తే చాలు... తల్లి గర్భంలోని చిన్న ప్రాణాన్ని నిర్దాక్షిణ్యంగా చిదిమేస్తారు. ఈ దందా ఖమ్మంలో యథేచ్ఛగా సాగుతోంది. రోగులకు ప్రాణం పోసే వైద్యులు కొందరయితే... దురాశతో భ్రూణ హత్యలకు పాల్పడుతున్న వైద్యులు మరికొందరు. ఖమ్మంలో లింగ నిర్ధారణ చేస్తున్న ఓ ముఠాను ఇటీవలే డీఎంహెచ్‌వో దాడి చేసి పట్టుకున్నారు. ఆ ఘటన జరిగి వారం రోజులు గడవకముందే పట్టణంలో అబార్షన్ చేసిన ఘటన మరొకటి జరిగింది. ఇల్లందు ప్రాంతానికి చెందిన ఓ మహిళ దగ్గర డబ్బు తీసుకొని నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అబార్షన్ చేసినట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. ఈ ఆసుపత్రిలో అబార్షన్ చేసేందుకు బేరం కుదిరించిన మధ్యవర్తి ఒక ల్యాబ్ టెక్నీషియన్. ఆ ఆసుపత్రిలో నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో వైద్యులను వివరాలు అడిగితే ఒకరు

- మిగతా 2 లో

బందీల విడుదల

ఇజ్రాయిల్‌లో పండుగ వాతావరణం

టెల్‌అవీవ్: ఒక్కరోజు కాదు.. రెండ్రోజులు కాదు. ఏకంగా రెండేళ్లు చెరలో బందీలుగా ఉండిపోయారు. ఏదో రోజు తిరిగి వస్తారన్న నిరీక్షణ ఫలించింది. సోమవారం తొలి విడత బందీలను హమాస్ విడుదల చేసింది. దీంతో ఇజ్రాయిల్ అంతటా పండుగ వాతావరణం నెలకొంది. 20 మంది ఇజ్రాయిల్ బందీలను హమాస్ విడుదల చేసింది. తొలి విడతగా ఏడుగురిని విడుదల చేసిన కొద్దిసేపటికే మరో 13మంది విడుదల చేసింది. హమాస్ విముక్తి కల్పించినవారిని రెడ్‌క్రాస్‌కు చెందిన బస్సుల్లో ఇజ్రాయిల్ సరిహద్దుల వరకు తీసుకెళ్లగా... అక్కడి నుంచి హెలికాప్టర్లలో ఇజ్రాయిల్ సైన్యం తమ దేశానికి తీసుకెళ్లి చికిత్స అందిస్తోంది. రెండేళ్లుగా నరకయాతన అనుభవించిన తమ వారు విడుదలవడంతో కుటుంబ సభ్యులు, శ్రేయాభిలాషుల్లో సంతోషం నెలకొంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయిల్ కూడా పలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. మొత్తం 2వేలమంది బందీలను విడుదల చేస్తామని ఇజ్రాయిల్ తెలిపింది.

ప్రపంచానికి మరింతమంది ట్రంప్‌లు అవసరం

అమెరికా అధ్యక్షుడిపై ఇజ్రాయిల్ ప్రశంసల వర్షం

టెల్‌అవివ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయిల్ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. ట్రంప్ వంటి వ్యక్తులు ప్రపంచానికి మరింత మంది అవసరమని ఆకాంక్షించింది. ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో కీలక పాత్ర పోషించినందుకు బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం ట్రంప్‌కు ఘనంగా కృతజ్ఞతలు తెలిపింది. ఇజ్రాయిల్ పార్లమెంటు కెనేసెట్ ఆయనకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చింది. వచ్చే సంవత్సరం నోబెల్ శాంతి బహుమతికి ఆయన పేరును ప్రతిపాదిస్తామని ఇజ్రాయిల్ ప్రభుత్వం వెల్లడించింది. ట్రంప్ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో కలిసి జెరూసలెంలోని పార్లమెంటుకు వెళ్లారు. ఇజ్రాయిల్ ప్రజాప్రతినిధులు ట్రంప్‌కు ఘన స్వాగతం పలికారు. కాల్పుల ఒప్పందం చేసినందుకు గాను లేచి నిలబడి రెండున్నర నిమిషాల పాటు చప్పట్లతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ ఒహనా మాట్లాడుతూ, బందీల విడుదలకు ట్రంప్ కృషి చేశారని కొనియాడారు. యూదు ప్రజలు ఆయనను వేల సంవత్సరాలు గుర్తు పెట్టుకుంటారన్నారు. ప్రపంచంలో శాంతిస్థాపన కోసం ఆయన ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ కంటే అర్హులు ప్రపంచంలో ఎవరూ లేరని తెలిపారు. ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ, యుద్ధం ముగిసేలా గాజా ఒప్పందం చేసినందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ట్రంప్ తప్పకుండా నోబెల్ బహుమతి సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, అంతకుముందు ట్రంప్, నెతన్యాహు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బంగారు పావురాన్ని ట్రంప్‌కు కానుకగా ఇచ్చారు.

ట్రంప్‌కు ఇజ్రాయిల్, ఈజిప్ట్ అత్యున్నత పౌర పురస్కారాలు

గాజా శాంతి ఒప్పందం కుదిర్చి, బందీల విడుదలకు కృషి చేసినందుకు గానూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయెల్, ఈజిప్టు దేశాలు అరుదైన గౌరవాన్ని అందించనున్నట్లు ప్రకటించాయి. ఇజ్రాయిల్ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఆనర్'ను అమెరికా అధ్యక్షుడికి ప్రదానం చేయనున్నట్లు అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ వెల్లడించారు.

రానున్న నెలల్లో సమయం, వేదిక నిర్ణయించి అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈజిప్టు 'ది ఆర్డర్ ఆఫ్ ది నైల్' అవార్డును ఇవ్వనున్నట్లు ఆ దేశ అధ్యక్ష కార్యాలయం పేర్కొంది.

పశ్చిమాసియాలో కొత్త ఆరంభం

ఇజ్రాయిల్ పార్లమెంటులో ట్రంప్

జెరూసలేం: ఇజ్రాయిల్ పార్లమెంట్‌నుద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగించారు. బందీల విడుదల సందర్భంగా ఇజ్రాయిల్‌లో స్వర్ణయుగం మొదలైందని, పశ్చిమాసియాలో ఇది చరిత్రాత్మకమైన కొత్త ఆరంభం అన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ధైర్యం అసామాన్యమైందన్నారు. చర్చలకు సహకరించిన అరబ్ దేశాలకు కూడా ట్రంప్ ధన్యవాదాలు చెప్పారు. ఇదొక అద్భుత విజయం అన్నారు. ఇక ఇజ్రాయిల్‌లో స్వర్ణయుగం మొదలైందని, యావత్ పశ్చిమాసియాకే ఇది స్వర్ణ యుగమన్నారు. ఆయుధాల వల్లే శాంతి వెలిసినట్లు ట్రంప్ చెప్పారు. ఆయుధాలు కావాలంటూ ఇజ్రాయిల్ తనను అనేక మార్లు కోరిందని, దీంతో ఇజ్రాయిల్ శక్తివంతంగా తయారైందన్నారు. దీని వల్ల శాంతి ఏర్పడినట్లు ట్రంప్ చెప్పారు. శాంతి ఒప్పందం కోసం పనిచేసినవారిలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు, సలహాదారుడు జేర్డ్ కుష్నర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, సెక్రటరీ పీట్ హెగ్‌సేత్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో వీరు కీలకపాత్ర పోషించారన్నారు. కెనెసెట్‌లో ప్రసంగించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అబ్రహం, ఇసాక్, జాకబ్ దేవతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ ఆకాశం నిర్మలంగా మారిందని, తుపాకులు మూగబోయాయని, సైరన్లు మోగుతున్నాయని, పవిత్ర భూమిలో శాంతి సూర్యుడు ఉదయించాడని ట్రంప్ అన్నారు. ఇక ఎప్పటికీ ఈ ప్రాంతం శాంతియుతంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది యుద్ధానికి ముగింపు మాత్రమే కాదని... టెర్రర్, మరణాలకు కూడా ఇది ముగింపు యుగమన్నారు. విశ్వాసం, దేవుడిపై నమ్మకం పెరిగే యుగం ఇది అన్నారు. పశ్చిమాసియాలో కొత్త చరిత్ర లిఖితమైందన్నారు.

నిరసన సెగ...

ఇజ్రాయిల్ పార్లమెంట్ కెనెసెట్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలో కొందరు సభ్యులు అడ్డుకున్నారు. ట్రంప్ ప్రసంగం ప్రారంభించిన ఐదు నిమిషాల్లోనే హమాస్‌కు మద్దతు పలుకుతూ ఇద్దరు సభ్యులు మారణహోమం అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది ఆ ఇద్దరు కెనెసెట్ సభ్యులను బయటకు లాక్కెళ్లారు. ఆ సమయంలో కాసేపు ట్రంప్ తన ప్రసంగాన్ని ఆపారు. ఇజ్రాయిల్ ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యుడు ట్రంప్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. పలస్తీనాను గుర్తించండి అంటూ ఆయన ఓ ప్లకార్డు పట్టుకున్నారు. సభను ఆర్డర్‌లో పెట్టాలని ఆ సమయంలో స్పీకర్ ఆమిర్ ఓహనా గట్టిగా అరిచారు. నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష ఎంకే సభ్యుడిపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసనలపై ట్రంప్‌కు స్పీకర్ క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారమంతా గమనించిన ట్రంప్.. సమర్థవంతంగా పనిచేశారని చమత్కరించారు. దాంతో సభ్యులంతా చిరునవ్వులు చిందించారు. ట్రంప్...ట్రంప్ అని నినాదాలు చేశారు.

ఆర్థిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

మోకిర్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. 'క్రియేటివ్ డిస్ట్రక్షన్' ద్వారా నిరంతర వృద్ధి సిద్ధాంతానికిగాను మిగతా ఇద్దరికి నోబెల్ ప్రకటించారు. వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన ఆర్థికశాస్త్రంతో ముగిసింది.

పసిడి పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. 2026 ప్రారంభం నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1.50 లక్షలకు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతివిలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటం వల్లనే దేశీయంగా బంగారం ధరలు గరిష్ట స్థాయికి చేరుతున్నాయని తెలిపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోతుండటం, అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్, రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు, ఫెడరల్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించనుండటం, చైనా-అమెరికా మధ్య టారిఫ్‌ల ప్రభావం, మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా ధరలు దూసుకుపోవడానికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నాయి.

'జూబ్లీహిల్స్' కైవసానికి కాంగ్రెస్ అడ్డదారులు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. దీనికోసం సమ దాన భేద దండోపాయాలతో ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మంత్రులంతా జూబ్లీహిల్స్ చేరి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితాలో ఉన్న దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లు ...ఇతర అవకతవకల పై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేస్తున్న దొంగ ఓట్ల ప్రయత్నంపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి మెమోరాండం ఇచ్చామని వెల్లడించారు. జాతీయస్థాయిలో రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటే... చోరీ ఓట్లతో ఇక్కడ గెలవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. 400 ఎన్నికల బూత్ లో కనీసం 20వేల దొంగ ఓట్లను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నమోదు చేయించిందని ఆరోపించారు. ఒక్కొక్క ఇంట్లో 150 నుంచి 200 ఓట్ల నమోదు జరిగిందన్నారు. 15 వేల ఓట్లు చిరునామాలు లేకున్నా నమోదు చేయడం జరిగిందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ లో ఓట్లు ఉన్నవాళ్లకి ఇతర నియోజకవర్గాల్లో కూడా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కింది స్థాయి అధికారులతో కుమ్మక్కై దొంగ ఓట్లు చేర్చినట్టు అనుమానం ఉందని పేర్కొన్నారు. ఓటర్ లిస్టు అవకతవకలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని కోరినట్టు కేటీఆర్ తెలిపారు. దొంగ ఓట్లపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసి తగిన సమాధానం ఇస్తామని ఎన్నికల అధికారి చెప్పారని, ఈ దొంగ ఓట్ల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీని ప్రజా క్షేత్రంలో ఎండగడతామన్నారు. మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, కాలేరు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించాలని ఆదేశించారు. స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపునకు అవసరమైన మొత్తానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌ను ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. తొలుత సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి రూ.251 కోట్లు: పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: భక్తుల కొంగుబంగారం సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి ప్రభుత్వం రూ.251 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వరంగల్ ఇంఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి సీతక్కతో కలిసి సోమవారం ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అధికారులతో ఆలయ పనుల ప్రగతిని సమీక్షించారు. అనంతరం మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.101 కోట్లు మంజూరు చేయగా వీటిలో రూ.71 కోట్ల పనులకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. గతంలో మంజూరైన రూ.150 కోట్లతో కలిపి దశలవారీగా శాశ్వత ప్రాతిపదికన ఆలయాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జంపన్న వాగులో జారిపోకుండా ఆరాధ్యదైవాల ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని, దీనిలో భాగంగా రోడ్లు నిర్మిస్తామన్నారు. ఆలయాభివృద్ధికి ఎవరు సలహాలు సూచనలు ఇచ్చినా స్వీకరిస్తామని, పనులను మంత్రి సీతక్క స్వయంగా పర్యవేక్షిస్తారని అన్నారు. గతంలో ఈ జాతరకు కోటి మందికి పైగా వచ్చినట్లు అధికారులు చెప్పారని, ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు.

నాపై ఫిర్యాదు చేసే అవకాశమే లేదు

నేనేంటో అందరికీ తెలుసని, రూ.70 కోట్ల కాంట్రాక్ట్ వర్క్‌కు తాపత్రయపడే అవసరం నాకు లేదని మీడియా అడిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మడం లేదు. అధిష్టానానికి ఎవరూ ఫిర్యాదు చేసే ఛాన్సే లేదు. నేను నమ్మడం లేదు. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నాం అని మంత్రి పొంగులేటి చెప్పారు. సమావేశంలో ఎంపీ బలరాం నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని భ్రూణ హత్యలు

(మొదటిపేజీ తరువాయి)

తల్లిదండ్రుల అనుమతితోనే అబార్షన్ చేశామని చెప్పగా... మరో డాక్టరు ఆ మహిళ రక్తస్రావం అవుతుండగా ఆసుపత్రిలో చేరిందని, కడుపులో బిడ్డ చనిపోయి ఉండటంతో ఆమెకు ప్రమాదం జరగకుండా ఉండటానికి వారి అనుమతితోనే శస్త్ర చికిత్స నిర్వహించి పిండాన్ని బయటకు తీశామని చెప్పుకొచ్చారు. అయితే ఆ పిండాన్ని తండ్రి ఎక్కడో పడేయటానికి బయటికి తీసుకువెళ్లా డనే సమాధానం రావడం ఇక్కడ అబార్షన్ల నిర్వహణ పరిస్థితిని తేటతెల్లం చేస్తోంది. అయితే అక్టోబరు 10న ఆ తల్లి స్కానింగ్ సహా పరీక్షలు చేయించుకుంటే కడుపులో బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు ఆ ల్యాబ్ ద్వారా ఇచ్చిన రిపోర్ట్ పేర్కొంటోంది. వైద్యుల పొంతన లేని సమాధానాలు అక్కడ గర్భస్థ శిశవు హత్య జరిగిందనే ప్రచారానికి బలాన్ని చేకూర్చుతోంది.

అంగడి సరుకులా బిడ్డలను చూస్తున్న వైనం

అబార్షన్ కథకు పూర్వాపరాలు పరిశీలిస్తే... ఇల్లందు ప్రాంతానికి చెందిన ఓ మహిళకు అప్పటికే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. నాలుగో సంతానానికి బేరం కుదిరి అంతా కలిసి వస్తే విక్రయించడం లేదా ఎవరికైనా ఇవ్వడం చేయాలనుకున్నారు. ఈ క్రమంలో ఒక ల్యాబ్ టెక్నీషియన్ వీరికి అనుసంధాన కర్తగా వ్యవహరించి... వీరికి పుట్టబోయే బిడ్డను వేరే వారికి విక్రయించే డీల్ మాట్లాడాడు. కానీ ఆసుపత్రిలో పుట్టిన బిడ్డను కొనుగోలు చేసిన వారి బిడ్డగా అన్ని ఆధారాలతో రాయించి ఇస్తానని మధ్యవర్తి హామీ ఇచ్చాడని, కానీ కొన్ని సాంకేతిక కారణాలతో అలా ఇచ్చేందుకు కుదరలేదని తెలుస్తోంది. దాంతో ఆమె ఇక తనకు సంతానం అవసరం లేదని, అబార్షన్ చేయించుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో అబార్షన్ చేయించే బాధ్యత కూడా ఆ మధ్యవర్తే తీసుకొని రెండు ఆసుపత్రులు తిప్పితే... ఆయా ఆసుపత్రుల్లో వైద్యులు ఇది చట్టవిరుద్ధమని, తమ ఆసుపత్రుల్లో చేయలేమని తెగేసి చెప్పారని సమాచారం. చివరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు మాత్రం తామడిగినంత డబ్బు ఇస్తే అబార్షన్ చేసేందుకు ఒప్పుకుని ఆమెకు అబార్షన్ నిర్వహించినట్లు తెలుస్తోంది.

'బంద్ ఫర్ జస్టిస్'కు సంపూర్ణ మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

తదితర ప్రజా సంఘాలు ఏర్పాటయ్యాయని కూనంనేని గుర్తు చేశారు. 10 శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టగానే 50 శాతం ఉన్న రిజర్వేషన్ల పరిమితి తొలగిపోయిందన్నారు. బలహీనవర్గాల హక్కులను కాదనే ధైర్యం ఏ రాజకీయ పార్టీలకూ లేదన్నారు. జీఎస్టీ నుంచి రూ. 26 లక్షల కోట్లు వసూలైతే, ఇందులో కేవలం మూడు శాతం మాత్రమే కార్పొరేట్ సంస్థలు చెల్లిస్తున్నాయని, మిగతాది పేద వర్గాల నుంచి వసూలవుతున్నాయని కూనంనేని వివరించారు. ప్రైవేటు సంస్థల్లో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి పేద వర్గాల కోసం కమ్యూనిస్టు పార్టీ అనేక ఉద్యమాలు చేపట్టిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులోనూ సీపీఐ మొట్టమొదట మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. బీసీ హక్కుల సాధన సమితి ఈ నెల 15న చేపట్టనున్న రాస్తారోకోకు కూడా మద్దతు ఇవ్వాలని ఆయన బీసీ జేఏసీని కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ న్యాయబద్ధమైన రిజర్వేషన్ల బిల్లులను గవర్నర్ వ్యవస్థ ద్వారా ఆపారన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ నిరుద్యోగ, ఉద్యోగ, రిజర్వేషన్లు... ఇలా ఏ ఉద్యమాలు చేపట్టినా సీపీఐ మద్దతుగా నిలబడిందని, ప్రత్యక్షంగా పాల్గొన్నదని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్ట్ కు విరుద్ధంగా హైకోర్ట్ స్టే విధించిందన్నారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితికి కాలం చెల్లిందని సుప్రీంకోర్ట్ వ్యాఖ్యానించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ కావాలనే కొందరు బీసీ రిజర్వేషన్లకు గండి కొడుతున్నారని మండిపడ్డారు. సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, డి.జి. సాయిలు గౌడ్, నాగభూషణం, మారగోని ప్రవీణ్, కుందారం గణేష్ చారి, వేముల రామకృష్ణ, కులకచర్ల శ్రీనివాస్, నందగోపాల్, కనకాల శ్యామ్ అనంతయ్య, రాములు యాదవ్, చెరుకుల రాజేందర్, శ్రీనివాస్ ముదిరాజ్, నీల వెంకటేష్, జాజుల లింగంగౌడ్, వరికుప్పల మధు, పానుగంటి విజయ్ గౌడ్, జూలపల్లి అంజి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

నాటి ప్రధాని రాజీవ్‌గాంధీతో కొండా లక్ష్మారెడ్డి (ఫైల్)

(మొదటిపేజీ తరువాయి)

జర్నలిస్ట్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధి, గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ క్రీడా మండలి ఛైర్మన్‌గా పలు కీలక పదవులను నిర్వహించారు. కొండా లక్ష్మా రెడ్డి మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో ఆయన సేవలు మరువలేమని సీఎం కొనియాడారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో మృతికి సంతాపం... కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పూరన్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వ అండ

(మొదటిపేజీ తరువాయి)

వివక్ష, వేధింపులు భరించ లేక ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వృద్ధ తల్లిదండ్రులు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్న పూరన్ కుమార్ కుటుంబానికి రక్షణ కల్పించి ఆదుకోవాలని హర్యానా ప్రభుత్వాన్ని, ఆ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. కపూర్ అనే అధికారి దళిత వ్యతిరేకి అని తెలిసి కూడా బీజేపీ ప్రభుత్వం అతడిని డీజీపీని చేసిందన్నారు. అత్యంత పిన్న వయసులోనే పూరన్ కుమార్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్నారన్నారు. హర్యానా, చండీగఢ్ ప్రభుత్వాలు బీజేపీ పాలనలో ఉన్నాయి. పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో డిప్యూటీ సీఎంతో పాటు ఏఐసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఝార్ఖండ్ రాష్ట్ర ఇంచార్జి కొప్పుల రాజు, కాంగ్రెస్ చండీగఢ్ రాష్ట్ర అధ్యక్షుడు హర్మోహిందర్ సింగ్ లకి, మీడియా అడ్వైజర్ భూపేంద్ర సింగ్ బూర, జస్ప్రీత్ సింగ్, ఏఐసీసీ సెక్రటరీ పర్దీప్ నర్వాల్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ దీపక్ లుభానా, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధర్మేంద్ర, రాజ్ దీప్ సిద్ధు ఉన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంక్/ట్రెజరీలో క్రెడిట్ అయి ఉండాలి... లేకపోతే మాన్యువల్ డిపాజిట్ చేయాలని, మరిన్ని వివరాలకు రిటర్నింగ్ అధికారిని సంప్రదించాలన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గం తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి, బీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఇప్పటికే విడుదల చేశారు. మొత్తం 3 లక్షల 98 వేల 982 మంది ఓటర్లు ఉండగా ఇందులో 2,07,367 మంది పురుష ఓటర్లు, 1.91,590 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలాగే ఇతరులు 25 మంది ఉన్నారని ప్రకటించారు. నియోజకవర్గం ఓటర్లలో 80 ఏళ్లకు పైబడిన వృద్ధుల్లో పురుషులు 3,280 మంది, మహిళలు 2,772 మంది ఉన్నారు. ఇక ఎన్ఆర్ఐ ఓటర్లు 95 మంది కాగా, సర్వీస్ ఎలక్టోరల్స్ 18, పీడబ్ల్యూడీ ఓటర్లు 1,891 మంది నమోదయ్యారు. నియోజకవర్గంలో 407 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్

మరోవైపు సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో అనివార్యమైన జూబ్లీహిల్స్ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఎవరికి వారు ఈ స్థానం కైవసం చేసుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలతో సిద్ధమవుతున్నారు.

తొలి రోజు 10 నామినేషన్లు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదల కావడంతో రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం నామినేషన్లు స్వీకరించారు. ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో రెండు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు, 8 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉండగా, తెలంగాణా పునర్ నిర్మాణ సమితి తరపున పూస శ్రీనివాస్, నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చంద్రశేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్, సయ్యద్ ముస్తఫా హుస్సేన్, సల్మాన్ ఖాన్ నామినేషన్లు దాఖలు చేశారు. షేక్ పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ సందర్శించారు. సన్నద్ధతను ఆర్వో, ఏఆర్వోతో కలిసి సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఈసీఐ నిబంధనలకు లోబడి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నామినేషన్ల స్వీకరణకు సన్నద్ధంగా ఉండాలని రిటర్నింగ్ అధికారికి సూచించారు.

గజాలో శాంతి వీచికలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇద్దరు ప్రతిపక్ష ఎంపీలు లేచి నిలబడి హమాస్‌కు మద్దతుగా నినాదాలు చేయడంతో కొద్ది నిమిషాల పాటు ట్రంప్ ప్రసంగం నిలిపివేయాల్సి వచ్చింది. స్పీకర్ ఆదేశాల మేరకు భద్రతా సిబ్బంది వారిని బయటకు తీసుకెళ్లడంతో ట్రంప్ తన ప్రసంగం కొనసాగించారు. పార్లమెంట్‌లో ట్రంప్‌కు గౌరవ సూచకంగా కొన్ని నిమిషాల పాటు చప్పట్లు, హర్షధ్వానాలు మార్మోగాయి. ఈ సమయంలో ట్రంప్‌తో పాటు ఆయన ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, అల్లుడు జారెడ్ కుష్నర్, కుమార్తె ఇవాంకా కూడా ఉన్నారు.

అంతకుముందు ఇజ్రాయిల్ పార్లమెంట్ వద్ద ట్రంప్‌ను స్పీకర్ అమిర్ ఒహానా ఆత్మీయంగా ఆహ్వానించారు. 'జెరూసలేంకి స్వాగతం. కెన్‌సెట్‌కు స్వాగతం. ఈ రోజు కోసం మేము ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాం' అని అన్నారు. దీనిపై స్పందించిన ట్రంప్ 'ఇది నాకు దక్కిన గొప్ప గౌరవం' అని వ్యాఖ్యానించారు. అనంతరం ఆయన అతిథుల పుస్తకంలో సంతకం చేశారు. స్పీకర్ ఒహానా మాట్లాడుతూ... 'ట్రంప్ కేవలం అమెరికా అధ్యక్షుడు మాత్రమే కాదు... యూదుల చరిత్రలో ఒక మహానుభావుడు... ఆయనకు సమానమైన వ్యక్తిని చూడాలంటే మనం 2500 ఏళ్లు వెనక్కి వెళ్లి సైరస్ ది గ్రేట్ కాలానికి చేరుకోవాలి' అని కీర్తించారు.

శిఖరాగ్ర సమావేశానికి ప్రపంచ నేతల హాజరు

ఈజిప్టులోని షర్మ్ ఎల్ షేక్ వేదికగా ఏర్పాటు చేసిన గజా శాంతి శిఖరాగ్ర సమావేశానికి వివిధ దేశాల నేతలు హాజరయ్యారు. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సీసీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్వర్యంలో శాంతి శిఖరాగ్ర సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించిన సంతకాల కార్యక్రమం జరగనుంది. ఈ సదస్సుకు 20 దేశాల అధినేతలు, అంతర్జాతీయ ప్రముఖులను ఆహ్వానించారు. భారత్ తరఫున విదేశాంగ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ హాజరయ్యారు. సమావేశానికి హాజరయ్యే ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్, యూకే ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోని, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్, అరబ్ లీగ్ సెక్రటరీ జనరల్ అహ్మద్ అబౌల్ ఘీట్, జోర్డాన్ రాజు అబ్దుల్లా , కువైత్ ప్రధాన మంత్రి అహ్మద్ అల్ అబ్దుల్లా అల్ సబా, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫా, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలీయేవ్ , జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, గ్రీకు ప్రధాని కిరియాకోస్ మిత్సోటాకిస్, కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్, ఇరాక్ ప్రధాన మంత్రి మహమ్మద్ షియా అల్-సుడానీ తదితరులు హాజరయ్యారు. శాంతి శిఖరాగ్ర సమావేశానికి పలస్తీనా అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్ కూడా హాజరకానున్నారు. ఈ విషయాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ వెల్లడించారు. పలస్తీనియన్లకు నాయకత్వం వహిస్తున్న అబ్బాస్ ఈ సమావేశానికి హాజరుకావడం మంచి సంకేతం అని మక్రాన్ తెలిపారు.

లాలూ కుటుంబానికి ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారంలో 2017లో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నిందితులపై అభియోగాలు మోపేందుకు తగిన సమాచారం ఉందని కోర్టుకు వెల్లడించింది. ఆ వాదనను లాలూ న్యాయవాది తోసిపుచ్చారు. ఇదిలాఉంటే... వచ్చే నెల బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఎన్డీయే, లాలూ పార్టీ ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ అధికారం కోసం హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ఈ సమయంలో అవినీతి కేసులో కోర్టు ఆదేశాలు లాలూ కుటుంబానికి కొత్త చిక్కులు తెచ్చిపెట్టాయి. ప్రత్యర్థులు తమ ప్రచారంలో ఈ కేసును ఎత్తి చూపే అవకాశం ఏర్పడింది.

రాజకీయ కక్షతోనే కేసు: తేజస్వి

ఐఆర్‌సీటీసీ కేసులో లాలూ ప్రసాద్ యాదవ్‌పైన, తన తల్లి రాబ్డీదేవి, తనపై ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు అభియోగాలు దాఖలు చేయడంపై రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వీ యాదవ్ స్పందించారు. ఈ కేసుపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఇది రాజకీయ ప్రతీకారంతో పెట్టిన కేసు అని, లాలూ ప్రసాద్ యాదవ్ చరిత్ర సృష్టించిన రైల్వే మంత్రి అని, ఈ నిజం బీహార్ ప్రజలకే కాకుండా యావత్ దేశానికి తెలుసునని సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తేజస్వి చెప్పారు. 'ఈ కేసుపై పోరాడతాం. ఎన్నికలు దగ్గర పడినప్పుడు కేసును తెరపైకి తెస్తారనే విషయాన్ని మొదట్నించి నేను చెబుతూనే ఉన్నాను. కోర్టు తీర్పును గౌరవిస్తున్నాను. దీనిపై మేము పోరాడతాం. బీహార్ ప్రజలు చాలా తెలివైనవారు. ఏం జరిగిందో వారందరికీ తెలుసు. ఇది కచ్చితంగా రాజకీయ కక్షే' అని అన్నారు. రైల్వేకు రూ.90 వేల కోట్ల లాభం చేకూర్చిన నాయకుడు లాలూ అని, ప్రతి బడ్జెట్‌లో రైల్వే టికెట్ ధరలు తగ్గించారని, రైల్వే మంత్రిగా ఆయన చిరకాలం గుర్తుండిపోతారని అన్నారు. లాలూను అధ్యయనం చేసేందుకు హార్వర్డ్ నుంచి విద్యార్థులు వస్తుంటారని, మేనేజిమెంట్ గురుగా ఆయనకు ఎంతో పేరుందని చెప్పారు. ఈ నిజం బీహార్ ప్రజలకే కాకుండా యావత్ దేశానికి తెలుసునని అన్నారు. తాను బతికున్నంత కాలం బీజేపీపై పోరాడుతూనే ఉంటానని తేజస్వి స్పష్టం చేశారు.

అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : మండల ప్రత్యేక అధికారులు మండలాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఇంకా ప్రారంభించని ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నింటినీ వెంటనే ప్రారంభించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండాలని, ముఖ్యంగా అకాల వర్షానికి ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి సందర్భంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి నమోదును పెంచాలని డీఈవో బిక్షపతిని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఆర్‌పై అవగాహనకై 13 నుండి 17 వరకు సిపిఆర్‌పై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని, ఆయా శాఖల ద్వారా అవసరమైన వారి పేర్లను పంపిస్తే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 24 లోగా జిల్లాలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు పంపించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ జిల్లా అధికారులతో కోరారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,ఇన్చార్జి డిఆర్ఓ వై.అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ పిడి రాజ్ కుమార్, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.

ప్రత్యేక అధికారులు అన్ని వసతి గృహాలను తనిఖీ చేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: ప్రత్యేక అధికారులు అన్ని వసతి గృహాలను తనిఖీ చేయాలని, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో లిఅదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ లతో కలిసి ఆయన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సంక్షేమ వసతి గృహాలలో మూడు రోజులు ప్రత్యేక అధికారులు తనిఖీ నిర్వహించి, పరిసరాలను పరిశీలించి, పిల్లలతో కలిసి భోజనం చేసి, వసతి గృహాలలో ప్రస్తుత పరిస్థితులను గమనించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజావాణిలో ప్రజలు చేసుకున్న (46) దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సంబంధిత విభాగానికి పంపి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డిపిఓ హరిప్రసాద్, పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీ రామ్ నాయక్, వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, గ్రౌండ్ వాటర్ అధికారి వేముల సురేష్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, సర్వే ల్యాండ్ అధికారి నరసింహమూర్తి, వెల్ఫేర్ అధికారిని సబిత, ఎస్సీ, బిసివెల్ఫేర్ అధికారులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తొర్రూరు లయన్స్ క్లబ్‌కు టాప్ ఫర్ఫార్మెన్స్ అవార్డు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-తొర్రూరు: సేవా కార్యక్రమాల నిర్వహణలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తొర్రూరు లయన్స్ క్లబ్ మేటి క్లబ్‌గా నిలిచింది. ఉమ్మడి జిల్లాలోని 77 క్లబ్ లలో ఉత్తమ పనితీరు కనబరిచిన క్లబ్‌గా తొర్రూరు లయన్స్ క్లబ్ నిలిచింది. తాజాగా హనుమకొండలో లయన్స్ క్లబ్ త్రైమాసిక పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన తొర్రూరు లయన్స్ క్లబ్ ఫస్ట్ బెస్ట్ టాప్ ఫర్ఫార్మెన్స్ పురస్కారం అందుకుంది. లైన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సూర్ణం రామ నర్సయ్య ఆధ్వర్యంలో మూడు మాసాల్లో 300 పైచిలుకు సేవలు అందించినందుకు గాను తొర్రూరు క్లబ్‌కు ఈ పురస్కారం దక్కింది. ఎల్సీఐఎఫ్ ఏరియా ప్రతినిధి దీపక్ భట్టాచార్య, జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, ఉప గవర్నర్లు నరహరి సుధాకర్ రెడ్డి, పుట్ట హరికిషన్ రెడ్డి, మాజీ గవర్నర్లు కుందూరు రాజేందర్ రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహారావుల సమక్షంలో డాక్టర్ రామ నర్సయ్య పురస్కారాన్ని అందుకున్నారు. గ్యాట్ డాక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా ఎవల్యూషన్ చైర్మన్ రేగూరి వెంకన్న, డాక్టర్ శారద, రీజియన్ చైర్మన్ దామెర సరేష్, జోన్ చైర్మన్ చిదురాల నవీన్, ఫాస్ట్ ప్రెసిడెంట్ మాదారపు వేణుగోపాల్, క్లబ్ సెక్రటరీ మూడుపు రవీందర్‌రెడ్డి, ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ నెల 15 వ తేదీ నుంచి నవంబర్ 14వ తేదీ వరకు పశువుల్లో ఫుట్ అండ్ మౌత్ వ్యాధి నిర్మూలనకు గాను టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం సకాలంలో పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : కొత్తగూడెం జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి తాత్కాలిక తరగతి గదుల భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. పాత కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆనంద ఖనిలో గల భవన సముదాయాన్ని సోమవారం పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ సూచనలకు అనుగుణంగా మార్పులు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తయి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కల్లా కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభించేటట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, విద్యాశాఖ ఇంజనీరింగ్ విభాగ అధికారి రాజగోపాల్ పాల్గొన్నారు. అనంతరం పట్టణ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. పిల్లలకు ఏమైనా అవసరాలు ఉంటే తనకు తెలియజేయాలని స్పెషల్ ఆఫీసర్ ను ఆదేశించారు.

మంథనిలో ఏటీసీ కేంద్రం ఏర్పాటు చేస్తాం

మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: మంథనిలో 45 కోట్ల ఖర్చుతో నూతనంగా ఏటీసీ కేంద్రం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం ఆయన మంథని క్యాంపు కార్యాలయంలో రామగిరి కమాన్పూర్ మంథని ముత్తారం మండలాలకు సంబంధించి 87 మంది లబ్ధిదారులకు సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు, 38 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తొలి వారంలోనే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందని మిగతా హామీలు అమలు చేస్తున్నామని అన్నారు. కళ్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాలు అమలు ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని పేద ప్రజలను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి నుంచి రికార్డు స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. మంథని పట్టణంలో వివిధ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, 30 కోట్ల రూపాయలతో అంతర్గత సిసి రోడ్లు వేసామని, అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ నిర్మాణానికి కోటి రూపాయలు, మున్నూరు కాపు భవనానికి 60 లక్షల రూపాయలు మంజూరు చేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. సురేష్, తహసిల్దార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన జెడ్పీ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : త్వరితగతిన ఆరు నెలలోగా జడ్పి కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మాణం అవుతున్న జడ్పి కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జడ్పీ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నాణ్యతతో జరగాలని, నిర్దేశిత గడువు ఆరు నెలల లోగా నిర్మాణ పనులు పూర్తి కావాలని అన్నారు. జెడ్పీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నాణ్యతలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జడ్పీ సీఈఓ నరేందర్, ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, తహసీల్దార్ రాజయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు వేగంగా పరిష్కరించండి

విశాలాంధ్ర - వనపర్తి : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డిప్యూటీ కలెక్టర్ రంజిత్‌తో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజావాణి సహా సీఎం ప్రజావాణి నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 34 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏగోలపు సదయ్య గౌడ్‌కు జాతీయ ఉత్తమ నంది అవార్డ్

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఏగోలపు కుమార్ గౌడ్‌కు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత 21 సంవత్సరాల నుండి చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను కరోన విపత్కర సమయంలో చేసిన సేవలను గుర్తించి శనివారం రోజున హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్శిటీలో మాక్ష్ గ్లోబల్ ఫౌండేషన్ డైరెక్టర్ చెరిపల్లి దినేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియా అవార్డ్స్ - 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్, నల్ల బాబు, న్యూస్ రిపోర్టర్ రజిని నాయుడు, వేముల స్వాతి చేతుల మీదుగా ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్‌కు జాతీయ ఉత్తమ నంది అవార్డు, ప్రశంస పత్రం ఇచ్చి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్ మాట్లాడుతూ కరోన విపత్కర సమయంలో చేసిన సేవలను మరియు గత 21 సంవత్సరాల నుండి చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసిన మక్ష్ గ్లోబల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెరిపల్లి దినేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే మంత్రుల ఆఫీసులు ముట్టడిస్తాం

విశాలాంధ్ర - ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బకాయిలు వెంటనే చెల్లించాలని, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్భవన్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఏడు పాఠశాలలు నమోదు చేసుకోగా విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ సంబంధించి సుమారుగా 9.41 కోట్లు బకాయిలు ఉండడంతో యాజమాన్యాలు విద్యార్థులకు వసతి సౌకర్యాలు ఉపాధ్యాయుల జీతాలు చెల్లింపులో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. రియంబర్స్మెంట్ని తక్షణమే విడుదల చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రులు క్యాంప్ కార్యాలయాలని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శిలు షేక్ నాగులమేరా శివ, మనోజ్, గోపి, సాయి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయి

విశాలాంధ్ర - ఖమ్మం : పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో హెడ్ కానిస్టేబుళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తూ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్సై)గా పదోన్నతి పొందిన ఖమ్మం కమిషనరేట్‌కు కేటాయించబడిన పోలీస్ అధికారులు సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని పోలీస్ కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా : ప్రభుత్వం చేపట్టిన భూ భారతి చట్టంలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సంబంధిత సమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కారం పరిష్కరించడంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని జన్నారం మండలం మహమ్మదాబాద్ గ్రామానికి సంబంధించిన భూ సమస్యను అతి తక్కువ సమయంలో పరిష్కరించినందుకు గాను సంబంధిత గ్రామస్తులు సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి మొక్కను అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులు, మొఖా, సర్వే నెంబర్లు ఇతర పూర్తి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని, ఇందు కొరకు రాజస్వ మండల అధికారి, తహసిల్దార్, ఆర్.ఐ.లతో బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మిస్సింగ్ సర్వే నెంబర్, ప్రాంతాల మార్పు, ప్రభుత్వ భూములు, సాదాబైనమా, అటవీ భూములు, హద్దుల నిర్ధారణ, ఇతర భూములకు సంబంధించి భూ భారతి కార్యక్రమంలో పొందిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. భూ వివాదాలపై న్యాయస్థానం కంటే ముందు తమను సంప్రదిస్తే సమగ్ర విచారణ జరిపి అసలైన పట్టదారులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, న్యాయస్థానాలలో కొనసాగుతున్న భూ వివాదాలకు సంబంధించిన కేసులపై ఎలాంటి చర్యలు తీసుకోబడవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మర్ ఎమ్ఎ రెహమాన్‌కు ఇర్ఫానీ అవార్డ్

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : స్విమ్మింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి విజయవాడ, బెంగళూర్‌లో జాతీయ స్థాయిలో పాల్గొన్న సంగారెడ్డి పట్టణానికి చెందిన యువ స్విమ్మర్ మహమ్మద్ అబ్దుర్ రహమాన్ సిద్దీఖ్‌కు ఇర్ఫాని దర్గా పీఠాధిపతి హజ్రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్ యే నషీన్ బార్గ ఇర్ఫానీ, స్థానిక ఎమ్మెల్యే తనయుడు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతా సాయినాథ్, టీయుడబ్ల్యూజెఐజేయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏకె ఫైసల్ చేతుల మీదుగా ఇర్ఫానీ అవార్డును అందజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడలలో ముందుకు సాగి రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చేలా కృషి చేయాలని సూచించారు. పేద కుటుంబం నుంచి వచ్చి మెడికల్ కాలేజీలో ఫ్రీ సీట్ సంపాదించిన మహమ్మద్ ఒబేద్‌కు అదేవిధంగా స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబరిచిన మహమ్మద్ అబ్దుర్ రెహమాన్ సిద్దిఖ్‌లకు ఒక్కొక్కరికి 15 వేల చొప్పున 30 వెల్ల రూపాయలు ఖాక్ ఎ తైయిబా ఫౌండేషన్ తరపున మహమ్మద్ అలీ అసీర్ సాహెబ్ నగదు పురస్కారాన్ని అందజేశారు.

అకాల వర్షానికి తడిసిముద్దయిన మొక్కజొన్న

విశాలాంధ్ర - గూడూరు: రాత్రి కురిసిన అకాల వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లయి. గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాల్లో రైతులు పండించిన మొక్కజొన్న పంట చేతికి రావడంతో వాటిని ఎండబెట్టడం జరిగింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న తడిసి ముద్దయి వర్షానికి కొట్టుకుపోవడం జరిగింది. రైతులకు భారీగా నష్టపరిహారం కలగజేసింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఒకసారిగా గాలివానకు కొట్టుకుపోయినట్లు అకాల వర్షానికి తడిసి తీవ్ర నష్టం కలిగించింది. రైతుల శ్రమ పెట్టుబడి అకాల వర్షంతో వృధా అయిపోయింది. ఆదివారం మధ్యరాత్రి మూడు గంటలకు కురిసిన వర్షంతో చెరువులు, కుంటలు వర్షపు నీళ్లతో కలకలలాడుతున్నాయి. ప్రజలు బయటకు రావద్దని అత్యవసరం వస్తే తప్ప ఇండ్ల నుండి బయటకు వెళ్లకూడదని, చేపలు పట్టడానికి ప్రజలు వెళ్లరాదని సురక్షిత ప్రాంతాల్లో ప్రజల ప్రమాదంగా ఉండాలని అధికారులు సూచనలు చేశారు.

ఇద్దరు ఇంటర్ బాలికల అదృశ్యం

విశాలాంధ్ర -అశ్వరావుపేట : దమ్మపేట మండలంలోని అంకంపాలెం గ్రామ గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ బాలికల జూనియర్ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థినిలు కనిపించకుండా పోయారు. సత్తుపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ళ మారుతి బివుల, మడకం లక్ష్మి ప్రసన్న ఆ గురుకులలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఆదివారం ఉదయం సుమారు 7-30 గంటలకు హాస్టల్ నుంచి బయటకు వెళ్లి వస్తామని వెళ్లారు. సాయంత్రం గడిచినప్పటికీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన హాస్టల్ సిబ్బంది, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఆ ఇద్దరు బాలికల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన వారి తల్లిదండ్రులు కొందరు గ్రామస్థులు, పంచాయితీ అధికారుల తోడు తీసుకోని హాస్టల్ వద్దకు చేరుకున్నారు. తల్లిదండ్రుల పర్మిషన్ లేనిది పిల్లలను బయటికి ఎలా పంపిస్తారని గురుకుల సిబ్బంది, అధ్యాపకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ బాలికల కోసం బంధువులు, స్నేహితుల వద్ద వాకపు చేసినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి : కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: నియోజకవర్గంలో ప్రజలకు కావాల్సిన కనీస మౌలికవసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు కొనసాగిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మీడియాతో సోమవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. 20 నెలల్లో అనేక పనులు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతృప్తికరంగా ఉందన్నారు. తాజాగా సుజాతనగర్‌లో మరుగుదొడ్లు, బస్ షెల్టర్, వేపలగడ్డలో మరో బస్ షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.10లక్షలు, బస్ షెల్టర్ల నిర్మాణానికి మరో రూ.10 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. ఎమ్మెల్యే నిధులతో చేపట్టనున్న ఈ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి అనేక పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత శాఖల అధికారులకు అందించామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు.

భారీగా గంజాయి పట్టివేత...

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : వందల మందిని అరెస్టు చేసి జైళ్లకు పంపించిన జిల్లా మీదుగా కొనసాగుతున్న నిషేధిత గంజాయి స్మగ్లర్లు సరఫరా చేయటంలో వెనకాడటం లేదు. దాదాపు మూడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలి వెళ్తునే వుంది. సోమవారం ఉదయం సుజాతనగర్ మండలం పోలీసులు వేపల గడ్డ గ్రామం వద్ద ప్రధాన రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.2 కోట్ల 50 లక్షల విలువచేసే గంజాయిని తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సుజాతనగర్ పోలీస్‌స్టేషన్లో నిర్వాహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. 96ప్యాకెట్లలో 499 కేజీల గంజాయిని (కేటీఆర్‌ఏ 6754) నంబరు గల అశోక్ లేలాండ్ కంటైనర్ లారీలో తరలిస్తుండగా సిసి ఎస్, సుజాతనగర్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక చెందిన ఇద్దరు వ్యక్తులు లారీ కంటైనర్లో దీన్ని భద్రాచలం నుండి కొత్తగూడెం, ఖమ్మం మీదుగా రాజస్థాన్లోని జైపూర్‌కు అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. పక్క సమాచారంతో సుజాతనగర్ ఎస్సై రమాదేవి తన సిబ్బందితో కలిసి సంయుక్తంగా సుజాతనగర్ మండలం, వేపల గడ్డ వద్ద వాహన తనిఖీల్లో పట్టు పడినట్లు చెప్పారు. గంజాయి తరలిస్తు జగదీష్ జయరాం పాటిల్, సంజు కుమార్ లతోపాటు రెండు సెల్ ఫోన్లు, లారిని ఆధీనంలో తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ అక్రమ తరలింపులో హస్తమున్న అమిత్ రోహిదాస్ పాటిల్, హరి, అమిత్ రోహిదాస్ పాటిల్‌లపై కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి తోపాటు నేరస్తులను పట్టుకోవడంలో సహకరించిన సిసిఎస్ సిఐ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, రమాదేవి సిబ్బంది, కేసు విచారణాధికారి సీఐ వెంకటేశ్వర్లు, కేసు పర్య వేక్షణ చేసిన కొత్తగుడెం డిఎస్పీ అబ్దుల్ రెహమాన్ లను ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

ఓవర్ లోడు ఇసుక లారీలతో రోడ్లు ఛిద్రం

విశాలాంధ్ర - చర్ల : పది, పన్నెండు టైర్ల ఇసుక లారీలు నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్లతో చర్ల మండలంలో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భద్రాచలం నియోజకవర్గం కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లారీల రాకపోకల వల్ల రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని ఆరోపించారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి నూప పోతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. భద్రాచలం డివిజన్లో రేసింగ్ కాంట్రాక్టర్లు అత్యాశతో మితిమీరి ఇసుకను తోడుతూ చట్ట విరుద్ధంగా సాధారణ లోడుకి మించి అదనంగా ఐదారు టన్నులు 10 టన్నుల దాకా నింపి ఓవర్ లోడ్ తో లారీలను ఇసుక రవాణా చేయడం వల్ల ప్రధాన రహదారులన్నీ పెద్ద గుంటలు పడి పాడైపోతున్నాయన్నారు. ఇసుక లారీల ప్రమాదం నుండి ప్రజలను కాపాడాలని సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాత్రివేళ నడుస్తున్న జీరో అక్రమ ఇసుక రవాణా, జీరో వ్యాపార దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు అడ్డగర్ల తాతాజీ. కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ,నువ్వ తిరుపతిరావు, పాలంచ రామారావు, నానిపెల్లి భద్రం, పోడియం ఆదిలక్ష్మి, పాలెం సత్యనారాయణ, మల్లం నాగేశ్వరరావు, కోడి రెక్కల రాజారావు, ఆంద్రు వామనరావు, ఉప్పులూరి నాగరాజు, కట్టం నాగేశ్వరరావు, కట్ట ముత్తయ్య, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు శాశ్వత రిజర్వేషన్ అమలు పరచాలి

విశాలాంధ్ర - పెనుబల్లి : పెనుబల్లి మండలం వంగ ముత్యాల బంజర్ గ్రామంలో వంగా సీతారామయ్య ఫంక్షన్ హాల్ నందు పెనుబల్లి బీసీ రిజర్వేషన్ల సాధన పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా బీసీ ఉప కుల సంఘ ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు దక్కవలసిన రిజర్వేషన్ కోటాను తేల్చి అమలుపరచాలని డిమాండ్ చేశారు. మెజారిటీ ఉన్న బీసీలకు సముచిత స్థానం కల్పించడం లేదని వాటి లెక్కలు తేల్చకుండా అన్యాయం చేయడానికి తీవ్రంగా ఖండించారు. న్యాయస్థానం నిబంధనలకు అనుకూలంగా ఖచ్చితమైన లెక్కలు తేల్చి రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు శాశ్వత రిజర్వేషన్ ప్రాతిపదికలు అమలు పరచాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. బీసీలకు జరుగుతున్న అన్యాయానికి లక్షల సంఖ్యలో రోడ్లపైకి వచ్చి నిరసన ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

ప్రతి నెల 100కు పైగా మొబైల్ ఫోన్ల రికవరీ



విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం మొబైల్ ఫోన్ రికవరీ మేళా ఘనంగా జరిగింది. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రజలు పోగొట్టుకున్న 102 మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేసి బాధితులకు అందజేశారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ నాయకత్వంలో పోలీసు బృందం శ్రమించి పెద్ద మొత్తంలో ఫోన్లను తిరిగి యజమానులకు అందించింది. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ తెలిపారు, ఈ ఏడాది ఆరో దఫాగా మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామని, ఇప్పటివరకు 7 కోట్ల 15 లక్షల రూపాయల విలువైన 842 మొబైల్స్‌ను ప్రజలకు తిరిగి అందజేశామని చెప్పారు. ఈరోజు అందజేసిన 102 ఫోన్లు సూర్యాపేట పోలీసుల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ఈ ఫోన్లు ట్రేస్ చేసి తెప్పించామని తెలిపారు. మొబైల్ చోరీ లేదా పోగొట్టుకున్నా, కేవలం ఫోన్ కాదు, విలువైన వ్యక్తిగత సమాచారం కూడా కోల్పోతున్నామని హెచ్చరించారు. మొబైల్ పోయిన వెంటనే CEIR పోర్టల్‌లో నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని చెప్పే సైబర్ మోసగాళ్ల మాటలు నమ్మవద్దని సూచించారు. అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటీ కోర్ సిబ్బంది బాధితులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పీఎస్‌బీల ప్రైవేటీకరణకు దొడ్డిదారి కుట్రలు

నయా ఉదారవాద విధానాలకు అనుగుణంగా దేశీయ, విదేశీ కార్పొరేట్‌లకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థలను విధ్వంసం చేసేందుకు మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి శతవిధాల ప్రయత్నిస్తున్నది. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు చేసిన పోరాటానికి తలొగ్గినట్టు కనపడిన మోదీ ప్రభుత్వం దొడ్డిదారిన ఆ చర్యలను కొనసాగిస్తూనే ఉంది. ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ) ల్లో అత్యున్నత స్థాయి పోస్టులను బయట వ్యక్తులతో భర్తీచేసే ప్రమాదకర, తిరోగమన చర్యతో తాజాగా ముందుకొచ్చింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా కంపెనీలలో మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, హోల్ టైమ్ డైరెక్టర్, పదవులను ప్రైవేటురంగ అభ్యర్థులకు కట్టబెట్టేలా కేంద్ర ప్రభుత్వంలోని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది కేబినెట్ (ఏసీసీ) ఇటీవల మార్గదర్శకాలను విడుదల చేసింది. సవరించిన మార్గదర్శకాలకు కేంద్ర కేబినెట్ ఈ నెల 4 వ తేదీన ఆమోదముద్రవేసింది. పీఎస్‌బీల్లో అత్యున్నత స్థాయి పోస్టులను బయటి వ్యక్తులకు కట్టబెట్టడం అంటే ఈ రంగాన్ని ప్రైవేటీకరించే కుట్ర తప్ప మరొకటి కాదు. ప్రభుత్వరంగ బ్యాంకింగ్, బీమా అనేవి ప్రయోగాల కోసం పరికరాలు ఏమాత్రం కాదు. అవి ఆర్థిక న్యాయం. జాతీయ సార్వభౌమత్వ రాజ్యాంగ సాధనాలు. దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థ వెన్నెముక వంటిది. అంతటి ప్రాధాన్యత కలిగిన సంస్థల స్వభావాన్ని నిర్వీర్యం చేసేందుకు లేదా ప్రైవేటీకరించేందుకు బ్యాక్‌డోర్ ఎగ్జిక్యూటివ్‌ల నియామకం ఏమాత్రం సమర్థనీయంకాదు. ప్రైవేటు, కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం ప్రముఖ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి, ఉపయోగించుకోవడానికి ప్రభుత్వ ఈ చర్య మార్గం సుగమం చేస్తుంది. ఇందుకోసం జాతీయ ప్రయోజనాలను, ప్రజలను ఫణంగా పెట్టేందుకు కూడా మోదీ ప్రభుత్వం ఎంత మాత్రం వెనుకాడడంలేదు. ఎస్‌బీఐ లాంటి పెద్ద సంస్థల్లో ఒక ప్రొబేషనరీ ఆఫీసర్ సంవత్సరాల సేవ, అనుభవం ద్వారా చైర్మన్‌గా ఎదగగలడు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో వారికి ఇకపై అటువంటి అవకాశాలు ఉండవు. బయట అభ్యర్థులను ఉన్నత స్థానాల్లోకి అనుమతించడం వల్ల ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం మెండుగా ఉంది. వీటిలో ప్రైవేటు వ్యక్తుల నియామకమే చట్టవిరుద్ధం. ప్రభుత్వ ఈ చర్య కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల లక్ష్యాలు దెబ్బతింటాయి. అంతర్గత ఉద్యోగులకు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుంది. నియామకాల్లో ప్రైవేటు హెచ్‌ఆర్ సంస్థలు ప్రవేశిస్తాయి. ప్రభుత్వ అనుకూల ప్రైవేటు వ్యక్తుల ఆధిపత్యం పెరిగే ప్రమాదం బాగావుంది. భారతీయ స్టేట్‌బ్యాంకు చట్టం 1955, బ్యాంకింగ్ కంపెనీస్ యాక్ట్ 1970, 1980, ఎల్‌ఐసీ యాక్ట్, 1956 ను సవరించకుండానే ఈ మార్గదర్శకాలు జారీ చేయడం చట్టవిరుద్ధమని బ్యాంకు ఎంప్లాయీ యూనియన్లు ఘోషిస్తున్నాయి. ఇది రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తుందని పేర్కొన్నాయి. ప్రభుత్వ ఈ చర్యకు బ్యాంకింకు రంగ ఉద్యోగులు, ఉన్నతాధికారులు, సంఘాల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమౌతోంది. దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు, భారత జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసి), నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో నిర్వహణ స్థానాల్లో ప్రైవేటు వ్యక్తుల నియామకానికి కేంద్ర మంత్రివర్గం ఈ నెల 4 న సవరించిన మార్గదర్శకాలు ఏమాత్రం దోహదంచేయవు.

పదుల లక్షల సంఖ్యలోని బ్యాంకు ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న తొమ్మిది యూనియన్లతో కూడిన యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఈ చర్యను తీవ్రంగా ఖండించింది. ఇది ప్రభుత్వ రంగంపై దాడిగా పేర్కొంది. ఈ సవరించిన ఏకీకృత మార్గదర్శకాలను వ్యతిరేకించే ఉద్యోగులకు కేంద్ర కార్మిక సంఘాలు తమ మద్దతు తెలియజేస్తున్నాయి. ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థల రక్షణకు పోరుసల్పాలని పిలుపునిచ్చాయి. కేంద్ర ప్రభుత్వ తిరోగమన చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని కార్మికవర్గానికి ఏఐటీయూసీ, ఇతర కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మార్గదర్శకాల చట్టబద్ధతను యూఎఫ్‌బీయూ ప్రశ్నించింది. ఏసీసీ మార్గదర్శకాలు ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థలపై నిర్మాణాత్మక దాడిగా పేర్కొంది. ఈ నియామకాలను అనుమతించబోమని యూఎఫ్‌బీయూ పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 73, 77 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ అధికారాలు పార్లమెంటు చేసిన చట్టాలకు అనుగుణంగా ఉండాలని యూఎఫ్‌బీయూ పేర్కొంది. అర్హత లేదా నియామక ప్రక్రియలలో ఏదైనా మార్పు చట్టసభ సవరణ ద్వారా జరగాలనీ, కేవలం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా కాదని స్పష్టం చేసింది. సీనియర్ పబ్లిక్ సెక్టర్ బ్యాంకర్లు కూడా ఈ పాలసీ మార్పుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇది పీఎస్‌బీల ఉనికికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుందని పేర్కొన్నది. ఈ మార్గదర్శకాలు దశాబ్దాలుగా దేశ ప్రజల ఆర్థిక వ్యవస్థతో నిర్మించిన ప్రభుత్వ ఆర్థిక సంస్థల భద్రత, సమగ్రతకు కలిగించే తీవ్రమైన ముప్పుగా ఏఐటీయూసీ పేర్కొంది. కేబినెట్ కమిటీ ఏకీకృత మార్గదర్శకాలతో ప్రైవేటు రంగ ఎగ్జిక్యూటివ్‌లను మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, హోల్‌టైమ్ డైరెక్టర్, ఛైర్‌పర్సన్ పదవులకు పరిగణించడానికి అనుమతించడం పార్లమెంటు రాజ్యాంగ అధికారాలను తీవ్రంగా ఉల్లంఘించే మార్గమేనని పేర్కొంది. ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు చేసిన పోరాటంతో నిరాశ చెందిన మోదీ ప్రభుత్వం, ప్రైవేటు రంగానికి ఉన్నత పదవులను ఇవ్వడానికి ఈ ప్రమాదకరమైన, తిరోగమన చర్యతో ముందుకొచ్చిందనడంలో ఎటువంటి అనుమానంలేదు. ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల రక్షణకు, ఈ సవరించిన ఏకీకృత మార్గదర్శకాలకు వ్యతిరేకిస్తూ ఉద్యోగ సంఘాలు, కార్మికవర్గం పోరుబాట పట్టాలి. కేంద్ర ప్రభుత్వ తిరోగమన చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలి. మోదీ నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం ఇక మీదట ఇటువంటి వినాశకర, విచ్ఛిన్నకర నిర్ణయాలు తీసుకునేందుకు సాహసించని విధంగా ఆ ఉద్యమ స్వరూపం వుండాలి. కేంద్ర ప్రభుత్వం ఈ వినాశకర చర్యలను తక్షణం ఉపసంహ రించుకుని, ఈ జాతీయ సంస్థల ప్రజా స్వభావాన్ని నిలబెడుతుందని ఆశిద్దాం.

చెప్పు! చెప్పు!

చింతపట్ల సుదర్శన్

సాయంత్రం అయిదు దాటినా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు బాగా తడిసి శుభ్రపడి తళతళా మెరుస్తున్నాడు సూరీడు. అరుగు మీద కాళ్లు చాపుకు కూచుని డాగీ కోసం ఎదురుచూస్తున్నది డాంకీ. మొరిగే కుక్కా, తిరుగుళ్లు తిరిగే కుక్కా ఆ అలవాటు మానుకోలేవు కదా అని డాంకీ అనుకుంటుండగానే దూరాన వీపు మీద ఎండని మోసుకు వస్తూ కనపడింది డాగీ. వీపు మీద ఎండ సరే నోట్లో ఏదో ఉంది. ఏమిటో అది అని పరీక్షగా చూసింది కాని, కళ్లకి సూర్యుడి బాణాలు గుచ్చుకుని సరిగ్గా కనబడలేదు. తినబోతూ రుచి అడగడం దేనికి, వీధిలోకి వచ్చినోడు గుమ్మంలోకి రాకుండా పోతాడా రానీ అని వెయిట్ చేసింది డాంకీ.

పళ్ల మధ్యన దాన్ని అలాగే ఇరికించుకుని అరుగు ఎక్కింది డాగీ. అప్పుడు అదేమిటో అర్థం అయింది డాంకీకి. ఏవిటది డాగీ ఎన్నడూ లేనిది ఇలా నోట కరుచుకు వచ్చావు. కుక్కకు చెప్పే లాభం అనా అంటూ పళ్లు బయటపెట్టింది డాంకీ.

ఏ ఎండకు ఆ గొడుగు పట్టే పొలిటీషియన్‌లా అవసరానికో

రంగస్థలం

స్టేట్‌మెంట్ ఇచ్చి మర్చిపోయే మంత్రిగారిలా భాషనూ, సామెతలనూ భ్రష్టు పట్టించకు. కుక్క కాటుకు చెప్పుదెబ్బ అన్న మాట ఉందంటే ఒప్పుకుంటాను కానీ నన్ను అనవసరంగా దొంగని చేయకు. దొంగల్ని పట్టుకునే కుక్కని అంటే పోలీసోడ్ని దొంగ అన్నట్టే మరి అంది డాగీ అరుగు మీద కూచుని తను నోటితో పట్టుకు వచ్చిన చెప్పును ఇష్టం వచ్చినట్టు కొరికేస్తూ! పోలీసుల్లో దొంగలు లేకపోలేదు, దొంగ పోలీసులూ లేకపోలేదు. ఆ మాటకొస్తే రాజకీయ రంగం మొదలుకొని అన్ని రంగాల్లోనూ దొంగలు వీరంగం ఆడుతున్నారులే. ఇంతకూ ఆ చెప్పు ఎవరిది నీ నోటికి ఎలా చిక్కింది చెప్పరాదూ అంది డాంకీ. అలా అన్నావు బాగుంది మిలార్డ్! వస్తూ ఉంటే దోవలో ఓ సన్నాసి కనిపించాడు. మంచోడా దొంగోడా తెల్సుకుందామని ఓ అరుపు అరిచా అలవాటు కదా. ఆ అరుపునకు జడిశాడో, గంజాయి మత్తు తలకెక్కిందో కానీ ఓ కాలి చెప్పు తీసి నా మీదికి విసిరేశాడు. నాకు తిక్కరేగింది. అయినా సంబాళించుకున్నా. ఒక్క కాలి చెప్పుతో కుంటుతూ నడవరా బైరాగీ అనుకుంటూ వాడి గురితప్పి నా నోటికి చిక్కిన చెప్పును తీసుకొచ్చా కాసేపు కాలక్షేపం అవుతుందని, అచ్చంగా తోలుతో చేసిందయితే అంతో ఇంతో ఆకలి తీర్చకపోదాని అంది డాగీ.

ఓహో ఆపరేషన్! 'షూవేర్' అన్న మాట. ఇక తెల్లవార్లూ దాని అంతు చూడటమే నీ పనన్న మాట, తోక తిప్పడం కూడా మానేస్తావన్న మాట అని డాంకీ అంటున్నప్పుడు అరుగు ఎక్కాడు అబ్బాయి. రా!రా! నువ్వు వస్తే కాని మన మీటింగుకి 'కోరమ్' పూర్తవదు అని ఆహ్వానించింది డాగీ.

అరుగు మీద కూచుంటూ ఏదో ఆపరేషన్ అనే మాట చెవికి గుచ్చుకుంది అన్నాడబ్బాయి. అరుగు మీదకి వచ్చేప్పుడే చెవులు బాగా తెర్చుకు వస్తావనుకుంటా, టక్కున పట్టేస్తావు అంది డాంకీ. ఆ మాట అన్నది డాంకీ విన్నది నేనూనువ్వూ, అది ఇదిగో ఈ చెప్పు గురించే అన్నది డాంకీ. ఓహో! అదా విషయం. నీ నోటికాడ చెప్పు విషయమా? ఎవరిదా చెప్పు! చెప్పు ఒక కాలు చెప్పు ఎత్తుకొస్తే ఆ మనిషి ఒక్క చెప్పుతో ఎలా నడవగలడసలు. చెప్పంటే అల్లాటప్పా వ్యవహారం కాదు సుమా. మొన్న ఎలెక్షన్లప్పుడు మా నియోజక వర్గం అభ్యర్థి తను గెలిస్తే తన చర్మంతో చెప్పులు కుట్టిస్తానన్నాడు అన్నాడబ్బాయి. ఒక్క చర్మంతో ఎన్ని జతల చెప్పులు ఎందరికి కుట్టించాడేమిటి అన్నది డాగీ. గెలిస్తే కదా కుట్టించేది. గెలవలేదుగా. ఒకవేళ గెలిచినా కుట్టించే వాడేం కాదులే. ఎన్నికలకు ముందు ఎన్నో చెప్తారు అన్నీ చేసి చూపించటానికా యేం? అన్నాడు అబ్బాయి. నువ్వన్నట్లు 'బ్రో' చెప్పు అనేది మామూలు విషయమేం కాదు. రాముడన్నయ్య చెప్పులేగా రాజ్యం చేసింది భరతుడి రాజ్యంలో అన్నది డాంకీ. పాత కథను వదిలేద్దాం డాంకీ. ఇప్పుడో చెప్పు కథ దేశమంతా సంచలనంగా మారింది అన్నాడబ్బాయి. అవును నేనూ నమిలా పేపర్లో, మరీ వెర్రి వెయ్యో విధం కాకపోతే ఉన్నత న్యాయస్థానంలో ఉదాత్తంగా ఉండాల్సిన ప్లీడర్ గౌరవనీయుడైన జడ్జిగారి మీదకు చెప్పు విసరబోవడం విడ్డూరం, చోద్యం, పిదపకాలపు బుద్ధీ, నడమంత్రమూ ఇంకా ఏమేమి అనాలో తెలీడం లేదు అంది డాంకీ. అలాగ విసిరేయడానికి తల తిక్కతో పాటు, వెనకాల కావల్సినంత దన్ను కూడా ఉండి ఉండాలి అంది డాగీ. ఈ రోజు లాయర్ చెప్పు తీస్తే ఇకముందు బోనులో దొంగ నాకొడుకులు కూడా ఆ పని చేయరూ. ముందు ముందు చట్టసభల్లో తొడుక్కున్నవి కాక ఓ జత చెప్పులు అదనంగా తెచ్చుకుంటారు 'కోపోద్రేకాన్ని' ప్రదర్శించడానికి అంది డాగీ.

చెప్పుతినే కుక్కవయినా చక్కగా చెప్పావు డాగీ. ఇలా ఒళ్లు తెలీకుండా, విద్యా వివేకం సంస్కారం అన్నీ మరిచిపోయి, ఉన్నత వ్యవస్థలో ఉన్నవాళ్లను అవమానించే సాహసానికి ఒడిగట్టడం సిగ్గుచేటు అన్నాడు అబ్బాయి. ఇలాంటివి ఇకముందు జరక్కుండా ఉండాలంటే చట్టసభల్లో, కోర్టుల్లోకి చెప్పులు తొడుక్కున్న వారికి ప్రవేశం లేకుండా చేస్తేసరి అంది డాంకీ. అవును దేవుడి గుడిలోకి ప్రవేశించడానికి ముందు చెప్పులు బయట విడిచినట్టు విడిచిపోవాలని నిబంధన పెడితే ఉన్నతమైన వ్యవస్థల గౌరవం దక్కుతుందేమో! అంది డాంకీ.

ఉన్నత విద్యకు 'అత్తెసరు' మార్కులే

ప్రొఫెసర్ మీటా బాబీ వర్ధన్

విద్య, వైద్యం, సేద్యం రంగాలకు ప్రాధాన్యత నిచ్చిన దేశాలు దినదినాభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా ఉన్నత విద్యకు ప్రోత్సాహకాలు అందించిన దేశాలు, రాష్ట్రాలు ఔన్నత్యాన్ని సాధిస్తాయి. ఈ రంగానికి కేటాయింపులు చేయడం పెట్టుబడులుగా భావిస్తారు. ఉన్నత విద్య విరాజిల్లితేనే మేధో ఉత్పత్తి జరిగినట్టుగా భావించాలి. సకల సౌకర్యాలతో కళాశాల విద్య కొనసాగితేనే, దాని పునాదుల మీద ఏర్పడే ఉన్నత విద్య సత్ఫలితాలను ఇస్తుందన్నది కాదనలేని వాస్తవం. కానీ, ప్రస్తుతం ఉన్నత విద్యను ఖర్చుగా భావించే నేతలు, ప్రభుత్వాలు దీన్ని అశ్రద్ధ చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ విద్యాసంస్థలు నిరాదరణకు గురవుతున్నాయి. ఇదే అదనుగా, మరో పక్క ప్రైవేటు విద్యాసంస్థలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి లక్షల్లో ఫీజులతో కోట్లకు పడగలెత్తుతున్నాయి. దీంతో కేవలం ధనవంతుల పిల్లలు మాత్రమే ఇలాంటి సంస్థల్లో చదువు'కొన'గలుగుతున్నారు. పేదల పిల్లలకు నాణ్యమైన ఉన్నత విద్య దూరమవుతోంది. అరకొర సౌకర్యాలున్న విద్యాసంస్థల్లో చదువుకోవడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే విషయంలో వెనుకబడి పోతున్నారు గ్రామీణ, మధ్యతరగతి విద్యార్థులు. చదివిన చదువుతో ఏమాత్రం సంబంధం లేని ఉద్యోగాలకు క్యూ కడుతున్నారు. ఈ మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు లక్షల సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సుమారు ఆరువేల దాకా ఎంపికయ్యారు. దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో కొందరు డాక్టరేట్ చేసిన వాళ్లూ ఉండటం విషాదం కదా! ఇక బీటెక్, ఎంటెక్, ఎంఏ, ఎంఈడీ చేసిన వాళ్లూ ఉన్నారంటే ఆశ్చర్యంతో పాటు ఆందోళన కూడా కలుగుతుంది. నాణ్యతలేని విద్యాప్రమాణాలతో, పోటీని ఎదుర్కొనలేక, ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోతున్నారు కొందరు. ఎవరు దీనికి బాధ్యత వహిస్తారు?

గణాంకాలు ఘనమే కానీ...: విద్య ఉమ్మడి జాబితాలో ఉండడం వల్ల అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చాలి. కేంద్ర స్థాయిలో యూనివర్సిటీ గ్రాంట్ల కమిషన్ (యూజీసీ) అధ్యాపక నియామకాలకు అనుమతినిస్తూ, ఐదేళ్ల పాటు జీతభత్యాలు కూడా భరిస్తుంది. అలాగే ప్రాజెక్టులు, స్కీములకు కూడా ఆర్థిక సహాయం చేస్తుంది. నాణ్యతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు మదింపు చేస్తూ, జాతీయ (నాక్, ఎన్‌ఐఆర్‌ఎఫ్) సంస్థల ద్వారా ర్యాంకింగ్ ప్రకటించే ప్రక్రియ కూడా యూజీసీనే నిర్వహిస్తుంది. ఆశ్చర్యం ఏమిటంటే అరకొర సౌకర్యాలు ఉన్న కళాశాలలు, విశ్వవిద్యాలయాలు సైతం ఎలాగోలా మేనేజ్ చేసి గొప్ప ర్యాంకులు సాధిస్తుండడం పరిపాటిగా మారింది. ఆ మధ్య కె.ఎల్. యూనివర్సిటీ లంచాలు ఎరచూపి 'గొప్ప' ర్యాంకు సాధించబోయి అడ్డంగా 'దొరికిపోయిన' సంగతి గుర్తుండే ఉంటుంది. మీడియా పుణ్యమాని బయటపడింది ఒకటి, రెండు మాత్రమే, ఇలాంటివి మరెన్నో వుండే ఉంటాయి. 2024 విద్యా సంవత్సరం నివేదిక ప్రకారం దేశం మొత్తం మీద 1120 యూనివర్సిటీలు, 43,800 కళాశాలలు, మరో 11,200 ఇతర విద్యాసంస్థలు మనుగడలో ఉన్నాయి. వీటిలో ఐఐటీలు 23, ట్రిపుల్‌ఐటీలు 26, ఐఐఎంలు 21 కూడా ఉన్నాయి. డిగ్రీ కళాశాలలతో కలిపి మొత్తం 15 లక్షల దాకా అధ్యాపకులు పనిచేస్తున్నారు. దాదాపు మరో తొమ్మిది లక్షల మంది అధ్యాపకుల కొరత ఉన్నట్టు సమాచారం. ఇక మన రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంతో కలిపి 28 యూనివర్సిటీలున్నాయి. వీటిలో దాదాపు 17 వేల దాకా వివిధ స్థాయిల్లో అధ్యాపకుల కొరత ఉందంటే, పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటుతున్నా ఇంకా కొన్ని యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను నియమించనే లేదు. కళాశాల, విశ్వవిద్యాలయం స్థాయిలో వేల సంఖ్యలో బోధనా సిబ్బంది కొరత ఉంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఉన్నత విద్య తీవ్ర నిరాదరణకు గురవుతోంది. నియామకాల ఊసే ఎత్తడంలేదు. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను దగ్గర చేసేందుకు (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో) జిల్లాకు ఒక విశ్వవిద్యాలయం ఉండేలా చర్యలు తీసుకున్నారు. ట్రిపుల్ ఐటీలను ప్రారంభించారు. యూజీసీ ఫార్ములా ప్రకారం బోధనా సిబ్బంది నియామకాలకు అనుమతి కూడా ఇచ్చారు. ఈ మేరకు ప్రతి కొత్త యూనివర్సిటీలో, ఒక్కో విభాగానికి ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. కొన్నిచోట్ల సగం ఖాళీలు మాత్రమే భర్తీ అయ్యాయి. పాత యూనివర్సిటీల కోసం కొంత మేరకు నియామకాలను కూడా నిర్వహించారు. కొన్ని యూనివర్సిటీలు 'ఒప్పంద' అధ్యాపకులను నియమించుకున్నాయి. వీటికి ఒక్కో యూనివర్సిటీ ఒక్కోరకంగా పేర్లు పెట్టాయి. ఒకరు టీచింగ్ అసిస్టెంట్ అనీ, మరొకరు అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టు అని, ఇంకో చోట టీచింగ్ అసోసియేట్ అనీ, మరోచోట టీచింగ్ అరెంజ్మెంట్స్ అనీ, కొన్నిచోట్ల అకాడమిక్ అసిస్టెంట్ అనీ ఇలా రకరకాల పేర్లతో గందరగోళం సృష్టించారు. ఏక రూపత లేకపోవడం వల్ల జీతభత్యాల విషయాల్లోనూ తేడాలు కనిపించాయి. కొన్నిచోట్ల వీరిని అధికారిక పదవుల్లో సైతం కూర్చుండబెట్టగా, కొన్నిచోట్ల వీరిని, అనర్హులుగా, 'అంటరాని' వారిగా పరిగణించడం అత్యంత శోచనీయం. న్యాక్ లాంటి సంస్థలు తనిఖీలకు వచ్చినప్పుడు వీరిని 'ముందు' కూర్చుండబెట్టి మంచి ర్యాంకులు సాధిస్తున్నారు కానీ, వీరి జీతాల విషయంలో తీవ్ర వివక్షను చూపుతున్నారు. డాక్టరేట్, పోస్ట్‌డాక్టోరల్ డిగ్రీలు పొంది, అనేక పరిశోధనా పత్రాలు ప్రచురించిన ఒప్పంద అధ్యాపకుల్లో 50 సంవత్సరాలు దాటిన వారూ ఉన్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

యూనివర్సిటీ స్థాయిలో దోపిడీకి గురవుతున్న మరో వర్గం 'అతిథి' అధ్యాపకులు. వీరి పరిస్థితి మరింత దారుణం. శాశ్వత అధ్యాపకులు, ఒప్పంద అధ్యాపకులతో సమానంగా వీరికి వర్క్‌లోడ్ ఉంటుంది. అర్హతలు విషయంలో వీరూ సరిసమానులే కాకుంటే భత్యాల విషయంలో తీవ్ర వివక్షకు గురవుతున్నారు. సబ్జెక్టుకు 45 వేల చొప్పున చెల్లిస్తారు. రెండు సబ్జెక్టులు బోధిస్తే 90 వేలు టాక్స్ పోను 81 వేలు నెలకు కాదు సుమా సెమిస్టర్ మొత్తానికి కలిపి, అంటే సుమారు నాలుగు నెలలకు కలిపి ఈ మొత్తం అన్నమాట. ఏతావాతా నెలకు 20 వేల రూపాయలన్న మాట. విశాఖపట్నం లాంటి మెట్రో నగరంలో ఈ మొత్తం ఏపాటిదో తలచుకుంటేనే హృదయం ద్రవిస్తుంది. ఇంతోటి 'చాకిరీ'కి భారీస్థాయిలో నోటిఫికేషన్లు, ఇంటర్వ్యూలో లక్ష యక్ష ప్రశ్నలు, అది కూడా ప్రతి ఏడాది, ప్రతి సెమిస్టర్‌కీ ఈ 'ప్రసవ వేదన'. దీన్ని మించిన శ్రమ దోపిడీ, దగా మరోటి ఉంటుందా? అయినా రేపటి మీద ఆశతో వీరంతా కష్టాలను దిగమింగు కుంటూ బతుకీడుస్తున్నారు. అన్ని అర్హతలు ఉండీ 'అతిథి'గా కొనసాగుతున్నారు. ఒక ఉన్నత విద్యా సంస్థ నాణ్యతను అంచనా వేసేందుకు సుశిక్షితులైన బోధనా సిబ్బంది ఎంత అవసరమో, పరిశోధన చేసేందుకు అర్హత కలిగిన మార్గదర్శకులు (గైడ్లు) అంతకంటే అవసరం. ఏడాదికి ఏడాదికి ఉద్యోగ విరమణ చేస్తున్న ఆచార్యుల సంఖ్య పెరిగిపోతోంది. పీహెచ్‌డీలకు గైడ్స్‌గా వ్యవహరించాలన్నా, జాతీయ స్థాయి ప్రాజెక్టులు సాధించాలన్నా శాశ్వత బోధనా సిబ్బంది అవసరం ఎంతైనా ఉంది. అయితే అలాంటి దిశగా అడుగులు పడడం లేదు. ఈ కొరతను అధిగమించడానికి కొన్ని యూనివర్సిటీలు 'ఒప్పంద' అధ్యాపకులను రీసెర్చ్ గైడ్లుగా నియమిస్తున్నారు. పరీక్షా పత్రాల మూల్యాంకనం చేయిస్తున్నారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో మెంబర్లుగా కూడా నియమిస్తున్నారు. ఒక్క వేతనంలో వ్యత్యాసం మినహా మిగతా పనులన్నీ శాశ్వత అధ్యాపకులతో సమానంగా కేటాయిస్తున్నారు. జీతాల విషయంలో 'దోపిడీకి' గురవుతున్నా, కెరీర్‌ని అభివృద్ధి చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని వారెంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే, ఒకే రాష్ట్రంలో వేర్వేరు యూనివర్సిటీల్లో వేర్వేరు పద్ధతులు అమల్లో ఉండటం దారుణం కదూ! సమాన పనికి సమాన వేతనం అనే రాజ్యాంగ సూత్రానికి తూట్లు పొడవడమే కాక, శ్రామిక చట్టాలను సైతం తుంగలో తొక్కి అన్ని అర్హతలున్న నిరుద్యోగులకు 'ద్రోహం' చేస్తున్నారు. కష్టాలెన్ని ఎదురైనా ఓర్పుతో నెట్టుకొస్తున్నారు ఒప్పంద, అతిథి అధ్యాపకులు. ఎప్పటికైనా నోటిఫికేషన్ రాకపోతుందా అన్న ఆశ. రాజశేఖర్‌రెడ్డి హయాంలో చివరి సారిగా పూర్తి స్థాయిలో నియామకాలు నిర్వహించారు. ఆ తర్వాత స్కూలు టీచర్ల నియామకాలు జరిగాయి కానీ, ఉన్నత విద్యా సంస్థల్లో నియామకాలు జరుపలేదు. 2014-2019 మధ్యకాలంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. తొలిసారిగా పరీక్షా విధానంలో నియామకాలు చేపట్టాలని ప్రయత్నాలు చేసింది. 'కీ'లో తప్పులు దొర్లడంతో అనేక సమస్యలు తలెత్తాయి. వాటన్నింటినీ సరిచేసి నియామక ప్రక్రియ మొదలవుతుందనుకునే లోపే, రోస్టర్ పాయింట్స్ విషయంలో అన్యాయం జరిగిందని కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో నియామకాలకు బ్రేక్ పడింది. తర్వాత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అధికారంలో వచ్చిన ప్రభుత్వం, నాడు-నేడు పేరుతో ప్రాథమిక, వైద్య విద్య మీద దృష్టి సారించింది. కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. కొన్నింటిని ప్రారంభించారు. మరికొన్ని నిర్మాణ దశలో ఉండగా ఎన్నికలు రావడం, వైసీపీ ఘోరంగా ఓడిపోవడం ఊహించని పరిణామం. అయితే, యూనివర్సిటీ స్థాయిలో ఖాళీల సంఖ్యను ఖరారు చేయడం, దామాషా ప్రకారం కేటాయింపులు చేశారు. నియామకాలు మాత్రం చేపట్టలేదు. ఇప్పుడు మళ్లీ తెలుగుదేశం (కూటమి) అధికారంలోకి వచ్చింది. యువ నాయకుడు లోకేశ్ విద్యాశాఖ మంత్రి అయ్యారు. యూనివర్సిటీలకు 'ప్రపంచ స్థాయి'ని తీసుకు రావాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఐఐటీల నుంచి ఆచార్యులను 'దిగుమతి' చేసి వైస్‌ఛాన్సలర్లుగా నియమించారు. పాలనలో ఏడాది గడిచినా, ఇంకా కొన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకాలే జరుపలేదు. ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. ఇక రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కూడా పెద్ద విద్యాసంస్థ నుంచే వచ్చారు అయితేనేమి, నియామకాల ఊసే ఎత్తడం లేదు. అతిథి అధ్యాపకులతో లాగించేస్తున్నారు. కాలానుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బంది నియామకం, పరిశోధకులకు కావాల్సిన పరికరాలు, పరిస్థితులు కల్పించకుండా వర్సిటీలకు 'ప్రపంచ స్థాయి'ని తీసుకు రావడం సాధ్యమేనా? వయసు మీరి పోతున్న మేధావులను గాలికి వదిలేయడమేనా? ఐదేళ్లు నిస్సారంగా కాలం వెళ్లదీసి, ఆఖరి ఏడాది, అదీ ఎన్నికల ముందు నోటిఫికేషన్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసం? ఎవర్ని మోసం చేయడానికి ఇన్ని ప్రహసనాలు? ఆశల ఎండమావుల వెంట పరుగులు పెడుతున్న మేధో నిరుద్యోగుల దాహార్తిని తీర్చే ప్రణాళికలు ఎప్పుడు సిద్ధం చేస్తారు? ఇవన్నీ చిక్కు ప్రశ్నలే! అంతు చిక్కని సమస్యలే!! ఎంత సేపటికి ప్రపంచ స్థాయి ర్యాంకులు రావాలని, వందలోపు ర్యాంకు సాధించాలని, ఊదరగొట్టే మన నాయకులు కనీసం అవేంటో తెలుసుకుంటున్నారా? ర్యాంకులు సాధించడానికి కావలసిన పరిస్థితి మన యూనివర్సిటీల్లో ఉందా? ఉన్నత విద్యలో ప్రతిష్టాత్మకంగా భావించే ఐఐటీ, ఐఐఎంలే వాటి దరిదాపుల్లోకి వెళ్లలేకపోతున్నాయి. ఇక ఏ మాత్రం సదుపాయాలు లేని సంప్రదాయ యూనివర్సిటీల సంగతి ఏం చెప్పాలి? ఇంతా చేస్తే బొంబాయి ఐఐటీ ప్రపంచ స్థాయిలో ముక్కీ మూలిగీ 132 వ ర్యాంకింగు సాధించడానికి ఆపసోపాలు పడింది. అసలు అధ్యాపకులే లేకుండా ఆంధ్రా యూనివర్సిటీ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో కోర్సును ప్రవేశ పెడుతుందట!

జర్నలిజం పూర్వపు విభాగాధిపతి డీన్,
మీడియా విశ్లేషకులు, 9393100566.

అపరాధి లాయరుకు శిక్ష లేదా!

కె.రవీంద్రన్

కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టు రూములో పొగరుబోతు న్యాయవాది రాకేశ్‌కిశోర్ తనను తీవ్రంగా అవమానించినప్పటికీ ఆయనను క్షమించడం ద్వారా రాజ్యాంగ సంస్థలను గౌరవించిన ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ గొప్ప న్యాయమూర్తి. 71 ఏళ్ల కిశోర్ తన తుచ్ఛమైన చర్యల వెనుక ఎవరి ప్రోత్సాహం లేదంటున్నారు. పొరపాటు ఏదైనా మాట్లాడడం కూడా కాదు. కాలి బూటును సీజేఐ గవాయ్ వైపు విసరగా అది మధ్యలో పడిపోయింది. న్యాయ సంస్థలకు సైతం గౌరవాన్ని ప్రధాన న్యాయమూర్తి నిలిపారు. తప్పు చేసిన లాయరుపైన నేర విచారణ జరపాలని అనేకులు కోరుకున్నప్పటికీ ప్రధాన న్యాయమూర్తి తిరస్కరించి క్షమించారు. దుండగుడి ప్రవర్తన క్రూరమైంది, హేయమైంది. ప్రధాన న్యాయమూర్తి అనుసరించిన విధానం రాజ్యాంగానికి అత్యున్నత గౌరవమైంది. ఇలాంటి ఇబ్బందులు కల్పించే ప్రశ్నలు వ్యక్తిగతమైనవా లేక న్యాయ సంస్థలను అవమానించేవా? ఈ ఈ సంఘటన సిగ్గు చేటైంది. విభ్రాంతికరమైంది. న్యాయపరంగా న్యాయమూర్తి తీసుకున్న నిర్ణయం ఎంతో ఔచిత్యమైంది. ఒక లాయర్ తీసుకున్న దుర్మార్గమైన నిర్ణయం హృదయాన్ని బాధిస్తుంది. కోర్టు రూము వాదోపవాదాలకు, తీర్పునకు కేంద్రం కాదు, ఇది చట్టబద్ధమైన విధానానికి చిహ్నం. ఈ ప్రదేశాన్ని ఏమాత్రం తృణీకరించరాదు. కోర్టు రూములో పనిచేసే వ్యక్తి కోర్టు గౌరవాన్ని, ఔన్నత్యాన్ని నిలుపుతానని ప్రమాణం చేసిన లాయరు. జరిగిన అప్రతిష్ఠ వ్యక్తిగతమైంది కాదు, ఒక చిహ్నం లాంటిది కాదు. ప్రధాన న్యాయమూర్తిపై లాయరు కాలి బూటు విసరడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు. నీతి, నియమాలను నిలిపి విచారణ చేసే న్యాయాధికార సంస్థ. తాను లాయరునని చెప్పుకునే దుండగుడు కేవలం నిరసన తెలియజేయడం కాదు. కావాలని న్యాయ వ్యవస్థను అవమానించడమే అవుతుంది.

ప్రధాన న్యాయమూర్తి నేరంపై విచారణ జరపకుండా క్షమించడం, ఆ తీవ్ర నేరాన్ని అలక్ష్యం చేయడం ఎంత మాత్రం కాదు. సీజేఐ గవాయ్ క్షమించడం, నైతిక బలాన్ని మరో విధంగా చూడడం కాదు. కొన్ని ప్రజాస్వామ్యాల్లో ప్రజా నాయకులు లేదా అధికారంలో ఉన్నవారు చేసే విమర్శలు శిక్షలకు తగినవి. అయితే ఈ విధమైన విమర్శలు, అవమానాలు జరుగుతూనే ఉంటాయి. అత్యంత గౌరవం గల సంస్థల బలం పట్ల విశ్వసనీయత ఉన్నట్లయితే వ్యక్తుల పట్ల కక్ష తీర్చుకోవడం ఉండదు. దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిని సాధారణ మనిషిలాగా భావించి ఆయనపై దాడి చేయడం తీవ్ర నేరం. అలాగే సంస్థను అవమానించడం కాదు. న్యాయ వ్యవస్థ గౌరవాన్ని దిగజార్చడం ఒక సంప్రదాయంగా

మారవచ్చు. క్షమాగుణం, వ్యక్తిగత సద్గుణం గొప్ప విషయాలు. ప్రధాన న్యాయమూర్తిది సమష్టి బాధ్యత. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన ఒక వ్యక్తి దుష్ప్రవర్తన, దాని ద్వారా వెలువడే మానసిక స్థితి నేరస్థుడిది. రాకేశ్ కిశోర్ దుర్మార్గపు చర్యను తానే అంగీకరించాడు. మతపరమైన సమస్యపైన గొప్ప పర్వత శిఖర సమానుడైన ప్రధాన న్యాయమూర్తిపైన ఆగ్రహంతో కాలి బూటును కూడా విసిరివేసిన అల్పుడు రాకేశ్. నేడు దేశంలో మత భావన లక్ష్యాన్ని సాధించుకోవాలన్న వాతావరణం విస్తరించి ఉంది. లాయరు ప్రవర్తన అత్యంత ప్రమాదకమైంది. రాజ్యాంగ కార్యకలాపాల నిర్వహణకు వ్యతిరేకంగా తృణీకార భావన చెల్లుబాటు అవుతుందన్నది ఆయన విశ్వాసం. ఈ చర్య పౌర క్రమశిక్షణ పూర్తిగా నాశనమైంది, సంస్థలను గౌరవించక పోవడం సమాజంలో అల్లుకుపోయింది. దీన్ని నిరోధించకపోతే ఇతరులు కూడా ఇలాంటి నేర చర్యలకు సిద్ధపడతారు.

మనసును బాధించే తీవ్ర గందరగోళం తర్వాత కూడా ప్రధాన న్యాయమూర్తి ఎంతో సౌమ్యంగా కోర్టు కార్యకలాపాలను కొనసాగించటం ఎంతో గొప్ప విషయం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న వ్యక్తులు ప్రజా జీవనంలో చాలా అరుదుగా కనిపిస్తారు. వ్యక్తులు వలే గాకుండా సంస్థలు భావోద్వేగాలను వ్యక్తం చేయడం సాధ్యంకాదు. అవి ఆగ్రహం కావచ్చు, లేదా ఆదరణ కావచ్చు. ఏదైనా ఇలాంటి కార్యకలాపాలతో మానసిక అలజడి లేకుండా పనిచేయటం గొప్ప విషయం. గొప్ప ఉదాత్తమైన వ్యక్తులపైన మాత్రమే ఇలాంటి కార్యకలాపాలు నిర్వహించటం అంత సులువు కాదు. న్యాయ పరమైన అంశాలను నిష్పాక్షికంగా నిర్వహించటం ఎంతో కరుణ గలవారు మాత్రమే చేయగలరు. పవిత్రమైన న్యాయస్థానం పరిధిలో లాయరు నేర చర్యకు పూనుకున్నప్పటికీ ప్రధాన న్యాయమూర్తి క్షమించడం వ్యక్తిగతంగా, సంస్థాపరంగా ఎంతో గౌరవాన్ని నిలిపింది. ఇండియాలో ఇటీవల కాలంలో నిరసన తెలియజేయడం కోసం కల్లోలాన్ని సృష్టించే సంఘటనలు అనేకం కనిపిస్తున్నాయి. వ్యక్తులు లేదా గ్రూపులు తమ ఇష్టానుసారం హింసకు పాల్పడటం చాలా ఎక్కువగా ఉంది. విశ్వాసం, భావజాలం లేదా రాజకీయ బాధలకు గురి చేయటం అత్యధికంగా ఉంది. దేశమంతటా రాజకీయ, భావజాల విభజనలు వ్యక్తులను, సంస్థలను తమ పరిధిలోకి తెచ్చుకుని అవసరమైన కార్యకలాపాలను నెరవేర్చుకోవటం ప్రజాస్వామ్య విరుద్ధమైంది. ఇలాంటి నేర చర్యను పరిగణలోకి తీసుకుని అందుకు పాల్పడిన వారిని శిక్షించకుండా వదిలివేస్తే అది ఇతరులకు మార్గదర్శం కావచ్చు. సర్వ సాధారణమైన కనీస శిక్ష లేకుండా క్షమిస్తే ఇతరులు సైతం ఇలాంటి దారులు తొక్కేందుకు వెనుకాడరు. 71 ఏళ్ల వయసు గల కిశోర్ పెద్దతనం గాని, లేదా స్థిమితం లేకపోవటం గాని ఈ పరిస్థితిని కలిగించిందని కొందరు వ్యాఖ్యానించవచ్చు. పెద్దవారిని నేరస్థుడిగా పరిగణించి శిక్షించటం సరైంది కాదని ప్రధాన న్యాయమూర్తి భావించి ఉండవచ్చు. చివరికి కాలి బూటు ప్రధాన న్యాయమూర్తి పైన విసిరిన అంశం అంతగా చర్చ లేకుండా పోయింది.

ఎన్నికల బరిలో గోరక్షకులు

స్వామి అవిముక్తేశ్వరానంద

పట్నా: బీహార్ ఎన్నికల్లో మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గోరక్షకులు లేదా గో సంరక్షకులను నిలబెడతానని శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి సోమవారం ప్రకటించారు. ఉత్తరాఖండ్‌లో జ్యోతిర్ మఠం శంకరాచార్య అయిన సరస్వతి... సెప్టెంబరు 13న ప్రారంభించిన తన 'గో మాత సంకల్ప యాత్ర' ముగిసిన తర్వాత ఈ ప్రకటన చేశారు. 'యాత్రలో భాగంగా బీహార్‌లో పరిస్థితులను నిశితంగా పరిశీలించాను. నేను ఊహించిన దానికంటే సంస్కృతి మరింత పాతుకుపోయి ఉంది. 38 జిల్లాల్లో నా పర్యటన సందర్భంగా ప్రజలకు 'గో సంరక్షణ' కు మద్దతు ఇచ్చారు' అని తెలిపారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ సమస్యను విస్మరించడం వల్లే తాను అటువంటి అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపవలసి పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తన అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేయడం ప్రారంభించారని, ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత వారి పేర్లు వెల్లడిస్తానని సరస్వతి వివరించారు. అయితే కొన్ని సీట్లలో వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తారని అన్నారు. అలాగే అఖిల భారతీయ జన సంఘ్, రాష్ట్రీయ సనాతని పార్టీ, రాష్ట్రీయ స్వాభిమాన్ పార్టీ, సర్వోదయ పార్టీ, రైట్ టు రికాల్ పార్టీ, తదితర పార్టీల అభ్యర్థులకు తాను మద్దతు తెలియజేస్తానని ఆయన చెప్పారు.

ఎన్డీఏ మిత్రుల్లో అంతర్మథనం

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల కేటాయింపుపై అసంతృప్తి

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అధికార ఎన్డీఏ కూటమిలో సీట్ల కేటాయింపు ఖరారైన నేపథ్యంలో కూటమిలోని చిన్న పార్టీలు అసంతృప్తితో రగిలిపోతున్నాయి. కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందూస్తానీ అవామ్ మోర్చా, రాజ్యసభ సభ్యుడు ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా సీట్ల పంపకాల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశాయి. అయితే ఆయా పార్టీల అధినేతలు ఇప్పటికిప్పుడు తీవ్రస్థాయిలో కోపతాపాలు ప్రదర్శించనప్పటికీ సీట్ల పంపిణీ వ్యవహారం వారిని అంతర్మథనానికి గురయ్యేలా చేసింది. 243 మంది సభ్యుల అసెంబ్లీ ఎన్నికలకు సీట్ల కేటాయింపుపై ఎన్డీఏ ఆదివారం ప్రకటన చేసింది. ప్రధాన పక్షాలైన జేడీయూ, బీజేపీలే చెరో 101 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని నిర్ణయించుకుని... మిగిలిన వాటిని చిన్న మిత్రపక్షాలకు వదిలివేశాయి. ఇందులో సింహభాగం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) దక్కించుకుంది. ఆ పార్టీ 29 స్థానాల్లో పోటీ చేయనుంది. అయితే సీట్ల పంపకాల మాంఝీ మీడియాతో మాట్లాడుతూ... "హైకమాండ్ నిర్ణయించిన దానిని మేము అంగీకరించాము. కానీ మాకు కేవలం ఆరు సీట్లు ఇవ్వడం ద్వారా, వారు మమ్మల్ని తక్కువ అంచనా వేశారు. ఇది ఎన్నికల్లో ఎన్డీఏకి నష్టం కలిగించవచ్చు" అన్నారు. అదేవిధంగా కుష్వాహ ఆదివారం రాత్రి సామాజిక మాధ్యమంలో తన పార్టీ కార్యకర్తల గురించి ఏం రాసుకొచ్చారంటే... "ప్రియమైన మిత్రులారా/సహచరులారా, నేను మీ క్షమాపణ కోరుతున్నాను. మనకు వచ్చిన సీట్ల సంఖ్య మీ అంచనాలకు అనుగుణంగా లేదు. ఈ నిర్ణయం మన పార్టీ అభ్యర్థులుగా ఉండాలని ఆశించిన సహచరులను బాధపెడుతుందని నేను అర్థం చేసుకున్నాను" అన్నారు. 'ఈరోజు... చాలా ఇళ్లల్లో ఆహారం వండకపోవచ్చు. అయితే మీరందరూ మన పార్టీ పరిమితులను అర్థం చేసుకున్నారని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. శాంతించాలని నేను మిమ్మల్ని వినమ్రంగా అభ్యర్థిస్తున్నాను. ఆపై నిర్ణయం ఎంత సముచితమో లేదా అనుచితమో మీరే గ్రహిస్తారు. మిగిలినది కాలమే చెబుతుంది" అని ఆయన అన్నారు. తన పార్టీకి గుర్తింపు రావాలంటే ఎనిమిది సీట్లు గెలవాలన్న కారణంగా కనీసం 15 సీట్లు కావాలని మాంఝీ పట్టుబట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో సీట్ల కేటాయింపును ప్రకటించబడటానికి ముందే ఆయన అలిగి పట్నాకు వెళ్లిపోయాడు. కానీ కూటమిపై తిరుగుబాటుకు దిగలేకపోయారు. ఇక ఎన్డీఏలో ప్రధాన పార్టీలైన జేడీయూ, బీజేపీ సమాన సంఖ్యలో సీట్లు పంచుకోవడం ఇదే మొదటి సారి.

జేడీయూను బీజేపీ కబళించడం ఖాయం: కాంగ్రెస్

పట్నాలో రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాజేష్ రాథోర్ ఎన్డీఏపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'బీజేపీ నితీశ్‌కుమార్ సైజును తగ్గించిందన దాన్ని సీట్ల పొత్తు స్పష్టం చేస్తోంది' అన్నారు. రెండు పార్టీలు మిత్రపక్షాలుగా ఉన్నప్పటి నుండి అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ బీజేపీ కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేయకపోవడం ఇదే మొదటిసారి. రాబోయే రోజుల్లో బీజేపీ... జేడీయూను కబళిస్తుందనడానికి ఇది స్పష్టమైన సంకేతం' అని ఆయన అన్నారు.

65 మంది అభ్యర్థులతో 'జన్ సురాజ్' రెండో జాబితా

పట్నా: రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు గాను ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ సోమవారం 65 మంది అభ్యర్థులతో రెండవ జాబితా విడుదల చేసింది. అయితే రఘోపూర్ స్థానం నుంచి ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ పై ఎన్నికల్లో పోటీ చేయనున్న ప్రశాంత్ కిశోర్ పేరు ఈ జాబితాలో లేదు. కాగా మూడు దశాబ్దాలుగా నితీశ్ కుమార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ, చాలా కాలంగా ఆయనకు బలమైన కోటగా భావిస్తున్న హర్నాట్ స్థానం నుంచి కమలేశ్ పాశ్వాన్‌ను పార్టీ నిలబెట్టింది. కొత్త జాబితాలో 20 రిజర్వుడ్ (షెడ్యూల్డ్ కులాలు-19, షెడ్యూల్డ్ తెగలు-1), 46 జనరల్ స్థానాల అభ్యర్థులు ఉన్నారు. ఈ జాబితాలో అత్యంత వెనుకబడిన తరగతి (10 మంది హిందూ, 4 ముస్లిం) నుంచి 14 మంది అభ్యర్థులు, ఇతర వెనుకబడిన తరగతుల నుండి 10 మంది, రిజర్వుడ్ వర్గాల నుండి 11 మంది, మైనారిటీ వర్గాల నుండి 14 మంది అభ్యర్థులు ఉన్నారని పార్టీ ప్రకటించింది. విస్తృత భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి హర్నాట్ వర్ధమాన్ అసెంబ్లీ స్థానం నుండి ఒక ఎస్సీ అభ్యర్థిని కూడా పోటీలో నిలిపారు ఇది జనరల్ కేటగిరీ నియోజకవర్గం. అభ్యర్థుల జాబితా విడుదల సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ... రెండో జాబితాతో పార్టీ మొత్తం 116 సీట్లకు అభ్యర్థులను ప్రకటించినట్లు తెలిపారు. "మొదటి జాబితాలో 51 సీట్లకు అభ్యర్థులను ప్రకటించగా, రెండవ జాబితాలో 65 సీట్లకు అభ్యర్థులను ప్రకటించాం. మిగిలిన సీట్లకు అభ్యర్థులను తరువాత ప్రకటిస్తాం" అని తెలిపారు. ఇప్పటివరకు ప్రకటించిన అభ్యర్థులలో 31 మంది అత్యంత బలహీన వర్గాలకు చెందినవారని, 21 మంది ఇతర వెనుకబడిన తరగతులకు చెందినవారని, 21 మంది ముస్లింలు ఉన్నారని వివరించారు. ఈనెల 9న ప్రశాంత్ కిశోర్ పార్టీ 51 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేసిన సంగతి విదితమే.

భూటాన్ వల్లే బెంగాల్‌లో వరదలు

పరిహారం చెల్లించాలి: మమత

కోల్‌కతా: భూటాన్ నుంచి వెల్లువెత్తిన జలప్రవాహం కారణంగానే వరదలు సంభవించాయని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో భారీ వరదలు ఇటీవల బీభత్సం సృష్టించాయి. వరద ప్రాంతాల్లో మమత సోమవారం సందర్శించారు. జల్పాయిగురి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక, పునరావాస చర్యలను మమత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూటాన్ నుంచి అధిక నీటి ప్రవాహం కారణంగానే రాష్ట్రంలో వరదలు సంభవించాయన్నారు. జరిగిన నష్టానికి భూటాన్ పరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. 'భూటాన్ నుంచి ముంచుకొచ్చిన నదీ జలాల కారణంగానే మాకు నష్టం జరిగింది. ఆ దేశం పరిహారం చెల్లించాలి' అని మమత డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే అన్ని సహాయక, పునరావాస చర్యలు చేపడుతోందన్నారు. కేంద్రం తరఫున ఎటువంటి ఆర్థిక సాయం అందలేదని ఆరోపించారు. భారత్-భూటాన్ ఉమ్మడి నదీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అందులో పశ్చిమ బెంగాల్‌ను భాగం చేయాలని తమ ప్రభుత్వం చాలాకాలంగా డిమాండ్ చేస్తోందన్నారు. తమ ఒత్తిడితో ఈ నెల 16న కేంద్రం ఓ సమావేశం ఏర్పాటు చేసిందని, దీనికి రాష్ట్ర అధికారులు హాజరవుతారని వెల్లడించారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, జల్పాయిగురి తదితర ప్రాంతాల్లో వర్షాలు బీభత్సం సృష్టించాయి. భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో 32 మంది మృతి చెందారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నేపాల్, భూటాన్‌లోనూ ఎడతెరిపిలేని వర్షాలతో నష్టం వాటిల్లింది. ఈ వరదలు, వాటి వల్ల జరిగిన విధ్వంసానికి మానవ తప్పిదమే కారణమని మమత ఇటీవల ఆరోపించారు.

ఆరో షెడ్యూల్‌లో లద్దాఖ్

జైరాం రమేష్



న్యూఢిల్లీ: లద్దాఖ్‌ని రాజ్యాంగంలో ఆరో షెడ్యూల్ కింద చేర్చాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగోలియా అధ్యక్షుడు ఖురేల్సుక్ ఉఖ్నా భారత్ పర్యటన నేపథ్యంలోనే లద్దాఖ్‌ని ఆరో షెడ్యూల్ కింద చేర్చాలని ఆయన అన్నారు. రెండు దేశాల మధ్య కీలకపాత్ర పోషించిన మంగోలియాకు 19వ భారత రాయబారిగా వ్యవహరించిన బౌద్ధలామా అయిన కుషోక్ బకుల రిన్‌పోచ్ కృషిని గుర్తు చేసుకోవడం అవసరమని జైరాం రమేష్ నొక్కి చెప్పారు. 2020లో జరిగిన స్థానిక ఎన్నికల సమయంలో లద్దాఖ్‌కి ఆరవ షెడ్యూల్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని ఇప్పుడు బీజేపీ నిరాకరిస్తుందని ఆయన విమర్శించారు. ఈమేరకు ఆయన సోమవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, మంగోలియా అధ్యక్షుడు సోమారం ఢిల్లీ చేరుకున్నారు. 1989లో మంగోలియాకు 19వ భారత రాయబారిగా రిన్‌పోచ్ నియామకం రెండు దేశాల మధ్య కీలక మలుపు అయింది.

మోదీని కలిసిన కెనడా విదేశాంగ మంత్రి

న్యూఢిల్లీ: కెనడా విదేశాంగ వ్యవహారాల శాఖ మంత్రి అనితా ఆనంద్ సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిశారు. భారతదేశం-కెనడా ద్వైపాక్షిక భాగస్వామ్యానికి కొత్త ఊపునిచ్చేందుకు కొనసాగుతున్న ప్రయత్నాలకు ఆమె పర్యటన దోహదపడుతుందని ప్రధాన మంత్రి తెలియజేశారు. ఈ ఏడాది జూన్‌లో జి7 శిఖరాగ్ర సమావేశం కోసం కెనడాకు చేసిన పర్యటనను ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మార్క్ కార్నీతో ఆయన అత్యంత ఉత్పాదక సమావేశం నిర్వహించారు. వాణిజ్యం, ఇంధనం, సాంకేతికత, వ్యవసాయం, ప్రజల మధ్య సంబంధాలలో రెండు దేశాల మధ్య మెరుగైన సహకారం ప్రాముఖ్యతను ప్రధాన మంత్రి గుర్తించారు. ప్రధాన మంత్రి మార్క్ కార్నీకి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

మా కూటమిలోకి ఎంఎన్ఎస్: రౌత్

ముంబై: రాజ్ థాకరే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)లో భాగం కావచ్చని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ సోమవారం సూచనప్రాయంగా తెలిపారు. ఎంఎన్ఎస్ కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలని కోరుకుంటోందన్నారు. ఎంఎన్ఎస్ అధినేత పెద్ద ప్రతిపక్ష కూటమిలో భాగం అవుతారా లేదా అనేది ఇంకా అస్పష్టంగా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు దాయాదులు రాజ్ థాకరే, సేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే చేతులు కలుపుతున్నారనే ప్రచారం మధ్య రౌత్ వ్యాఖ్యలు వచ్చాయి. రాజ్ థాకరే మహా వికాస్ అఘాడిలో భాగం కావడానికి సిద్ధంగా ఉన్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సంజయ్ రౌత్ సమాధానమిస్తూ, 'రాజ్‌థాకరే కూడా ఎంవీఏలో ఒక భాగమైన కాంగ్రెస్‌ను కూడా తమతో తీసుకువెళ్లాలని కోరుకుంటున్నారు. ఇది ఆయన వైఖరి' అని తెలిపారు. 'కానీ దీని అర్థం దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని కాదు' అని రాజ్యసభ సభ్యుడు నొక్కి చెప్పారు. 'కొన్ని అంశాలపై' తాను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌తో మాట్లాడానని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో కూడా మాట్లాడుతానని రౌత్ అన్నారు. ఉద్ధవ్ థాకరే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కూడా మాట్లాడతారని రౌత్ చెప్పారు.

కాంగ్రెస్ గూటికి మాజీ ఐఏఎస్

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ ప్రజలకు 'భావ ప్రకటనా స్వేచ్ఛను నిరాకరించినందుకు' 2019లో తన సేవల నుంచి వైదొలిగిన మాజీ ఐఏఎస్ అధికారి కన్నన్ గోపీనాథన్ సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశాన్ని సరైన దిశలో తీసుకెళ్లగలదని తాను గ్రహించానని అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగ అధిపతి పవన్ ఖేరా, పార్టీ నాయకులు కన్హయ్య కుమార్, జిగ్నేశ్ మేవానీ, రాజకీయ పార్టీ నాయకుడిగా మారిన ఐఏఎస్ అధికారి శశికాంత్ సెంథిల్ సమక్షంలో గోపీనాథన్ పార్టీలో చేరారు. 'దేశంలోని అణగారిన వర్గాల ప్రజల పట్ల మక్కువ కలిగి ఉన్న, ఎల్లప్పుడూ న్యాయం, ఐక్యత కోసం పోరాడే ధైర్యవంతులైన అధికారులలో గోపీనాథ్ ఒకరు. ఆయన కేరళలో జన్మించారు. ఈశాన్య, దేశంలోని ఇతర ప్రాంతాలలో పని చేశారు' అని వేణుగోపాల్ తెలిపారు. గోపీనాథన్ కాంగ్రెస్ పార్టీలో చేరడం అనేది ఒక సిద్ధాంతంతో న్యాయం కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ అని స్పష్టమైన సందేశం అని ఆయన అన్నారు.

చొరబాట్ల కట్టడికి పటిష్ట చర్యలు

సరిహద్దుల్లో కీలక మార్గాల మూసివేత

కశ్మీర్: ఉగ్ర చొరబాట్ల కట్టడికి భారత సైన్యం కీలక చర్యలకు సిద్ధమైంది. శీతాకాలం రాబోతున్నందున పాకిస్థాన్ సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ వెంబడి భద్రతను మరింత పెంచుతోంది. ఇందులో భాగంగా కీలక మార్గాలు మూసివేసింది. అదనపు బలగాలను మోహరించినట్లు తెలుస్తోంది. పహల్గాం దాడిని దృష్టిలో పెట్టుకొని సరిహద్దుల్లో భద్రతను పునరుద్ధరిస్తోంది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా ఈ కథనం వెల్లడించింది. సాధారణంగా కశ్మీర్ లోయలో శీతాకాల సమయంలో మంచు దట్టంగా కురుస్తుంది. ఆ సమయంలో కొన్ని కీలక మార్గాల్లో భద్రత పర్యవేక్షణ కష్టంగా మారుతుంది. ఎత్తైన ప్రాంతాల్లో నిఘాకు సవాళ్లు ఎదురవుతాయి. దీన్ని అవకాశంగా తీసుకొని చలికాలానికి ముందు ఉగ్ర చొరబాట్ల ఘటనలు పెరుగుతాయి. వీటిని నియంత్రించేందుకే సరిహద్దుల్లో సైన్యం భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. నియంత్రణ రేఖ వెంబడి కంచెను మరింత పటిష్టం చేయడంతో పాటు ఈ ప్రాంతంలో అదనపు దళాలను మోహరిస్తోంది. ఇక సరిహద్దులను ఆనుకొని ఉండే కొన్ని కీలక మార్గాలను మూసివేస్తున్నట్లు తెలుస్తోంది. థర్మల్ ఇమేజర్లు, అధునాతన కెమెరాలు, చిన్న చిన్న డ్రోన్లతో చొరబాటు యత్నాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. గతంలో ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి రద్దీ ప్రాంతాలకు దూరంగా ఒక రహస్య ప్రాంతంలో దాగిన సందర్భాలున్నాయి. కానీ, ఇటీవల ఉగ్రవాదులు తమ పంథా మారుస్తున్నారు. రద్దీ ప్రదేశాలకు దగ్గరగా రెండు, మూడు రహస్య ప్రాంతాల్లో నక్కి తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

కోల్డ్‌రిఫ్‌తో మరణాలు...

కంపెనీ మూసివేత

చెన్నై: మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మా అనుమతులు రద్దు చేసినట్లు తమిళనాడు ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. కంపెనీ మూసివేతకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపింది. రాష్ట్రంలోని ఇతర ఔషధ తయారీ సంస్థల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు పేర్కొంది. ఈ దగ్గు మందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా కంపెనీ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా... సిరప్‌లో 48.6 శాతం అత్యంత విషపూరితమైన డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలినట్లు అధికారులు వెల్లడించారు. సరైన తయారీ పద్ధతులు అవలంబించడం లేదని, 300కు పైగా ఉల్లంఘనలను రికార్డు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పటికే కంపెనీ యజమాని జి.రంగనాథన్‌ను అరెస్టు చేసింది. కాగా, ఫార్మా సంస్థకు చెందిన పలు ప్రాంగణాల్లో ఈడీ ఉదయం తనిఖీలు నిర్వహించింది. ఈడీ అధికారులు శ్రేసన్ ఫార్మాతో సంబంధమున్న చెన్నైలో ఏడు ప్రదేశాలలో సోదాలు చేపట్టారు. ఆ సమయంలో తమిళనాడు డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారుల నివాసాల్లోనూ దాడులు చేసినట్లు సమాచారం.

సీఎం యోగి చొరబాటుదారుడు: అఖిలేశ్

లక్నో: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ చొరబాటుదారుడని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఉత్తరాఖండ్ నుంచి వచ్చిన ఆయనను అక్కడకు పంపాలని అన్నారు. రామ్ మనోహర్ లోహియా వర్ధంతి సందర్భంగా లక్నోలోని లోహియా పార్క్‌ను సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో అఖిలేశ్ మాట్లాడుతూ... కొన్ని రాజకీయ పార్టీలు చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్నాయన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు ఆయన ఎదురుదాడికి దిగారు. వలసదారులకు సంబంధించి బీజేపీ వద్ద నకిలీ గణాంకాలున్నాయని అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. 'కొందరు వ్యక్తులు వలసల గణాంకాలు ఇస్తున్నారు. మనకు కూడా యూపీలో చొరబాటుదారులు ఉన్నారు. ముఖ్యమంత్రి (ఆదిత్యనాథ్) ఉత్తరాఖండ్‌కు చెందినవారు. మేం ఆయనను ఉత్తరాఖండ్‌కు పంపాలనుకుంటున్నాం. బీజేపీలో చొరబాటుదారులు ఉన్నారా లేదా చెప్పండి' అని అన్నారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ బీజేపీ సభ్యుడు కాదని ఆరోపించారు.

అత్యాచారం కేసులో మరో ఇద్దరి అరెస్టు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో 23 ఏళ్ల వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో సోమవారం మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. దీంతో అరెస్టుల సంఖ్య ఐదుకు చేరుకుందని పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా... రిమాండ్ విధించినట్లు చెప్పారు. అసన్‌సోల్-దుర్గాపూర్ పోలీస్ కమిషనరేట్ డిప్యూటీ పోలీసు కమిషనర్ అభిషేక్ గుప్తా పీటీఐతో మాట్లాడుతూ 'మరో ఇద్దరిని అరెస్టు చేశాము. దీంతో బాధితురాలు దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నాం' అని వివరించారు. ఇంతకుముందు అరెస్టు చేసిన ముగ్గురు నిందితులను దుర్గాపూర్ సబ్-డివిజనల్ కోర్టులో నిన్న హాజరుపరిచారు. వారిని 10 రోజుల పోలీసు కస్టడీకి మేజిస్ట్రేట్ ఆమోదించారు. ఇదిలాఉండగా, నేరంలో పాల్గొన్న లేదా నేరం గురించి తెలిసిన ఇతరుల కోసం గాలింపు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. హోం శాఖ కూడా నిర్వహిస్తున్న సీఎం మమతా బెనర్జీ... అఘాయిత్యానికి ఒడిగట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 'నిందితులలో ఎవరినీ వదిలిపెట్టబోము' అని ఆమె చెప్పారు. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో భద్రతా ఏర్పాట్లను కూడా బెనర్జీ ప్రశ్నించారు. ఒడిశా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సోవన మొహంతి సోమవారం పశ్చిమ బెంగాల్‌కు వైద్య విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులను కలవడానికి, స్థానిక పోలీసులతో చర్చలు జరపడానికి వెళ్లారు. మరోవైపు, బాధితురాలిని కలిసేందుకు ఒక మహిళా సభ్యురాలు, ఒక పోలీసు అధికారి, ఒక జిల్లా అధికారితో కూడిన ఒడిశా ప్రభుత్వ ప్రతినిధి బృందం ఆదివారం దుర్గాపూర్‌కు వెళ్లింది. అయితే వారిని ఆసుపత్రిలోకి అనుమతించ లేదని ఆ ప్రతినిధి బృందం ఆరోపించింది. బృందం చాలాసేపు బయట వేచి ఉండాల్సి వచ్చి చివరికి బాధితురాలిని కలవకుండానే తిరిగి వచ్చిందని సమాచారం. ప్రస్తుతం వైద్య విద్యార్థిని చికిత్స పొందుతోందని, పరిశీలనలో ఉందని పోలీసులు తెలిపారు.

ఎయిమ్స్ సర్జన్ సస్పెన్షన్

న్యూఢిల్లీ: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కార్డియో థోరాసిక్ అండ్ వాస్కులర్ సర్జరీ శాఖ అధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ ఏకే బిసోయిని సస్పెండ్ చేశారు. తనను వేధిస్తున్నట్లు ఓ మహిళా నర్సింగ్ ఆఫీసర్, ఎయిమ్స్‌కు చెందిన నర్సుల సంఘం ... పీఎంఓకు పదేపదే ఫిర్యాదులు చేయడంతో ఈ చర్యకు పాల్పడ్డారు. లైంగికంగా వేధిస్తున్నాడని, నీచమైన భాష వాడుతున్నాడని, పని ప్రదేశంలో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు కార్డియో అధిపతిపై నర్సులు ఫిర్యాదు చేశారు. బిసోయిని సస్పెండ్ చేయడంతో ఆ బాధ్యతలను సీటీవీఎస్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వి. దేవగౌరవ్‌కు అప్పగించారు. ఈ మేరకు ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబరు 30వ తేదీన ఫిర్యాదు అందినట్లు ఆయన తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీన నర్సుల యూనియన్ పీఎంఓకు ఫిర్యాదు చేసింది. పని ప్రదేశంలో వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. తనపై ఫిర్యాదు చేసేవాళ్లను బెదిరించేలా ఆ డాక్టర్ వ్యవహరించినట్లు నర్సులు వెల్లడించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతున్నది. గతంలో కూడా డాక్టర్ బిసోయిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. 2009లో కేంద్ర ఆరోగ్యశాఖ ఆయన్ను సస్పెండ్ చేసింది. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2019లో కూడా వేధింపు ఫిర్యాదులు ఉన్నాయి.

ఆదాయం తగ్గింది... సినిమాలే చేసుకుంటా

కేంద్ర మంత్రి సురేశ్ గోపీ

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి పదవి నుంచి దిగిపోవాలనే ఆలోచనలో ఉన్నట్లు సురేశ్ గోపీ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో తన ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని... అందుకే మంత్రిగా దిగిపోయి మళ్లీ సినిమాల్లో నటించాలని ఉందని చెప్పారు. మలయాళంతో పాటు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సుమారు 200కిపైగా చిత్రాల్లో నటించిన సురేశ్ గోపీ 2016లో బీజేపీలో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుతం పెట్రోలియం శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తన సినీ జీవితాన్ని తిరిగి కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలిపారు. 'సినీ కెరీర్‌ను వదిలిపెట్టి మంత్రి కావాలని నేను ఎన్నడూ కోరుకోలేదు. ఇటీవల కాలంలో నా ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. మంత్రి పదవికి రాజీనామా చేయాలని భావిస్తున్నా. మళ్లీ సినిమాల్లో నటించాలని అనుకుంటున్నా' అని తెలిపారు. మరోవైపు తన స్థానంలో కేరళకు చెందిన రాజ్యసభ సభ్యుడు సీ సదానందన్ మాస్టర్‌కు కేంద్ర మంత్రిగా అవకాశం కల్పించాలని బీజేపీ అధిష్టాన్ని కోరారు.

ఆర్ఎస్ఎస్ నిషేధంపై సిద్ధరామయ్య కసరత్తు

బాగల్‌కోట్: ప్రభుత్వ ప్రాంగణాల్లో ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలపై నిషేధం విధించడంపై తమిళనాడు తీసుకున్న చర్యలను పరిశీలించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించినట్లు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం తెలిపారు. ప్రభుత్వ సంస్థలు, ప్రజా ప్రాంగణాల్లో ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను రాష్ట్రవ్యాప్తంగా నిషేధించాలని తన కేబినెట్ సహచరుడు, ఐటీ, పంచాయతీ రాజ్ మంత్రి ప్రియాంక్ ఖర్గే రాసిన లేఖ తర్వాత ఈ ఆదేశాలు వచ్చాయి. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలు భారతదేశ ఐక్యత, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా సిద్ధరామయ్య మాట్లాడుతూ 'ప్రియాంక్ ఖర్గే లేఖ రాశారు. ప్రభుత్వ ప్రాంగణాలను ఆర్ఎస్ఎస్ ఉపయోగిస్తోందని, దానిని ఆపడానికి తమిళనాడు ప్రభుత్వం అనుసరించిన విధానాలు అమలు చేయాలని సూచించారు. తమిళనాడులో ఏమి జరిగిందో పరిశీలించాలని నేను ప్రధాన కార్యదర్శిని కోరాను' అని తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వి కర్ణన్, అదనపు కమిషనర్ (ఎన్నికల విభాగం) హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కమిషనర్ (రెవెన్యూ, ఐటి) అనురాగ్ జయంతిలతో కలిసి ఆన్‌లైన్ ద్వారా పిఓ, ఎపిఓ, ఓపిఓల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు.

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు నిరసనగా

15న రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో పై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ సమావేశం తీవ్రంగా ఖండిస్తూ అక్టోబర్ 15న జిల్లా మండల కేంద్రాలలో రాస్తారోకోలు నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని మగ్దూం భవన్‌లో జరిగిన సమావేశ నిర్ణయాలను రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనంజయ నాయుడు సోమవారం పత్రికలకు విడుదల చేశారు. తరతరాలుగా అణిచివేతకు వివక్షతకు గురవుతున్న బీసీల ఎడల పాలక పార్టీలు అవలంబిస్తున్న విధానాలను సమావేశం తీవ్రంగా నిరసించిందన్నారు. బిసిలు చైతన్యంతో సంఘటితమై చేసిన పోరాటాల ఫలితంగా స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ జీవో వస్తే అగ్రకులాలకు చెందిన బీసీ ద్రోహులు హైకోర్టులో పిటిషన్ వేయడం దుర్మార్గమని ఇప్పటికైనా బీసీ ద్రోహులు తమ వైఖరి మార్చుకొని పిటిషన్ వెనక్కి తీసుకోవాలని లేనిచో బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని సమావేశం హెచ్చరించిందన్నారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ పై హైకోర్టు స్టేఎత్తివేయాలని, కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లులను 9వ షెడ్యూల్లో చేర్చాలని అక్టోబర్ 15 జిల్లా మండల కేంద్రాలలో నిరసనలు రాస్తారోఖోలు నిర్వహించాలని గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కలిసి వచ్చే సంఘాలన్నిటితో కలిసి ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందని వెంకట్రాములు, ధనుంజయ నాయుడు తెలియజేశారు.

18న బీసీల రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా హైకోర్టు ఇచ్చిన స్టే ను నిరసిస్తూ ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ బిసి జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్ కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ వి.జీ.ఆర్.నారగోని, కో చైర్మన్ రాజారాం యాదవ్, జేఏసీ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణలు పిలుపునిచ్చారు. హైదరాబాద్ గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బంద్‌తో బిసిల సెగ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా బిసిలు కదిలిరావలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ యాజమాన్యంతో పాటు, విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. బంద్‌కు మద్దతుగా అన్ని రాజకీయ పార్టీ నాయకులను కలుస్తామని, మద్దతు ఇవ్వని పార్టీలకు బిసిల ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బిసిలు కమిటీలు వేసుకొని బంద్‌ను విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమం తరహాలో బిసి ఉద్యమం జరుగనుందని నాయకులు స్పష్టం చేశారు. అన్ని కుల సంఘాలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, గుజ్జ సత్యం, కుందారపు గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, ఎం. భాగ్యలక్ష్మి, జిల్లాపల్లి అంజి, రాజ్ కుమార్, వేముల రామకృష్ణ, అనంతయ్య, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సిపిఆర్‌పై అవగాహన

విశాలాంధ్ర - హైదరాబాద్ : మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యం శాఖ ఆధ్వర్యంలో "పునర్జన్మ"పేరుతో సిపిఆర్ పైన అవగాహన సదస్సు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఉమా గౌరి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి, పత్రికా ప్రతినిధులకు, ప్రజావాణికి హాజరైన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ కలెక్టర్స్ ఎంఎస్ఎస్ భరీర, ఎంఎస్ మోక్షిత హాజరై ఈ కార్యక్రమం యొక్క విశిష్టత గురించి, సిపిఆర్‌పై అవగాహన లేకపోవడం వల్ల జరిగే ప్రాణ నష్టం గురించి తెలియజేశారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని ఉమా గౌరీ మాట్లాడుతూ పునర్జన్మ వారోత్సవాల్లో భాగంగా వారం రోజులు అన్ని కళాశాలలో, బస్టాండ్, రైల్వే స్టేషన్ వంటి స్థలాలలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంపై ప్రత్యక్షంగా నమూనాల ద్వారా శిక్షణ పొందిన డాక్టర్లు శ్రవణ్, వినోద్, శోభన చేత అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ అధికారులు మల్లీశ్వరి డా. గీతా, శ్రీదేవి, సత్యవతి, చంద్రకళ, వినోద్, వసంత కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు బ్రాక్ సంస్థ సహకారం అందించాలి

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంతర్జాతీయ సంస్థ బ్రాక్ తెలంగాణలో అమలు చేస్తున్న తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమం (టిజిఐఎల్పీ) పేదరికంపై తుది పోరాటంగా మారాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. ఆ పోరాటంలో తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. పేదరికంపై తుది పోరులో విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్కను బ్రాక్ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ తెలంగాణలో టిజిఐఎల్పీ సాధించిన పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన దిశలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి బ్రాక్ సంస్థ తమ వంతు సహకారం అందించాలన్నారు. అత్యంత పేద కుటుంబాలను గుర్తించి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే టిజిఐఎల్పీ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక వనరులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా జీవనోపాధి కార్యక్రమాలను రూపకల్పన చేయాలని సూచిస్తూ, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో విరివిగా లభించే ఇప్ప పువ్వు ఆధారంగా నూనె, ఆహార పదార్థాలు తయారీకి సంబంధించిన కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చారు. "స్వచ్ఛమైన ఇప్పపువ్వు ఆరోగ్య పరిరక్షణకు ఎంతో మేలు చేస్తుంది. దానిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి ఆదాయ వనరుగా మలచవచ్చు" అని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఐదు జిల్లాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో టిజిఐఎల్పీ అమలవుతోందని, ఇప్పటి వరకు 3,554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించినట్లు బ్రాక్ ప్రతినిధులు మంత్రి సీతక్కకు నివేదించారు. ఎంపిక చేసిన మహిళా సమాఖ్యల ద్వారా 108 మంది నిపుణులను నియమించి లబ్ధిదారులకు శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. టిజిఐఎల్పీ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు దీర్ఘకాలిక ఆదాయ మార్గాలను కల్పించి, వారిని ఆర్థికంగా స్వావలంబన దిశగా నడిపించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మరిన్ని జిల్లాలు, మండలాలకు విస్తరించాలని, ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన, పీవీటీజీ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మంత్రి సీతక్క సూచనలను సానుకూలంగా స్పందించిన బ్రాక్ ప్రతినిధులు మరో 8 వేల కుటుంబాలకు నైపుణ్య శిక్షణతో పాటు వారి ఆదాయ మార్గాలను పెంచే విధంగా ఆర్థిక చేయూత అందిస్తామని పేర్కొన్నారు. అల్ట్రా పూర్ గ్రాడ్యుయేషన్ ఇనిషియేటివ్ ఎండి. గ్రెగరీ చెన్, ఇండియా లిడ్ శ్వేతా బెనర్జీ, ప్రోగ్రాం లిడ్ ఉషా రాణి, సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. రమేష్, ప్రోగ్రాం అసోసియేట్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో పేదరిక నిర్మూళన కోసం తమ వంతు సహకారం అందిస్తున్న బ్రాక్ ప్రతినిధులను మంత్రి సీతక్క సత్కరించి వారి ప్రయత్నాన్ని అభినందించారు.

ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ యం. మను చౌదరి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజల సమస్యలతో సమర్పించిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి, వాటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, డి.విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఎల్.బి. హరిప్రియలతో కలసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, దరఖాస్తులపై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు. ప్రజలకు ప్రజావాణి నిర్వహణపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. స్వీకరించిన అర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులపై అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్క రించి పెండింగ్ లేకుండా చూడాలని, అదేవిధంగా తిరస్కరించే ధరఖాస్తులకు గాను అర్జీదారులకు తగు కారణాలు తెలపాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణిలో 81 అర్జీలు వచ్చాయని, అందులో ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా, పౌరసరఫరాల శాఖ, ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగ పడే సిపిఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ జి. ముకుంద రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిపిఆర్ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, డిఆర్ఓ ఈ వెంకటాచారిలతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశాల మేరకు సిపిఆర్ పై జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ విభాగాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి సిపిఆర్ పై అవగాహన కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే కార్డియోపల్మనరీ రిససిటేషన్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉన్నట్లయితే అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తులు ప్రాణాలను ఎలా కాపాడగమో అనే విషయాన్ని గ్రహిస్తే, ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించుటకు వీలు కలుగుతుందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడానికి అవసరమైన నైపుణ్యాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. కిమ్స్ వైద్య నిపుణులు డాక్టర్ శేఖర్, మాట్లాడుతూ వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం మందగించినప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్స. గుండెపోటు, లేదా ఇతర అకస్మాత్తుగా సంభవించే సంఘటనల వంటి అత్యవసర పరిస్థితులలో సిపిఆర్ చేయడం చాలా ముఖ్యమని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, ప్రజలకు సిపిఆర్ పద్ధతులను నేర్పడంతో తద్వారా అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించగలరని అన్నారు. జిల్లాలో ఈ నెల 13 నుండి 17 వరకు కార్డియో పల్మనరీ రిససిటేషన్ పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ వెంకటి, సిపిఓ డాక్టర్ సురేందర్, డీ.ఎం.ఓ రాములు, బీసీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు ఆశన్న, కోటాజి, డీఎస్ఓ శ్రీరామ్, కలెక్టరేట్ ఇంచార్జ్ ఏవో విజయ లక్ష్మి, కలెక్టరేట్ సూపరిండెంట్లు, డిప్యూటీ డిఎంహెచ్ఓలు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా సత్యనారా యణ రెడ్డి, అధ్యక్షులుగా యం.యస్.మూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా వి.వేణు కుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.ఇందిరా శ్రీలక్ష్మి, ఉప ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసాచారి, ఎస్.శివానంద్, ఉపాధ్యక్షులుగా పి.నర్సయ్య, పి.స్వాతి, అమృత్‌రావు, కవిత, వెంకటరావు, కార్యదర్శులుగా యం.మధుసూదన్ రెడ్డి, పి.సరస్వతి, ఆర్.జగన్ మోహన్ రావు, పి.రామారావు, పి.కిషన్, కోశాధికారిగా కె. సుశీలను మరో 124 మంది కార్యవర్గ సభ్యులుగా రాష్ట్ర 5వ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డిభవన్‌లో సోమవారం జరిగిన ప్రతినిధుల సభలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జులై 2023 నుండి అమలు కావాల్సిన వేతన సవరణను 44 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, ఐదు విడతల కరువు భత్యం విడుదల చేయాలన్నారు. పూర్వపు పెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలని, 317 జి.ఓ. ద్వారా ఇప్పటికీ న్యాయం జరుగని ఉద్యోగులందరినీ తక్షణం ఆదుకోవాలని, వైద్య విధాన పరిషత్‌ను రద్దుపరిచి ఆ స్థానంలో సెకండరీ హెల్త్ సర్వీసెస్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా ఉద్యోగుల ట్రెజరీ ద్వారా వేతనాలు పొందేందుకు వీలు కల్గుతుందని, అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతులు కల్పించాలని, వైద్య ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందజేయాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరికీ బెనిఫిట్స్ తక్షణం చెల్లించాలన్నారు. ఇయస్ఐ రంగంలో ఉద్యోగులకు 126 జి.ఓ. సవరించి అమలు చేయాలని, ఇన్ సర్వీస్ ఉద్యోగులకు ల్యాబ్, ఎక్స్‌రే, ఇ.సి.జి, శిక్షణను పునఃప్రారంభించాలని, టివివిపిలో క్యాడర్ స్ట్రెంథ్ సవరించేందుకై ఏర్పాటైన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ నివేదికను సవరించాలన్న పలు తీర్మానాలను చేసింది. వైద్య రంగంలోని వివిధ సమస్యల పరిష్కారం కొరకై 07 నవంబరు 2025 రోజు "డిమాండ్స్ డే" గా పాటించి, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వైద్య సంస్థల ఎదుట "నిరసన ప్రదర్శనలు" జరపాలని మహాసభ నిర్ణయించింది.

మల్లారెడ్డి హాస్పిటల్లో ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్ : ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రత్యేక రోగుల అవగాహన, ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది ఆర్థరైటిస్ రోగులు, వైద్య నిపుణులు, వెల్‌నెస్ స్పెషలిస్టులు పాల్గొని అవగాహన, ప్రేరణ, ఆరోగ్యకర జీవన విధానం గురించి చర్చించారు. సరైన చికిత్స, వ్యాయామం, ఆహారపు అలవాట్లు, మానసిక ఉత్సాహం ద్వారా బాధలేని, సార్థకమైన జీవితం సాధ్యమని ఈ కార్యక్రమం ద్వారా హాస్పిటల్ తెలియజేసింది. ఈ సందర్భంగా హాస్పిటల్ రుమటాలజిస్టు డా.సౌమ్య మాట్లాడుతూ ఆర్థరైటిస్ కారణాలు, లక్షణాలు, నివారణ, తాజా చికిత్సా పద్ధతులపై, హాస్పిటల్ ఫిజియోథెరపీ బృందం రోగులు రోజూ సురక్షితంగా చేయగల సులభమైన వ్యాయామాలను ప్రదర్శించింది. ఇవి కీళ్ల కదలికను మెరుగు పరుస్తాయి, గట్టిదనాన్ని తగ్గిస్తాయని తెలిపారు. హాస్పిటల్ న్యూట్రిషనిస్ట్ సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో పాటించాల్సిన మార్గాలను వివరించారు. ఇవి కీళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, వాపు నియంత్రణలో సహాయపడతాయని వ్యక్తం చేశారు. ఆర్థరైటిస్ మీ కలల ముగింపు కాదని, సరైన చికిత్స, క్రమమైన వ్యాయామం, సానుకూల ఆలోచనతో రోగులు ఆరోగ్యవంతమైన, స్వతంత్ర, సంతోషకరమైన జీవితాన్ని గడపగలరు. వారి లక్ష్యం వారికి ఆ ధైర్యం, మార్గదర్శకత ఇవ్వడం అన్నారు.మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఈ కార్యక్రమం ద్వారా సమగ్ర ఆరోగ్య సంరక్షణ, సామాజిక బాధ్యత, రోగుల శ్రేయస్సుపై తన కట్టుబాటును మరొక్కసారి గుర్తు చేశారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం 2025 సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సమాజ ఆరోగ్యానికి, రోగుల మానసిక బలానికి అంకితభావంతో ముందుకు సాగింది. వైద్య నిపుణుల మార్గదర్శకత, విద్యా కార్యక్రమాలు, ప్రేరణాత్మక సందేశాల ద్వారా ప్రతి ఆర్థరైటిస్ రోగికి ధైర్యం, ఆశ, స్ఫూర్తి కలిగిస్తూ ఈ ఏడాది థీమ్ ఆత్మను ప్రతిబింబించింది.

కొండా లక్ష్మారెడ్డి మృతికి టీయూడబ్ల్యూజే, ఐజేయు సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్ : చేవెళ్ల మాజీ శాసనసభ్యులు, ఎన్ఎస్ఎస్ వార్తా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కొండా లక్ష్మారెడ్డి (84) మృతి పట్ల ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, జాతీయ మాజీ అధ్యక్షులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్ అలీ, కె.రాంనారాయణ, ఐజేయు కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి మనుమడైన లక్ష్మారెడ్డి గతంలో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ గ్రీవెన్స్ సెల్ అధికార ప్రతినిధిగా పలు హోదాల్లో పని చేశారని వారు తెలిపారు. 1999, 2014లో రెండు పర్యాయాలు లక్ష్మారెడ్డి హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ కూడా చేశారన్నారు. జర్నలిజం వృత్తి పట్ల గల ఆసక్తి, నిబద్ధత కారణంగా 1980లో ఆయన న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్ (ఎన్ఎస్ఎస్) అనే ఒక వార్తా సంస్థ ప్రారంభించారని వారు పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా, జర్నలిస్టుల సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జర్నలిస్టులకు లక్ష్మారెడ్డి సేవలందించారని వారు తెలిపారు. ఏపీయూడబ్ల్యూజేలో కొండా లక్ష్మారెడ్డితో కలిసి పని చేసిన సందర్భాలను, ఆయన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.25 లక్షల నగదు స్వాధీనం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఎన్నికల తనిఖీల్లో భాగంగా స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ (ఎస్ఎస్.టి) రూ.25,00,000 (ఇరవై ఐదు లక్షలు) నగదును స్వాధీనం చేసుకుంది. ఈ నగదు శ్రీ జైరాం తలాసియా అనే వ్యక్తి నుండి స్వాధీనం చేయబడింది. ఆయన విశాఖపట్నం జిల్లాలోని సీతమ్మధర ఎస్.ఈ లేఅవుట్, ఫ్లాట్ నెం.194 నివాసి. ఆయన టిఎస్09 ఎఫ్ఎఫ్ 6111 నంబర్ గల కారు ద్వారా యూసుఫ్‌గూడ వైపు ప్రయాణిస్తుండగా, మైత్రీవనం ఎక్స్ రోడ్ వద్ద సారథి స్టూడియో సమీపంలో ఎస్ఎస్.టి బృందం తనిఖీ చేయగా, రూ.25 లక్షల నగదు లభ్యమైంది. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా స్వాధీనం చేసిన నగదును మధురానగర్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : బిఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం సోమవారం రహమత్‌నగర్‌లోని ఎస్.పి.ఆర్. హిల్స్ గ్రౌండ్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, చామకూర మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్‌ను గెలుపించెందుకు ప్రతి కార్యకర్త కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకే ఓటు వేసి పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమం కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్, బద్దం పరుశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న, ఏకే మురుగేష్, అమీనుద్దీన్, చిన్న యాదవ్, డోలి రమేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే



విశాలాంధ్ర - బషీర్‌బాగ్: త్వరలో లక్ష మంది క్షత్రియ రాజ్ పుత్‌లతో భారీ భాహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ అన్నారు. హైదరాబాద్ అంబర్పేటలోని మహారాణ ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో రాజ్ పుత్ క్షత్రియ సమాజ్ దసరా సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షత్రియుల సమస్యల పరిష్కారం కోసం రాజధానిలో లక్ష మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. అంతేగాకుండా రాష్ట్ర ప్రభుత్వం క్షత్రియ సమాజం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. సమాజంలోని పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఆర్థిక అభివృద్ధికి అందరూ సంఘటిత సహకారం అందించాలని కోరారు. మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగుణంగా క్షత్రియ సమాజంలోని యువతి, యువకులు ఆయా రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం 10వ తరగతి, ఇంటర్, బీటెక్ తదితర విద్యలో రాణించిన ప్రతిభావంతుల విద్యార్థినీ, విద్యార్థులకు స్కాలర్షిప్‌లతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్షత్రియ రాజ్‌పుత్ సభా అధ్యక్షులు ఠాకూర్ జైవీర్ సింగ్, ఉపాధ్యక్షులు మహేందర్ ప్రతాప్ సింగ్, సెక్రటరీ ఠాకూర్ అరుణ్‌సింగ్, జనరల్ సెక్రటరీలీలు ఠాకూర్ సంతోష్‌సింగ్, ఆర్గనైజర్ సెక్రటరీ ఠాకూర్ సునితా దేవి, ట్రెజరర్ ఠాకూర్ నరేంద రసింగ్, అడ్వకేట్ ఠాకూర్ జస్వంత్‌సింగ్, మీడియా కోఆర్డినేటర్ రఘునందన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కార్యకలాపాల భద్రతపై సమీక్షా సమావేశం

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధాన విభాగాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్ల మొత్తం ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ భద్రతా సమీక్ష సమావేశంలో ప్రయాణీకుల, రైలు నిర్వహణలో భద్రతను నిర్ధారించడానికి ట్రాక్‌ల నుండి తీసిన వ్యర్థ సామాగ్రిని సకాలంలో తొలగించడం ప్రాముఖ్యతపై దృష్టి సారించారు. స్టేషన్లలో హింగ్డ్ స్కాచ్ బ్లాక్‌ల ట్రయల్ అమలును ఆయన సమీక్షించారు. విద్యుదాఘాత సంఘటనలను నివారించడానికి ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ (టి.ఆర్.డి) సిబ్బంది భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని నొక్కి చెప్పారు. తరువాత జనరల్ మేనేజర్ లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఓపెన్ రోడ్ ట్రాఫిక్‌ను అప్రమత్తంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని హైలైట్ చేశారు. గేట్‌మెన్, రైల్వే సిబ్బందిని సరైన రీతిలో విధులను కేటాయించి వారిని వినియోగించుకోవాలని తెలిపారు. తదనతరం జనరల్ మేనేజర్ ఆకతాయిల వల్ల కలిగే సిగ్నల్ కేబుల్ కోతలను పరిష్కరించడంలో అధికారులు వేగంగా స్పందించడాన్ని ప్రశంసించారు. పశువుల రన్ ఓవర్ కేసులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. నిఘాను పెంచడానికి గూడ్స్ షెడ్‌లు, ప్రైవేట్ సైడింగ్‌ల వద్ద సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. సజావుగా రైలు కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి వాటి కార్యాచరణను నిర్ధారించే ఫాగ్ సేఫ్ పరికరాలు, జి.పి.ఎస్ ట్రాకర్ల కార్యాచరణ సంసిద్ధతను నొక్కి చెప్పారు.

అదనంగా, భద్రతా ప్రమాణాలను పెంచడానికి లోకోమోటివ్‌లు, రోలింగ్ స్టాక్, విద్యుత్ వ్యవస్థలు మొదలైన వాటిపై ఖచ్చితమైన డేటాను పొందుపరచడం ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. జనరల్ మేనేజర్ సమావేశాన్ని ముగిస్తూ, క్షేత్రస్థాయి పర్యవేక్షణలను తీవ్రతరం చేయాలని, భద్రతా సంబంధిత సమస్యలు, ప్రమాద విచారణలను సకాలంలో పరిష్కరించాలని పిలుపునిచ్చారు. భద్రతా విభాగ సిబ్బందికి రిఫ్రెషర్ కోర్సుల ద్వారా క్రమం తప్పకుండా శిక్షణ, అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. జనరల్ మేనేజర్ భద్రత అనేది నిరంతర బాధ్యతని, జోన్ వ్యాప్తంగా రోజువారీ కార్యకలాపాలలో చేర్చాలని, చురుకైన, జవాబుదారీ భద్రతా సంస్కృతిని పెంపొందించాలని పునరుద్ఘాటించారు.

బీసీల రాజ్యాధికారానికి పోరాటం చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సంఘం అధినేత ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేస్తూ ఈనెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ చూస్తూనే ఉన్నాం ఏళ్ల తరబడి బీసీలకు రాజకీయ అన్యాయం జరుగుతూనే ఉంది. ఇక బీసీలం ఒకరికొకరం చేతులు కలుపుకొని బీసీల రాజ్యాధికారం కోసం పోరాటం చేయడం తప్పదని అన్నారు. అన్యాయం జరుగుతుందని తెలిసి కూడా ఎదిరించకపోవడం బానిసత్వం అవుతుందని అన్నారు. ఇప్పుడు నువ్వు తల ఎత్తి ప్రశ్నించకపోతే జీవితం మొత్తం తరతరాలుగా తలవంచకు బతకాల్సిందే. నువ్వు బీసీ వా బయటికి రా... మనకు కావాల్సింది సాధించుకుందాం. బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలి. తద్వారా బీసీలకు రాజకీయ అధికారం రావాలి. నువ్వు కదలకపోతే నిన్ను కదలకుండా చేస్తారు. ఈనెల 14న నిర్వహిస్తున్న రాష్ట్ర బందును మనమందరం కలిసి విజయవంతం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ ఐకమత్యాన్ని చాటుదాం. మనమందరం ఐక్యంగా కలిసి పోరాడితేనే మన రిజర్వేషన్లు మనకు అమలవుతాయి. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు డాక్టర్ అరుణ్ కుమార్, సీనియర్ బిసి నాయకులు రామస్వామి, కంటెస్టడ్ ఎమ్మెల్యే ఒంగోలు శ్రీనివాస్ యాదవ్, బీసీ సంఘాల నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు.

జాతీయ రికార్డును బద్దలు కొట్టి స్వర్ణ పథకం సాధించిన బీసీ గురుకుల విద్యార్థి

అభినందించిన మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హనమ్‌కొండ బాయ్స్ బీసీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లక్షిత్ సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య'లో పాల్గొన్ని జాతీయ రికార్డును బద్దలు కొట్టి స్వర్ణ పతకం సాధించాడు. భువనేశ్వర్‌లో నిర్వహించిన నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ట్రయథ్లాన్ కేటగిరీలో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి కంచు లక్షిత్ బంగారు పతకాన్ని సాధించాడు. తెలంగాణకు చెందిన లక్షిత్.. ట్రయథ్లాన్ ఈవెంట్లో స్వర్ణ పతకం సాధించి రాష్ట్ర కీర్తిని జాతీయ స్థాయిలో నిలబెట్టాడని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సెక్రటరీ శ్రీధర్, ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. 2510 పాయింట్లతో జాతీయ రికార్డును బద్దలు కొట్టడం అభినందనీయం అన్నారు. విద్యార్థుల్లో ఉన్నా క్రీడా స్ఫూర్తిని గుర్తించి ప్రభుత్వం వారిని ప్రోత్సహించడం ద్వారా జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని క్రీడా పోటీల్లో తెలంగాణ విద్యార్థులు పతకాలు సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఖమ్మం జిల్లా పరిధిలో గల ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, మధిర, వైరా, సత్తుపల్లి, ఏదిలాపురం, కల్లూరు తదితర మున్సిపాలిటీలలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసు రత్నం డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాదులోని తెలంగాణ కమిషనర్, డైరెక్టర్ అఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఏ)లోని జాయింట్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 16 మందిని కార్పొరేషన్ నుండి నేరుగా అవుట్సోర్సింగ్ వర్కర్స్‌గా గుర్తించడానికి జులై 23వ తేదీన కౌన్సిల్‌లో తీర్మానం చేసి సిడిఎంఏకు పంపారని అయినా ఇంతవరకు ఎటువంటి పిలుపు రాకపోవడంతో వారే నేరుగా సిడిఎంఏకు రావడం జరిగిందన్నారు. ఆ 16 మంది వర్కర్లను ప్రభుత్వం వెంటనే ఔట్సోర్సింగ్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. వైరా మున్సిపాలిటీకి సంబంధించి 50 మంది కార్మికులను 2018లో స్పెషల్ డ్రైవ్‌లో తీసుకున్నారని వారికి నెలకు కేవలం 10,500 మాత్రమే చెల్లిస్తున్నారని వాస్తవానికి వారికి కూడా జీవో నెంబర్ 14 ప్రకారం జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయంపై అక్కడి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కల్లూరు మున్సిపాలిటీగా మే 26వ తారీకున ఏర్పడిందని ఇప్పటివరకు ఉద్యోగులకు సంబంధించిన బదలాయింపు పూర్తి కాలేదు అన్నారు. తద్వారా దాదాపు 107 మంది కార్మికులకు ఐదు నెలల నుండి శాలరీ రావడం లేదని దానికి కారణం కేవలం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. మధిర మున్సిపాలిటీలో పనిచేస్తున్న కొంతమంది కార్మికులకు ఈఎస్ఐ చెల్లించడం లేదని తద్వారా ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు ఆ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతా రని కనుక అధికారులు స్పందించి ఎవరెవరుకు ఈఎస్ఐ చెల్లించలేదు వారిని గుర్తించి తక్షణమే చెల్లించాలన్నారు. ఏదులాపురం సత్తుపల్లి తదితర మున్సిపాలిటీలలో జనాభాకు తగిన కార్మికుల సంఖ్య లేకపోవడం కారణంగా కార్మికులు తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారని, జనాభా ప్రాతిపదికన దక్షిణమే నూతనంగా కార్మికులను నియమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి వి.హరినాథ్, రాష్ట్ర నాయకులు ఎం.మద్దిలేటి, ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఖమ్మం జిల్లా మున్సిపల్ స్టాఫ్, ఔట్సోర్సింగ్ వర్కర్ యూనియన్ నాయకులు గుడ్ల మహేష్ బాబు, బుర్ర రవి, లింగాల అజయ్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టాలి

విశాలాంధ్ర- కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీలోని పాత జాతీయ రహదారి నుంచి పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వైపు వెళ్లే రోడ్డులో ప్రభుత్వ పాఠశాల భవనం ప్రహరీకి ఆనుకుని అక్రమంగా నిర్మించిన భవనం, డబ్బాలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సోమవారం స్థానికులు మున్సిపల్ కమిషనర్ బాలాజీకి వినతిపత్రాన్ని అందజేశారు. పాత మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు అసలే ఇరుకుగా ఉండి దానికి తోడు కూరగాయలు, చిరు వ్యాపారాలు రోడ్లపై విక్రయాలు కొనసాగిస్తుండడంతో వాహనాలు వచ్చిపోయేందుకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వివరించారు. దీంతో రోడ్డు పక్కన డబ్బాలు, ఇతర భవనాలను తొలగించి విశాలమైన రోడ్డు నిర్మాణం చేపడితే వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తీరుతుందని వారు పేర్కొన్నారు. పాఠశాల గోడకు ఉన్న స్థలంలో చిరు కూరగాయల వ్యాపారాలు నుంచి కొందరు రోజు వారీగా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'విశాలాంధ్ర' కథనానికి స్పందించిన మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్

విశాలాంధ్ర-దుండిగల్: విశాలాంధ్ర కథనానికి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్ స్పందించారు. సోమవారం విశాలాంధ్ర పత్రికలో వెలువడిన" మల్లంపేట్‌లో బరితెగించి నిర్మిస్తున్న 'బడా బిల్డర్లు' అనే శీర్షిక కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ భవనాలను కూల్చివేతలు చేపట్టారు. మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, టిపిఓ సంజన, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సతీష్, వేణు, తిరుపతి బ్రేకర్ సహాయంతో గోడలు, స్లాబ్‌లను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ అనుమతి లేకుండా ఎటువంటి అక్రమ నిర్మాణం చేపట్టిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు 23న ఛలో రాజ్‌భవన్

విశాలాంధ్ర - బషీర్ బాగ్: స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుపడుతున్న కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర గవర్నర్ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 23న ఛలో రాజ్‌భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని బీసీలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచాల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో బీసీ రిజర్వేషన్లు చేర్చి ఉంటే న్యాయపరమైన అవరోధాలు ఉండేవి కావని, బీసీ రిజర్వేషన్ల చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదన్నారు. రాజ్యాంగ బద్ధంగా విధులు నిర్వహించాల్సిన గవర్నర్ అందుకు విరుద్ధంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ బద్ధంగా విధులు నిర్వహించడం చేతకాకపోతే తన గవర్నర్ పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత దక్కడానికి మొదటి నుండి బీసీ సమాజమంతా తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ బిజెపి నేతలు మాత్రం బీసీ రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని పదేపదే బీసీ సమాజాన్ని తప్పుదోవ పట్టించారని, బిజెపి నేతలు రాష్ట్ర గవర్నరును కలిసి ఉంటే గవర్నర్ సానుకూల నిర్ణయం తీసుకునే వారనీ, ఇదేమి చేయకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ అనడం సిగ్గుచేటన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నదెవరో బీసీలను రాజకీయంగా వాడుకుంటున్నదెవరో ఈనెల 23 న తెలుస్తుందన్నారు. రాజకీయ పార్టీలు డ్రామాలు ఆపి బీసీ రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు. బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోటూరి రవీందర్, వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా, నాయకులు దేవర శివ, ధర్మేంద్ర సాగర్, బత్తుల జితేందర్, రేనట్ల మల్లేష్, అస్కని రమేష్, యశ్వంత్ గౌడ్, నరేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త స్నీకర్లు, మహిళల కలెక్షన్లను ప్రదర్శించిన క్యాంపస్

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : భారతదేశంలోని అగ్రగామి స్పోర్ట్స్, అథ్లెజర్ బ్రాండ్‌లలో ఒకటైన క్యాంపస్ యాక్టివ్‌వేర్ లిమిటెడ్ హైదరాబాద్‌లో తమ వార్షిక రిటైలర్ సమావేశం 2025ను నిర్వహించింది. ఈ సమావేశానికి 243 మందికి పైగా రిటైల్ భాగస్వాములు హాజరయ్యారు. ఛానల్ భాగస్వామి స్నేహలత అసోసియేట్స్ సహకారంతో ఈ ఈవెంట్‌ను నిర్వహించారు. దీని థీమ్ "కలిసి కదలండి, కలిసి ఎదగండి. ఇది క్యాంపస్ ప్రధాన నినాదం "మూవ్ యువర్ వే"ను ప్రతిబింబిస్తూ, తమ రిటైల్ భాగస్వాములతో కలిసి ఎదగాలనే నమ్మకాన్ని బలపరిచింది. క్యాంపస్ యాక్టివ్‌వేర్ లిమిటెడ్ సీఈఓ నిఖిల్ అగర్వాల్ మాట్లాడుతూ, "మేము తయారుచేసే ప్రతి జత షూ కస్టమర్‌కు చేరినప్పుడే దానికి పూర్తి విలువ వస్తుంది. ఆ పనిని మా రిటైలర్లే సాధ్యం చేస్తున్నారు. ఈ సమావేశం కేవలం కొత్త ఉత్పత్తులను ప్రదర్శించడం మాత్రమే కాదు. ఇది మనం కలిసి చేస్తున్న ప్రయాణాన్ని, మారుతున్న కస్టమర్ల అభిరుచులను తెలుసుకోవడాన్ని వేడుక చేసుకోవడం. కొత్త ట్రెండీ స్నీకర్ల నుండి మహిళల అథ్లెజర్ వరకు, దేశవ్యాప్తంగా మా ఎదుగుదలకు మా భాగస్వాములే ముఖ్య ఆధారం" అని అన్నారు. ఈ బ్రాండ్, భారతదేశ రోజువారీ జీవనశైలికి సరిపోయేలా తయారుచేసిన వివిధ రకాల కొత్త ఉత్పత్తులను ప్రదర్శించింది. ఈ ఏడాది మొదట్లో నిర్వహించిన 'షూకేస్ 2025' మాదిరిగానే, ఈ సమావేశం కూడా ఉత్సాహంగా జరిగింది. ఇక్కడ లైవ్ డెమోలు, ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న తమ కొత్త కలెక్షన్లను రిటైలర్లకు చూపించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే భారీ జరిమానా

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ నగర పాలక సంస్థ యందు పలు చెత్త వేయు ప్రాంతాలను గుర్తించి తక్షణమే చెత్తను శుభ్రం చేయవలనని పారిశుధ్య అధికారులను, సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. ఇందుకు గాను ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం (స్పెషల్ శానిటేషన్ డ్రైవ్) నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి ఆదేశాలతో నేడు 7వ డివిజన్ శివాలయం రోడ్డు యందు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం చెత్తను తొలగించడం జరిగినది. ఈ సందర్భంగా కమీషనర్ ఎ.శైలజా మాట్లాడుతూ ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినచో వారికి భారీ జరిమానాతో పాటు క్రిమినల్ చర్యలు మున్సిపల్ చట్టం అనుసరించి విధించబడునని హెచ్చరించారు. కావున అందరు చెత్తను స్వచ్ఛ వాహనాలకు అందచేసి స్వచ్ఛ బోడుప్పల్ కోరికు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, సంగీత, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త బస్‌స్టాప్‌ను ప్రారంభించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి తండా ప్రాంతంలో హైనసర్ ఆక్వాంటిస్ (బ్రిక్స్ స్కైవుడ్స్) సమీపంలో కొత్త బస్‌స్టాప్‌ను సోమవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి, బార్కత్పురా డిపో మేనేజర్ ఆర్.మంజులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ బస్‌స్టాప్ ఏర్పాటు వలన పరిసర ప్రాంత నివాసితులకు రవాణా సౌకర్యాలు మరింత సులభతరం కానున్నాయని, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు వృద్ధులకు ఇది ఎంతో ఉపయుక్తమవుతుందని తెలిపారు. అలాగే, బస్‌స్టాప్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణానికి తన వ్యక్తిగత నిధులు వెచ్చిస్తానని తెలిపారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులను పెంచాలని, కొత్త రూట్లను ప్రవేశపెట్టాలని అభ్యర్థించారు. ఇందుకు మంజులా సానుకూలంగా స్పందించి, వారి వినతులను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ బస్ స్టాప్ ప్రారంభం స్థానిక ప్రాంత ప్రజలకు రవాణా సౌకుమార్యం మెరుగుపడటానికి ఒక మంచి ముందడుగనీ కార్పొరేటర్ పేర్కొన్నారు. అనంతరం బ్రిక్స్ స్కైవుడ్స్ గేట్ కమ్యూనిటీ క్లబ్ హౌస్‌లో జరిగిన సమావేశానికి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోనర్ ఆక్వాంటిస్ (బ్రిక్స్ స్కైవుడ్స్) నివాసితులు తమ ప్రాంతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రహదారుల పనులు, పాత్ హెూల్స్ మరమ్మత్తులు, ఓపెన్ నాలా కవరింగ్, లేక్ డెవలప్మెంట్, స్మశాన వాటిక సుందరీకరణ, తాగునీటి వసతి మెరుగుదల, వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు పారిశుధ్య పనులను మెరుగుపరచాలని కోరారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు హనుమంత్ నాయక్, (బ్రిక్స్ స్కైవుడ్స్) ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ బి ఆర్ రెడ్డి,హెూనర్ ఆక్వాంటిస్ ప్రెసిడెంట్ చిదంబరం, వైస్ ప్రెసిడెంట్ సందీప్, కమ్యూనిటీ సభ్యులు నవీన్, శంకర్, సీనియర్ నాయకులు గోపి నాయక్, రాజు నాయక్, సుమన్, నరసింహ, నర్సింగ్, ప్రకాశ్, రాథోడ్, శ్రీశైలం, హెూనర్ ఆక్వాంటిస్ బ్రిక్స్ స్కైవుడ్స్ అపార్ట్మెంట్ వాసులు, మహిళలు, పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హాఫీజ్పేట్, చందానగర్, భారతి నగర్(పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన మంజూరైన 186 మంది లబ్ధిదారులకు 1,86,21,576 రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి చెక్కుల రూపేణా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోజు 20 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయం అని గాంధీ తెలియచేసారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తారు అని గాంధీ కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదింటి వారి ఇండ్లలో సంతోషంతో ఆడ పిల్లల పెండ్లి జరగాలని సదుద్దేశంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అని కోరారు. రెవెన్యూ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రవీందర్ యాదవ్‌కు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి యువనేత, భారాస పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్‌కు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీష్ రావుల ఆశీస్సులను రవీందర్ యాదవ్ తీసుకున్నారు. అనంతరం కేటీఆర్, హరీష్ రావు మాట్లాడుతూ.. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న రవీందర్ యాదవ్ కు రానున్న రోజుల్లో మంచి అవకాశం లభిస్తుందని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలో రానున్న ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించినట్లుగా ఆయన వెల్లడించారు. కష్టపడిన కార్యకర్తలకు పార్టీ అవకాశం ఇస్తుందన్నారు. ఉద్యమకాలం నుంచి పార్టీ కోసం రవీందర్ యాదవ్ శ్రమిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్టీ నిర్ణయమే శిరోధార్యంగా పని చేసి విజయతీరాలకు చేర్చారని ప్రశంసించారు. శేరిలింగంపల్లిలో పార్టీ బలోపేతం దిశగా మరింత కృషి చేయాలన్నారు. జన్మదినం సందర్భంగా కేటీఆర్, హరీష్ రావును కలిసిన రవీందర్ యాదవ్ కు.. కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. భారాస పార్టీ ముఖ్య నేతలు సైతం విష్ చేశారు. రవీందర్ యాదవ్ శేరిలింగంపల్లిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణపై కేటీఆర్, హరీష్ రావు సంతోషం వ్యక్తం చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశీస్సులు తీసుకున్న రవీందర్ యాదవ్ కు ఈ సందర్భంగా మంచి భవిష్యత్ ఉందని సూచించారు. అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. వచ్చే ప్రతి ఎన్నికల్లో భారాసదే విజయం అని ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ సూచనలతో పార్టీ బలోపేతం దిశగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

మాగంటి కుటుంబానికి అండగా ఉందాం...

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఒకప్పుడు తెలంగాణ అంటే పరిశ్రమలకు నిలయం అని, నేడు కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దివాలా తీసిందని, నవంబర్‌లో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తేనే 6 గ్యారంటీలు 420 హామీలు అమలు అవుతాయి. ఉప ఎన్నికల్లో మాగంటి సునీతని గెలిపించుకునే బాధ్యత మనందరిది అని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని డివిజన్ లో ఇన్చార్జీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఓటమి భయం పట్టుకుంది

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జూబ్లీహిల్స్‌లో ఓడిపోతామనే భయం పట్టుకుందని అందుకే దొడ్డిదారులు వెతుకుతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. ఒక్క ఇంట్లో ఓట్లు ఎక్కువ ఉన్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని దుయ్యబట్టారు. సోమవారం కేటీఆర్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి బీఆరెస్ బృందం కలవడంపై వెంకట్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత ఓటరు జాబితా ప్రకారమే ఎన్నికలకు వెళ్తామని ఎన్నికల సంఘం చెప్పిందన్నారు. నిజంగా ఓటరు జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ఓటరు లిస్టుతో కాంగ్రెస్ పార్టీకి ఏం సంబంధం, రాష్ట్ర ప్రభుత్వానికి ఏం సంబంధమో అర్థం కావడం లేదన్నారు. అధికారం నుంచి ప్రజలు తన్ని తరిమేసినా... కేటీఆర్‌కు అహంకారం మాత్రం తగ్గటం లేదని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో పంచ్ కొడితే... ఢిల్లీలో తాకాలి అంటున్న కేటీఆర్.... అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు పంచ్ ఇస్తే... పోయి ఫామ్ హౌస్ లో పడ్డావు మరచిపోయినవా...? అని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందుకే ముందుగానే కేటీఆర్ కు ఓటమి భయం పట్టుకుందన్నారు.

వీధి కుక్కల దాడిలో 30 మేకలు మృత్యువాత

విశాలాంధ్ర - మొయినాబాద్: వీధి కుక్కల దాడిలో 30 మేకలు మృత్యువాత పడిన ఘటన మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్ నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. అజీజ్ నగర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బొంతల రాజు యాదవ్ తన వద్ద 30 పైగా మేకలు, గొర్రెలు ఉన్నాయి. ఆదివారం బొంతల రాజు యాదవ్ రోజువారీగా తన మేకలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం తన పొలం వద్ద వాటిని బంధించి ఇంటికి వెళ్ళాడు.వీధి కుక్కలు మేకలపై ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో 30 పైగా మేకలు మృతి చెందాయి. సోమవారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లిన రాజు యాదవ్ మృతి చెందిన మేకలను చూసి లబో దిబో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ మృతి చెందిన మేకలను చూస్తూ మా కుటుంబం జీవనాధారమంతా వీటిపైనే ఆధారపడి ఉన్నామని ఆరోపిస్తూ ఏడవ సాగారు. దీంతో గ్రామస్తులు అక్కడికి చేరుకొని బాధితుని ఓదారుస్తూ.. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల నియంత్రణ పై తక్షణమే చర్యలు తీసుకొని నష్టపోయిన గొర్రెల కాపరి బొంత రాజు యాదవ్ ను ప్రభుత్వము ఆదుకోవాలని కోరారు.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు



విశాలాంధ్ర - మేడిపల్లి: మహిళా అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖిల్లా వరంగల్ వాస్తవ్యుడైన గోగు దామోదర్ గత ఐదు సంవత్సరాలు కిందట తన భార్య పిల్లలతో బోడుప్పల్ బొల్లిగూడెంకు వచ్చి నివసిస్తున్నాడు. గత రెండు నెలల నుండి తన భార్య గోగు రవళిక వయసు 32 సంవత్సరాలు వృత్తి గృహిణి తరచుగా ఫోన్లో మాట్లాడుతుందని ఇట్టి విషయంపై భార్యాభర్తలు ఇద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. అక్టోబర్ 1వ తేదీన ఇదే విషయంపై గొడవ పడగా మరుసటి రోజు ఉదయం రవళిక ఇంట్లో నుండి వెళ్లిపోయినది ఇదే విషయం దామోదర్ కు తన కూతురు ఫోన్ చేసి చెప్పడంతో ఇట్టి విషయంపై దామోదర్ మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. కావున ఇట్టి విషయంపై ఏమైనా సమాచారం తెలిసినచో మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సీఐ గోవింద రెడ్డి కోరారు.

కదం తొక్కిన ఉద్యోగులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ ఉద్యోగులు కదం తొక్కారు. తుది పోరాటానికి సిద్ధమయ్యామని మెరుపులా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (ఏపీఎస్‌పీఈ జేఏసీ) పిలుపుతో విద్యుత్ రంగ ఉద్యోగులు గర్జించారు. విజయవాడ గాంధీనగర్ ధర్నా చౌక్ ఎప్పుడూ చూడని విధంగా ఉద్యోగ సంద్రంగా మారింది. నినాదాలు మారుమోగాయి. 'ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి. న్యాయం జరిగే వరకు తగ్గేది లేదు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలి. కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి' అంటూ పెద్దఎత్తున నినదించారు. చలో విజయవాడ పిలుపుతో రాష్ట్ర నలుమూలల నుంచి బస్సులు, రైళ్లు, వ్యాన్లు ఎక్కి వేలాది మంది విద్యుత్ ఉద్యోగులు విజయవాడ రావడంతో ధర్నాచౌక్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, అనుబంధ యూనియన్లు, అసోసియేషన్ల నేతలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. పరిసరాల్లో పోలీసు పహారా ఉన్నా నినాదాల జ్వాల ఆగలేదు. ప్రతి నినాదమూ ఒక గర్జనలా, ప్రతి గర్జన ఒక సంకేతంలా మారింది. ప్రభుత్వం దిగిరావాల్సిందేనని గళమెత్తారు. పోలీసుల అవరోధాలు, అడ్డంకులు, మధ్యలో వర్షపు జోరు...ఏదీ వారిని నిలువరించలేకపోయాయి. వర్షపు చినుకులు ముఖంపై పడ్డా... నినాదాల ఉధృతి మాత్రం తగ్గలేదు. జేఏసీ చైర్మన్ ఎస్.కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన మహాధర్నాలో సభా వేదికపై నాయకులు దిక్కులు పిక్కటిల్లేలా గర్జించారు. విద్యుత్ సంస్థల యాజమాన్యంపైన, చంద్రబాబు ప్రభుత్వంపైనా ధ్వజమెత్తారు. ఉద్యోగులపై యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతల ప్రసంగాలకు వేదిక చుట్టూ ఉన్న వేలాదిమంది విద్యుత్ ఉద్యోగులు చప్పట్లు, ఆవేశపూరిత నినాదాలతో మద్దతిచ్చారు. 29 డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వానికి జేఏసీ ఈనెల 15వ తేదీ నుంచి సమ్మె నోటీసు ఇచ్చింది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకుగాను మహాధర్నా తలపెట్టగా... రాష్ట్ర నలుమూలల నుంచి విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, అనుబంధ యూనియన్లు, అసోసియేషన్ల నేతలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు పెద్దఎత్తున కదం తొక్కడంతో ధర్నా చౌక్ నలుదిక్కులా దద్దరిల్లిపోయింది. ఉద్యోగులతో కిక్కిరిసిపోయింది. డిమాండ్ల నినాదాలతో మారుమోగింది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యుత్ రంగ సమస్యల పరిష్కారంపై వివిధ రూపాలు, నిరసనల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి అనేకసార్లు సమస్యలను దాని దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించలేదన్నారు. ఐక్యకార్యాచరణతో విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మహాధర్నాతో గర్జించడం చారిత్రాత్మకమైన రోజని కొనియాడారు. ఇది ప్రభుత్వంలో కదలిక తెచ్చే ఉద్యమమని నొక్కిచెప్పారు. విద్యుత్, అనుబంధ రంగ సంఘాలన్నీ ఒకే వేదికపైకి వచ్చి సమన్వయంగా నడపాల్సిన బాధ్యత జేఏసీపై ఉందన్నారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు. ప్రభుత్వంతో చర్చలు సఫలం కాకపోతే భవిష్యత్తులో కొనసాగే ఉద్యమానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు. అన్ని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలను కలుపుకొని పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. డిమాండ్లు సాధించే వరకు ఉద్యోగులు ఎక్కడా వెనక్కి తగ్గవద్దని చెప్పారు. గ్రామం నుంచి పట్టణాల వరకు విద్యుత్ రంగ కార్మికులు చేపట్టే ఉద్యమానికి ఏఐటీయూసీ మద్దతిస్తుందన్నారు. జేఏసీ వైస్ చైర్మన్ బి.రామలింగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా ముందుకొచ్చి విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేకుంటే 15వ తేదీ నుంచి జరిగే సమ్మె చరిత్రలోనే పెద్దది అవుతుందన్నారు. ప్రభుత్వం మేల్కొని ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి దిగిరాలన్నారు. విద్యుత్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకుడు బాలకాశీ మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు విద్యుత్ రంగానికి వెన్నెముక అని, తాము శ్రమిస్తున్నాం, త్యాగం చేస్తున్నాం, కానీ మాకు న్యాయం మాత్రం దూరమైపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మహాధర్నా వేదికపై జేఏసీ, విద్యుత్, అనుబంధ యూనియన్ల నేతలు ఎంవీ రాఘవరెడ్డి, కేవీ శేషారెడ్డి, ఎ.శ్రీనివాస కుమార్, ఎంవీ గోపాలరావు, జి.నాగేశ్వరరావు, ఏవీ కిరణ్, జేకే వీరభద్రయ్య, కె.అప్పారావు, కె.శ్రీనివాస్, జె.వేణు, టి.అంజయ్య, ఎస్ఎం.బాషా, వి.దేవేంద్రరెడ్డి, గణపతి, ఆర్.మురళీధర్, ఆర్.సంజీవరావు, ఇ.సురేశ్, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పొన్నం శివయ్య, కె.బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, విజయవాడ జేఏసీ చైర్మన్ బి.నాగేశ్వరరావు ప్రసంగించారు.

చర్చలు విఫలం: జేఏసీ

విద్యుత్ యాజమాన్యంతో తమ చర్చలు సఫలం కాలేదని, దీంతో ఈనెల 15వ తేదీ నుంచి సమ్మె యథాతథంగా ఉంటుందని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేతలు వెల్లడించారు. గుణదల విద్యుత్ సౌధలోని ఉమ్మడి విద్యుత్ యాజమాన్య సంస్థలు సోమవారం సాయంత్రం జేఏసీ కన్వీనర్ ఎస్.కృష్ణయ్య అధ్వర్యంలో జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర యాజమాన్యాలతో చర్చలు జరిగాయి. విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నుంచి 30 మంది ప్రతినిధుల బృందం చర్చలకు హాజరైంది. అనంతరం కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ తమ 29 డిమాండ్లలో కొన్నింటిపైనే స్పష్టత ఇచ్చారని, ప్రధానమైన డిమాండ్లపై స్పందించలేదన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోతే ఆందోళనలు యథాతథంగా కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ చర్చలు సానుకూల వాతావరణంలో కొనసాగలేదన్నారు. విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేతలు రామలింగారెడ్డి, బాలకాశి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులపై కసరత్తు

విశాలాంధ్ర- సచివాలయం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతుల కల్పనకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా పదోన్నతుల కల్పనపై అధ్యయనానికి సోమవారం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. పది మంది మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవోఎం కమిటీలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, పయ్యావుల కేశవ్, నారాయణ, సత్యకుమార్ యాదవ్, అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, జి.సంధ్యారాణి సభ్యులుగా ఉన్నారు. పదోన్నతులు ఇచ్చే విభాగాలు, పద్ధతులపై అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్‌మీడియేటరీ పోస్టులు సృష్టిస్తే... వాటికి పే స్కేల్ నిర్ణయించాలని జీవోఎంను ప్రభుత్వం ఆదేశించింది. ఇతర విభాగాల్లో ఒకే పని స్వభావం కల్గిన ప్రమోషన్ ఛానల్ కల్పించే అంశంపై అధ్యయనం చేయాలని, పదోన్నతులు ఖరారు చేసేందుకు సంబంధిత విభాగాలకు సూచనలు జారీ చేయాలని సూచించింది. పదోన్నతుల తర్వాత హేతుబద్ధీకరణ నిబంధనల ప్రకారం ఖాళీలు భర్తీ చేసే పద్ధతిపై చర్చించి, వీలైనంత త్వరగా అధ్యయనం పూర్తి చేసి... సిఫార్సులతో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

కరూర్ తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు

పర్యవేక్షణకు ముగ్గురు సభ్యుల కమిటీ: సుప్రీం

న్యూదిల్లీ: టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించింది. సీబీఐ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు నిరాకరించడంతో పిటిషనర్లు సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దర్యాప్తుపై పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. కరూర్ తొక్కిసలాటపై జస్టిస్ జేకే మహేశ్వరి, ఎన్‌వీ అంజరియాతో కూడిన ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది. దీనిపై అన్ని పార్టీలు వ్యక్తంచేస్తున్న అనుమానాలు తొలగాలంటే సమగ్ర దర్యాప్తు అవసరమని, అందువల్లే ఈ కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రతినెలా కేసు పురోగతిని కోర్టుకు సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును విజయ్ ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి అస్రాగార్గ్ అధ్వర్యంలో సిట్ ఏర్పాటైంది. పోలీసుల దర్యాప్తు, అధికారుల పాత్రపై తాము ఇదివరకే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ... రాష్ట్ర పోలీసు అధికారులతోనే మద్రాస్ హైకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసిందని టీవీకే తన పిటిషన్‌లో పేర్కొంది. తమ పార్టీపై సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించింది. విజయ్‌కు నాయకత్వ లక్షణాల్లేవని, ఘటన జరిగిన వెంటనే ఆ పార్టీ నేతలంతా పారిపోయారని వ్యాఖ్యానించిన మద్రాసు హైకోర్టు... కరూర్ ఘటనపై ఆ పార్టీ తీరును తీవ్రంగా ఖండించింది. ఈ విషయాన్ని టీవీకే పార్టీ తన పిటిషన్‌లో ప్రస్తావించింది.

ఇక నూరుశాతం విత్‌డ్రా

పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త

నిబంధనలు సవరించిన ఈపీఎఫ్ఓ

న్యూదిల్లీ: పీఎఫ్ ఖాతాదారులు ఇకపై ప్రత్యేక సందర్భాల్లో తమ ఈపీఎఫ్ ఖాతాలోని డబ్బును పూర్తిగా ఉపసంహరించుకునేందుకు వీలు కల్పిస్తూ...ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం తీసుకుంది. 7కోట్లకు పైగా ఉన్న పీఎఫ్ ఖాతాదారుల కోసం విత్‌డ్రా నిబంధనలను సరళీకరించింది.

కేంద్ర కార్మికశాఖమంత్రి మన్సూఖ్ మాండవీయ నేతృత్వంలోని ఈపీఎఫ్ఓ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సోమవారం సమావేశమైంది. ఇందులో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు కార్మిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఈపీఎఫ్ ఖాతాదారులకు మరింత సౌలభ్యం కలిగించేందుకు, సీబీటీ 13 సంక్లిష్టమైన నిబంధనలను కలిపి, ఒక నిబంధనలోకి తీసుకొచ్చింది. దీని ప్రకారం, అనారోగ్యం, విద్య, వివాహం, గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు లాంటి అత్యవసర సమయాల్లో 100 శాతం పీఎఫ్ డబ్బు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించింది. ఉద్యోగులు తమ వాటాతో సహా యజమాని జమ చేసిన పీఎఫ్ డబ్బులు కూడా పూర్తిగా వినియోగించుకోవచ్చు. ఇంతకు ముందు వివాహం, విద్య రెండింటికీ కలిపి కేవలం 3 సార్లు మాత్రమే పీఎఫ్ అకౌంట్ నుంచి పాక్షిక ఉపసంహరణలు చేసుకోవడానికి వీలుండేది. కానీ దానిని ఇప్పుడు మరింత సరళీకరించారు. ఇకపై విద్య కోసం 10 సార్లు, వివాహం కోసం 5సార్లు ప్రావిడెంట్ ఫండ్ ఉపసంహరించుకునే వీలు కల్పించారు. అలాగే ఉద్యోగులు ఎవరైనా పీఎఫ్ విత్‌డ్రా చేయాలంటే, కనీసం 12 నెలల సర్వీస్ ఉండాలని నిర్దేశించారు. గతంలో పీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు ఉపసంహరించాలంటే, కచ్చితంగా దానికి తగిన కారణాలు చెప్పాల్సి ఉండేది. అంటే ప్రకృతి వైపరీత్యాలు, లాకౌటులు/ సంస్థల మూసివేత, నిరంతర నిరుద్యోగం, అంటువ్యాధులు మొదలైన అత్యవసర పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు ఈపీఎఫ్ఓకు చెప్పాల్సి ఉండేది. దీని వల్ల తరచుగా క్లెయిమ్‌లు రిజెక్ట్ కావడం, దీనితో ఖాతాదారుల నుంచి ఫిర్యాదులు రావడం పరిపాటిగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్యను కూడా క్లియర్ చేసే ప్రయత్నం చేశారు. ఇకపై ఈపీఎఫ్ ఖాతాదారులు తమ డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి ఎలాంటి కారణాలు చెప్పాల్సిన పనిలేదు. కానీ పీఎఫ్ ఖాతాదారులు తమ కంట్రిబ్యూషన్‌లో కనీసం 25 శాతాన్ని ఎల్లప్పుడూ నిర్వహించాలని ఒక నిబంధన తీసుకువచ్చారు. దీని వల్ల ఈపీఎఫ్ఓ ఇచ్చే అధిక వడ్డీ రేటు (ప్రస్తుతం సంవత్సరానికి 8.25 శాతం) లభిస్తుంది. దీని వల్ల పెద్ద మొత్తంలో పదవీ విరమణ నిధి సమకూరే అవకాశం ఉంటుంది. ఈ హేతుబద్ధీకరణ వల్ల ఖాతాదారులకు అవసర సమయాల్లో నిధులు అందుతాయి. చివరకి పదవీ విరమణ సమయంలో కూడా పెద్ద మొత్తంలో డబ్బులు చేతికి వస్తాయి. తాజా నిబంధనల వల్ల ఖాతాదారులు ఎలాంటి పత్రాలు సమర్పించకుండానే తమ పీఎఫ్ డబ్బులను 100 శాతం క్లెయిమ్ చేసుకునే వీలు కలుగుతుంది.

వ్యాజ్యాల పరిష్కారానికి 'విశ్వాస్ పథకం'

పీఎఫ్ వ్యాజ్యాల పరిష్కారం కోసం ఈపీఎఫ్ఓ ఇప్పుడు 'విశ్వాస్ పథకం'ను ప్రారంభించింది. పీఎఫ్ బకాయిల చెల్లింపులు ఆలస్యం కావడం లాంటి సమస్యలకు దీంతో పరిష్కారం లభిస్తుందని తెలిపింది. ఈ పథకం 6 నెలలపాటు అమలులో ఉంటుంది. తరువాత మరో 6నెలలు దానిని పొడిగిస్తారు. ఇది పీఎఫ్ ఖాతాదారులకు, పెన్షనర్లకు ఉపయుక్తంగా ఉంటుందని ఈపీఎఫ్ఓ తెలిపింది.

ఐఏఎస్‌పై అవినీతి దుమారం

భోపాల్: ప్రముఖ ఐఏఎస్ అధికారిణి సృష్టి దేశ్‌ముఖ్ గౌడ భర్త ఐఏఎస్ నాగార్జున బి.గౌడ చుట్టూ అవినీతి ఆరోపణల ఉచ్చు బిగుస్తోంది. మైనింగ్ శాఖలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఓ కంపెనీకి భారీ మొత్తంలో ప్రభుత్వం జరిమానా విధించింది. ఆ మొత్తాన్ని కోట్ల నుంచి రూ.10 వేల లోపుకు తగ్గించేలా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఆ అవినీతి ఆరోపణల్ని జిల్లా మేజిస్ట్రేట్ మేజ సిద్ధార్థ్ జైన్ ఖండించారు. 2019 బ్యాచ్ మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ నాగార్జున బి. గౌడ ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లా పంచాయతీ సీఈఓగా పనిచేస్తున్నారు. గతంలో హర్దా అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా పనిచేసే సమ యంలో మైనింగ్ శాఖ ఓ సంస్థకు విధించిన కోట్ల రూపాయల జరిమానాను భారీ మొత్తంలో తగ్గిం చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. ఆర్టీఐ కార్యకర్త ఆనంద్ జాట్ ఇదే అంశాన్ని వెలుగులోకి తెచ్చారు. ఐఏఎస్ నాగార్జున గౌడ ఓ ప్రైవేట్ సంస్థపై విధించిన రూ.51 కోట్ల అక్రమ మైనింగ్ జరిమానాను కేవలం రూ.4,032కు తగ్గించారని ఆరోపణలు గుప్పించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై హర్దా జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ మేజ సిద్ధార్థ్ జైన్ మాట్లాడుతూ మైనింగ్‌కు సంబంధించిన కేసులలో వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చారని గుర్తుచేశారు. అందులో అవినీతికి తావులేదన్నారు. సంబంధిత ప్రిసైడింగ్ అధికారి (ఐఏఎస్ నాగార్జున గౌడ) చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించారన్నారు. ఈ ఆర్డర్‌పై ఎవరైనా సంతృప్తి చెందకపోతే... దానిపై కోర్టుకు అప్పీల్ చేసుకునేలా స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చారని, ఇది న్యాయ ప్రక్రియ అని జైన్ అన్నారు.

ఆదాయ వనరుల సమీకరణపై మంత్రి వర్గ ఉపసంఘం

విశాలాంధ్ర-సచివాలయం: ఆదాయ వనరుల సమీకరణ కోసం వినూత్న చర్యలు గుర్తించేందుకు ఆరుగురు మంత్రులతో మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్యాబినెట్ సబ్ కమిటీలో సభ్యుడిగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జీవోఎం సభ్యులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేశ్, వంగలపూడి అనితను నియమించారు. ఈ కమిటీ ఆదాయ వృద్ధికి వినూత్న చర్యల గుర్తింపు, అమలుపై చర్చించాలని, నెలవారీ ఆదాయాలను, లక్ష్యాలతో పోల్చి సమీక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదాయం పెంచేందుకు చేపట్టాల్సిన సంస్కరణలు, సాంకేతికత అమలుపై సిఫార్సులు చేయాలని కోరారు. ఆదాయ వనరుల పెంపు కోసం పరిపాలనా పరంగా బలోపేతం చేయడంపై చర్చించాలని సూచన చేస్తూ... ఆదాయ వనరుల పెంపు కోసం చట్టాలు, నియమాలు, విధానాలకు సవరణల అవసరాన్ని సమీక్షించాలన్నారు. అనేక ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని, విధానపరమైన అడ్డంకులను పరిష్కరించాలని పేర్కొంది. స్వర్ణాంధ్ర 2047 దార్శనికతకు అనుగుణంగా మధ్యస్థ, దీర్ఘకాలిక ఆదాయ వ్యూహాలపై దిశానిర్దేశం చేయాలని, పని తీరుపై సమీక్ష, కొత్త చర్యలపై చర్చ, అడ్డంకులను పరిష్కారం కోసం ప్రతినెలా సమావేశం కావాలన్నారు. మంత్రుల బృందం ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సలహాలు, నివేదికలు, సిఫార్సులు చేయాలని, తదుపరి చర్యలు తీసుకోవాలని సీఎస్ కె.విజయానంద్ ఆర్థిక శాఖకు ఆదేశాలు ఇచ్చారు.

ఆసుపత్రి నుంచి దేవెగౌడ డిశ్చార్జ్

బెంగళూరు: మాజీ ప్రధాని, జేడీ(ఎస్)నేత హెచ్‌డీ దేవెగౌడ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం గతవారం బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చేరారు. అనారోగ్యం నుంచి కోలుకున్న తర్వాత సోమవారం ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. మూత్రనాళ ఇన్ఫెక్షన్ వల్ల చలి జ్వరంతో బాధపడుతున్న ఆయన అక్టోబర్ 7వ తేదీ బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. వైద్యులు ఆయనను ఐసీయూలో ఉంచి చికిత్సనందించారు. ఆరోగ్యం మెరుగుపడగానే ఆయనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. మరో 15 రోజులు దేవెగౌడను విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు కోరారని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు తనని కలవడానికి నివాసానికి రావొద్దని అభ్యర్థిస్తూ జేడీ(ఎస్) ఎక్స్‌లో పోస్టు చేసింది. విశ్రాంతి తీసుకున్న తర్వాత స్వయంగా ఆయనే జేడీ(ఎస్) పార్టీ ప్రధాన కార్యాలయం జేపీ భవన్‌కి వచ్చి అందరినీ కలుస్తారని తెలిపింది.

ఉత్తరాఖండ్‌లో 'యూసీసీ' సవరణలు

నేపాల్, టిబెట్, భూటాన్ పౌరులకు వివాహనమోదు సులభతరం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) నిబంధనలకు సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం ఇకపై నేపాల్, భూటాన్, టిబెట్ పౌరులు ఆధార్ కార్డు లేకపోయినా, ఇతర పత్రాలను ఉపయోగించి యూసీసీ కింద ఉత్తరాఖండ్‌లో వివాహం నమోదు చేసుకోవచ్చు. దీంతో ఉత్తరాఖండ్‌లో నివసిస్తున్న ఆయా దేశాల పౌరులకు ఊరట లభించనుంది. ఉత్తరా ఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో లో 8 ప్రధాన నిర్ణయాలను ఆమోదించారు. ఉత్తరాఖండ్‌లో ఈ ఏడాది జనవరి నుంచి ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరుగుతోంది. కాగా, నేపాల్, భూటాన్, టిబెట్‌తో ఉత్తరాఖండ్ సరిహద్దును పంచుకుంది. అలాగే ఆయా దేశాల పౌరులకు ఉత్తరాఖండ్ వాసులతో సంబంధాలు ఉన్నాయి. అయితే యూసీసీ అమల్లోకి వచ్చిన తర్వాత ఉత్తరాఖండ్‌లో నివసిస్తున్న నేపాల్, భూటాన్, టిబెట్ పౌరులు ఆధార్ కార్డులు లేకపోవడం యూసీసీ కింద తమ వివాహాలను నమోదు చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం యూసీసీ నిబంధనలను సవరించాలని నిర్ణయించింది. వివాహ నమోదుకు నేపాల్, భూటాన్, టిబెట్ పౌరులకు ఆధార్ కార్డును మినహాయించింది. ఏదైనా చెల్లుబాయే ఇతర పత్రాలు ఉంటే చాలని పేర్కొంది. ఈ నిర్ణయంతో ఆ మూడు దేశాల పౌరులకు ఉపశమనం లభించనుంది.

హర్యానా డీజీపీపై వేటు వేయాలి

లేకుంటే 5లక్షల ఉద్యోగులు రాజీనామాకు సిద్ధం

దళిత సంఘాల హెచ్చరిక

చండీగఢ్: హర్యానాలో సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటన సంచలనం రేపుతోంది. తన భర్త బలవన్మరణానికి డీజీపీ శత్రుజీత్ కపూర్ సహా ఉన్నతాధికారులే కారణమని ఆయన సతీమణి ఐఏఎస్ అధికారి అమ్నీత్‌కుమార్ కేసు పెట్టిన క్రమంలో ఆమెకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సంఘీభావం లభిస్తోంది. ఇందులో భాగంగానే 48 గంటల్లోగా డీజీపీని పదవి నుంచి తొలగించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. తమ డిమాండ్‌ను నెరవేర్చకపోతే హర్యానా, చండీగఢ్ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 5లక్షల వాల్మీకి సమాజానికి చెందిన ఉద్యోగులు రాజీనామా చేస్తారని హెచ్చరించాయి. పూరన్ కుమార్ ఆత్మహత్యపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 31 మంది సభ్యులతో కూడిన కమిటీ మహా పంచాయతీ కార్యక్రమం నిర్వహించింది. ఈ మేరకు చండీగఢ్ సెక్టార్ 20లోని గురు రవిదాస్ గురుద్వారాలో ఆదివారం జరిగిన మహా పంచాయతీలోని సభ్యులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు తన భర్త ఆత్మహత్యకు కారణం రాష్ట్ర డీజీపీ శత్రుజీత్ సింగ్ కపూర్, రోహతక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాలే కారణమని ఆరోపిస్తూ పూరన్ కుమార్ భార్య ఐఏఎస్ అధికారి అమ్నీత్ కుమార్ కేసు పెట్టారు. దీంతో ఈ కేసులో రోహతక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఆయన బలవన్మరణానికి ఉన్నతాధికారుల వేధింపులే కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి అమ్నీత్ ఇప్పటికే లేఖ రాశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సైనీ దోషులు ఏ స్థాయివారైనా వదిలిపెట్టేది లేదని స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా అమ్నీత్ నివాసానికి అనేకమంది రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు వెళ్లి ఆమెకు ధైర్యం చెప్పారు. పూరన్ కుమార్ భార్య అమ్నీత్ చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమెకు ఓ లేఖ రాశారు. "సామాజిక అసమానతలు, వివక్షను ఎదుర్కొంటూ పూరన్ కుమార్ ప్రాణాలు తీసుకోవడం తీవ్రమైన దుఃఖాన్ని కలిగించింది. ప్రజల బాధలను తీర్చాల్సిన అధికారులను రక్షించలేకపోవడం సిగ్గుచేటు" అని లేఖలో పేర్కొన్నారు. మరోవైపు పూరన్ కుమార్ కుటుంబాన్ని హర్యానా గవర్నర్ ప్రొఫెసర్ ఆషీమ్ కుమార్ ఘోష్ కలిసి సానుభూతి తెలిపారు. 2001 బ్యాచ్ హరియాణా క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ (52) అక్టోబర్ 7న చండీగఢ్‌లో తన నివాసంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన భార్య అమ్నీత్ పి కుమార్ ఐఏఎస్ అధికారిణి. ఆ సమయంలో ఆమె విదేశీ పర్యటనలో ఉన్నారు. సీఎంతో కలిసి అధికార పర్యటనలో భాగంగా జపాన్ వెళ్లారు. 2001 ఐపీఎస్ బ్యాచ్ హరియాణా క్యాడర్‌కు చెందిన 52 ఏళ్ల పూరన్ కుమార్ స్వరాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇటీవల ఆయన అధికారుల హక్కుల గురించి మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆయన పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఐజీగా బదిలీ అయ్యారు.

త్వరలో అమెరికాకు భారత వాణిజ్య బృందం

న్యూదిల్లీ: భారత్-అమెరికా మొదటి దశ వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం భారత ఉన్నత స్థాయి వాణిజ్య ప్రతినిధి బృందం ఈ వారం వాషింగ్టన్‌కు వెళ్లనున్నట్లు వెల్లడించాయి. ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి మాట్లాడుతూ... భారత్, అమెరికాలు మొదటి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)ను గడువులోగా ముగించాలని భావిస్తున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడం సహా మొదటి దశ వాణిజ్య ఒప్పందం గడువులోగా ముగించడమే లక్ష్యంగా మన దేశ ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధి బృందం ఈ వారం వాషింగ్టన్‌కు వెళ్లనుందని తెలిపారు. ప్రస్తుతం అమెరికాతో చర్చలు సానుకూలంగా జరుగుతున్నట్లు కూడా ఆయన వెల్లడించారు. ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో ప్రధానంగా మార్కెట్ యాక్సెస్ సమస్యలు, రెగ్యులేటరీ కో-ఆపరేషన్, ఇంధన, సాంకేతిక రంగాల్లో వాణిజ్యం విస్తరించడంపై రెండు దేశాలు దృష్టి పెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.